ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

శనివారం 17 అక్టోబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 121 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

అమెరికా స్కూల్‌లో
కాల్పుల ఘటన

ముగ్గురు చిన్నారులు మృతి

2





పాకిస్థాన్‌లో ఘోర ప్రమాదం

పెషావర్‌లో ప్రైవేట్ పాఠశాల పైకప్పు కూలి 34 మంది చిన్నారుల మృతి

2

మహిళా రిజర్వేషన్..
డీలిమిటేషన్ రాజకీయం

అక్టోబర్‌లో ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలపై ఉత్కంఠ

- ఏప్రిల్‌లో బిల్లులకు బ్రేక్.. కేంద్రం మరో వ్యూహం
- మహిళలకు 33 శాతం కోటా అమలుపై కసరత్తు
- లోక్‌సభ స్థానాల పెంపునకు కీలక ప్రతిపాదన
- దక్షిణాది రాష్ట్రాల్లో రాజకీయ వాటాపై ఆందోళన
- ప్రతిపక్షాల ఏకాభిప్రాయమే ప్రభుత్వానికి సవాల్



మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించే ప్రక్రియను వేగవంతం చేయడంతోపాటు లోక్‌సభ స్థానాలను పెంచే లక్ష్యంతో కేంద్రం 2026 ఏప్రిల్ 16న మూడు బిల్లులను ప్రవేశపెట్టింది. వీటిలో రాజ్యాంగ సవరణ, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల మార్పు, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన ముసాయిదాలు ఉన్నాయి. ఏప్రిల్ 17న జరిగిన ఓటింగ్‌లో రాజ్యాంగ సవరణ బిల్లుకు అనుకూలంగా 298 మంది, వ్యతిరేకంగా 230 మంది సభ్యులు నిలిచారు. అవసరమైన ప్రత్యేక మెజారిటీ లభించకపోవడంతో అది ఆమోదం పొందలేదు. దానిపై ఆధారపడిన మిగతా రెండు బిల్లుల పైనా ముందుకు సాగలేదు. ఏప్రిల్ 18న బడ్జెట్ సమావేశాలు ముగిశాయి.

- హైదరాబాద్ బ్యూరో, సింగిడి

దక్షిణాదికి ఏం దక్కుతుంది?

సీట్ల పునఃకేటాయింపుతో దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యం తగ్గే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి భిన్నంగా, మొత్తం స్థానాలను పెంచడం వల్ల ఆ ప్రాంతాల సభ్యుల సంఖ్య కూడా పెరుగుతుందని కేంద్రం వాదిస్తోంది. అయితే సంఖ్య పెరగడం ఒక్కటే కాకుండా, మొత్తం లోక్‌సభలో ఆయా రాష్ట్రాల వాటా ఎంత ఉంటుందన్నదే అసలు చర్చ. తుది విధానం వెల్లడయ్యే వరకు దీనిపై ఖచ్చితమైన అంచనాకు రావడం సాధ్యం కాదు.

ఏకాభిప్రాయమే కీలకం..

మహిళలకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించాలన్న లక్ష్యానికి మద్దతు ఉన్నప్పటికీ, అమలు విధానం, నియోజకవర్గాల పునర్విభజనపై రాజకీయ విభేదాలు కొనసాగుతున్నాయి. రాష్ట్రాల ఆందోళనలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వడం, అన్ని పార్టీల విశ్వాసాన్ని పొందడం ద్వారానే ప్రభుత్వం ముందడుగు వేయగలదు. ఏప్రిల్‌లో విఫలమైన ప్రయత్నం తర్వాత కొత్త మార్గాన్ని ఎంచుకుంటుందా? ప్రతిపక్షాలతో అవగాహన కుదుర్చుకుంటుందా? అన్నది రానున్న పరిణామాలపై ఆధారపడి ఉంటుంది.

సీట్ల పెంపుపై లెక్కలు..

ప్రభుత్వ ప్రతిపాదన ప్రకారం లోక్‌సభలో సభ్యుల సంఖ్యను ప్రస్తుత 543 నుంచి గరిష్ఠంగా 850కి పెంచే అవకాశం ఉంది. ఇందులో రాష్ట్రాలకు 815, కేంద్రపాలిత ప్రాంతాలకు 35 స్థానాలు కేటాయించే నమూనా చర్చకు వచ్చింది. అయితే నియోజకవర్గాల పునర్విభజనలో అనుసరించే ప్రాతిపదిక, రాష్ట్రాల మధ్య సమతుల్యతపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ముఖ్యంగా జనాభా నియంత్రణలో ముందున్న ప్రాంతాలకు భవిష్యత్తులో ఎలాంటి వాటా దక్కుతుందన్నది కీలక ప్రశ్నగా మారింది.

అక్టోబర్‌లో మరో కదలిక?

మహిళా కోటా, నియోజకవర్గాల పునర్విభజన అంశాలను తిరిగి ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అక్టోబర్ 16న వెలువడిన మీడియా కథనాలు సూచిస్తున్నాయి. మద్దతు కూడగట్టే దిశగా డీఎంకేతో పాటు కొన్ని ప్రతిపక్ష పార్టీలతో సంప్రదింపులు జరుగుతున్నట్లు సమాచారం. అయితే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల తేదీపై అధికారిక ప్రకటన వెలువడలేదు. అందువల్ల ఈ నెలలో భేటీ జరుగుతుందన్నది ఇంకా నిర్ధారణ కాలేదు. సమావేశం నిర్వహిస్తే ఏప్రిల్‌లో ఎదురైన ప్రతిష్ఠంభనను అధిగమించడమే ప్రధాన సవాల్ కానుంది.



ఆంధ్రాలో జల పండుగ..!
తెలంగాణలో క్రాప్ హాలీడే!

ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు

రైతులు కష్టాల్లో ఉన్నారు..రాష్ట్రం కష్టంలో ఉంది..
రాజకీయాలు పక్కనపెట్టి అన్నదాతలను ఆదుకోండి
నర్సంపేట నియోజకవర్గ సమావేశంలో కేటీఆర్

2

ఆంధ్రాలో 700 కిలోమీటర్ల కిందిదాకా నీళ్లు తీసుకుపోతే 70 కిలోమీటర్ల దూరమున్న మహబూబ్ నగర్‌కి కూడా నీళ్లు తీసుకోపోలేకపోతున్నాడు రేవంత్ రెడ్డి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల ద్వారా ఈరోజు తెలంగాణ దేశానికి అన్నపూర్ణగా నిలుస్తుండే.. కానీ కాంగ్రెస్ పాలన వల్ల కరువు దిశగా పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరువు అని విమర్శించారు. ఆంధ్రాలో జల పండగ ఎట్లయితది..? తెలంగాణలో కరువు ఎందుకుంటది..? అని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి పారే నీళ్లతో ఆంధ్రాలో ప్రాజెక్టులు నిండుతున్నాయి.. కానీ తెలంగాణలో క్రాప్ హాలీడే అని కాంగ్రెస్ చెబుతుంది అని మండిపడ్డారు. దండం పెట్టి ప్రభుత్వానికి చెబుతున్నా, రైతులు కష్టాల్లో ఉన్నారు, రాష్ట్రం కష్టంలో ఉంది.. రాజకీయాలు పక్కన పెట్టి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి వారిని ఆదుకోవాలి అని కేటీఆర్ కోరారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన నర్సంపేట నియోజకవర్గ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు.

-నర్సంపేట, అక్టోబర్ 16 (సింగిడి)

విదేశాల నుంచి బొగ్గు దిగుమతి...
ఏ విచారణకైనా నేను సిద్ధమే

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



యాదాద్రి పవర్ ప్లాంటు కోసం విదేశాల నుంచి బొగ్గు దిగుమతిపై ఏ విచారణకైనా సిద్ధమేనని సీఎం ప్రకటించారు. ఏ విచారణ కావాలో లేఖ రాసిన కేటీఆరే చెప్పాలన్నారు. యాదాద్రి పవర్ ప్లాంటుకు విదేశీ బొగ్గు దిగుమతికి సంబంధించి 2016లోనే కేసీఆర్ ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని రేవంత్ ఆరోపించారు.

-హైదరాబాద్, అక్టోబర్ 16 (సింగిడి)

2

అభిజీత్ దీప్కే అరెస్ట్

'లహరా దో తిరంగా' ర్యాలీ చేపట్టాలని సీజేపీ పిలుపు
పోలీసులు అదుపులో కాక్రోచ్ జనతాపార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే
నిరసన ప్రదేశంలో సెక్షన్ 163 అమలు



లెహ్రా దో తిరంగా పేరుతో శుక్రవారం సాయంత్రం ర్యాలీ చేపట్టాలని సీజేపీ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా ఢిల్లీ పోలీసులు సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కేను అదుపులోకి తీసుకున్నారు. అలాగే, ఈ ర్యాలీకి వెళ్తున్న ఏఐఎస్ఏ అధ్యక్షురాలు నేహా బోరాను కూడా ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీప్కేను ఢిల్లీ, ఝండేవాలన్‌లోని నివాసం నుంచి అదుపులోకి తీసుకోగా.. నేహా బోరాను మండి హౌజ్ నుంచి అరెస్టు చేశారు.

-న్యూఢిల్లీ, అక్టోబర్ 16 (సింగిడి)

2

ఎస్ఐఆర్ సీఈసీపై విపక్షాలు, సీజేపీ ఆరోపణలు

కౌంటర్ ప్లాన్ చేసిన బీజేపీ
విమర్శలను తిప్పికొట్టేందుకు దేశవ్యాప్త ప్రచారం!

2



ఏపీలో తీవ్ర విషాదం

గొల్లపల్లి జలాశయంలో మునిగి ఐదుగురు మహిళలు మృతి

శ్రీ సత్యసాయి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పెనుకొండ మండలం గొల్లపల్లి జలాశయంలో ప్రమాదవశాత్తు మునిగిపోయి ఐదుగురు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. దర్గాపేటకు చెందిన గాయత్రి (50), ఆమె కుమార్తె అశ్విని, ఇరుగుపొరుగు స్నేహితులు పుష్ప, హసీనా, మహిన్‌తో కలిసి శుక్రవారం జలాశయ సందర్శనకు వెళ్లారు. మధ్యాహ్నం భోజనం ముగిసిన తర్వాత సరదాగా జలాశయంలో దిగి.. ప్రమాదవశాత్తు మునిగిపోయారు.

పెనుకొండ, అక్టోబర్ 16 (సింగిడి)

2

జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్లతో
ఆర్ అండ్ డీ కేంద్రం

సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమైన హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ప్రతినిధులు



ఈ కేంద్రం ద్వారా
4,275 మందికి ఉపాధి
అవకాశాలు లభిస్తాయని వెల్లడి

కార్ల తయారీ పరిశ్రమ స్థాపించడానికి హైదరాబాద్ అనువైన ప్రాంతమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హ్యుందాయ్ ఇండియా సంస్థకు తెలిపారు. తెలంగాణలో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రితో హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ఇంజినీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యూన్ చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం సమావేశమైంది.

-హైదరాబాద్, అక్టోబర్ 16 (సింగిడి)

2



తాటాకు చప్పుళ్లకు
మోదీ ప్రభుత్వం భయపడదు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాస్వామ్య హక్కులను ప్రతిపక్ష పార్టీలు దుర్వినియోగం చేస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. దేశంలో అరాచకం సృష్టించేందుకు, కేంద్రప్రభుత్వాన్ని దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు.

న్యూఢిల్లీ, అక్టోబర్ 16 (సింగిడి)

2

ఏపీలో స్థానిక ఎన్నికల నామినేషన్ల తొలిరోజే
పలుచోట్ల ఉద్రిక్తత

టీడీపీ–వైఎస్సార్సీపీ పరస్పర దాడులు

2



స్థానిక ఎన్నికల్లో నామినేషన్ల తొలిరోజే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్నమయ్య జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పుంగనూరులో కూటమి, వైఎస్సార్సీపీ కార్యకర్తల మధ్య ఘర్షణలు రక్తసిక్తంగా మారింది. టీడీపీ, వైఎస్సార్సీపీ శ్రేణులు ఒకేసారి నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్తుండగా వారి మధ్య వాగ్వాదం చెలరేగింది. రెండు వర్గాలూ పరస్పరం రాళ్లదాడి చేసుకున్నారు.

పుంగనూరు, అక్టోబర్ 16 (సింగిడి)

దేశాన్ని అస్థిర పరిచేందుకే
ఆందోళనలు

ఇండియా బ్లాక్‌పై రాజ్‌నాథ్ సింగ్ ఆరోపణ

దేశాన్ని బంగ్లాదేశ్‌లాగా తగులబెట్టేందుకు, ప్రభుత్వాన్ని పడగొట్టేందుకే ఇండియా బ్లాక్ కూటమి ఆందోళన చేస్తోందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. యూపీలోని లక్నోలో జరిగిన ఒక కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై మండిపడ్డారు. సర్ రద్దు చేయాలంటూ, సీఈసీ రాజీనామా చేయాలంటూ ఇండియా బ్లాక్ పార్టీలు ఇటీవల ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ అంశంపైనే రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. ''ప్రజాస్వామ్య వ్యవస్థల్ని దెబ్బతీసి, దేశాన్ని తగులబెట్టేలా ఇండియా బ్లాక్ ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయి.

న్యూఢిల్లీ, అక్టోబర్ 16 (సింగిడి)



2



2

తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో
జనసేన ప్రచారం

ప్రారంభించిన పవన్ కల్యాణ్

తెలంగాణలో జనసేన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది. ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ 'జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్ ప్రచార రథాన్ని' ఇవాళ హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ప్రారంభించారు.

-హైదరాబాద్, అక్టోబర్ 16 (సింగిడి)

ఆంధ్రాలో జల పండుగ..! తెలంగాణలో క్రాప్ హాలీడే!



ముఖ్యమంత్రి విదేశీ బొగ్గు కావాలి అంటున్నాడు

సింగరేణి నిండా కుంభకోణాలు ఉన్నాయి అని నేను చెప్పిన. కాంగ్రెస్ చేసిన కుంభకోణాలని ప్రజల ముందు పెడితే రేవంత్ రెడ్డి నిన్న అడ్డగోలుగా మాట్లాడిండు. నువ్వు ఉత్తరం రాస్తే నేను విచారణకు ఆదేశిస్తా అన్నాడు. మీడియా ముందు మాట్లాడుడు కాదు, దమ్ముంటే సింగరేణి కుంభకోణం పైన ప్రతిపాదిత విదేశీ బొగ్గు కొనుగోళ్లపైన విచారణ సిట్టింగ్ జడ్జితో చెయించాలి. బొగ్గు అంశంలోనే కాదు, దమ్ముంటే నువ్వు చేసిన అక్రమాలపై కూడా సిట్టింగ్ జడ్జితో విచారణకి ఆదేశించు. నీ బామ్మర్ది సింగరేణిలో కొల్లగొట్టిన రూ. 10 వేల కోట్ల కుంభకోణంపై విచారణ వేయ్. సింగరేణిలో నువ్వు చేసిన సోలార్ పవర్ కుంభకోణం బయట పెడతా. సింగరేణిని బొందపెట్టి ఇప్పుడు 70 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసిన సింగరేణిని కాదని విదేశీ బొగ్గు తేవడానికి కుట్ర చేస్తున్నాడు.
గతంలో రాష్ట్రంలో 24 గంటల పాటు కరెంట్ పోకుండా అండగా నిలబడింది సింగరేణి. ఇప్పుడు అదే సింగరేణిని బద్నామ్ చేస్తున్నాడు రేవంత్ రెడ్డి. సంక్షోభంలోకి నెట్టిన తర్వాత ఇప్పుడు ముఖ్యమంత్రి బొగ్గు తేవాలి, కరెంట్ కొనాలి అని అంతా ఆగమైనంక చెబుతున్నాడు. సింగరేణి బొగ్గు వద్దు, భారతదేశంలో ఉండే బొగ్గు వద్దు అని అంటున్న ముఖ్యమంత్రి విదేశీ బొగ్గు కావాలి అంటున్నాడు. ఆస్ట్రేలియా నుంచి బొగ్గు కొంటే కమీషన్లు వస్తాయి. సింగరేణిలో 3,800కి టన్నుకి దొరికే బొగ్గు, విదేశాలలో అయితే 10, 12 వేలు వస్తాయి కాబట్టి అక్కడ కమీషన్లు కొట్టడం కోసమే ఈ కుట్ర చేస్తున్నాడు అని కేటీఆర్ పేర్కొన్నారు.

ఈఎంఐ కట్టకుంటే ఈయన పదవి పోతుంది

రేవంత్ రెడ్డి ఈఎంఐ ముఖ్యమంత్రి.. ఈఎంఐ కట్టకుంటే ఈయన పదవి పోతుంది. కాబట్టే ఇప్పుడు బొగ్గు కుంభకోణంతోని స్కామ్ కుంభకోణం స్కామ్ చేసి ముడుపులు కట్టేందుకు ప్రయత్నం చేస్తున్నాడు. కాంగ్రెస్‌కు కట్టే ఈఎంఐల కోసమే ఇక్కడ ఏఐసీసీ జనరల్ సెక్రటరీ ఉన్నాడు. రికవరీ ఏజెంట్ లాంటి ఈ ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, రేవంత్ రెడ్డి కమీషన్లు కట్టకుంటే ఆయన పదవిని గుంజి పడేస్తాడు. రేవంత్ రెడ్డి పదవి రెన్యూవల్ కాదు. రేవంత్ రెడ్డి అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఇప్పుడు అందరిని మోసం చేస్తున్నాడు అని వర్కింగ్ ప్రెసిడెంట్ మండిపడ్డారు.

సింగరేణి భుజం మీద తుపాకి

సింగరేణి భుజం మీద తుపాకి పెట్టి టెండర్లు, కమీషన్ల లెక్కలు వేసుకుంటున్నాడు. సింగరేణిలో ఉత్పత్తి తగ్గించిండు.. అందుకే ఈరోజు కరెంట్ ఉత్పత్తి కేంద్రాల దగ్గర బొగ్గు లేదు. సింగరేణికి రూ. 60 వేల కోట్ల పెండింగ్‌లో పెట్టి బొగ్గు ఇవ్వడం లేదని బాద్నామ్ చేస్తున్నాడు. కరెంట్ సరఫరా వ్యవస్థను పండబెట్టి ఇప్పుడు రేవంత్ రెడ్డి కొండామంటే కరెంట్ లేదు అని అబద్దాలు చెబుతున్నాడు. ఒకనాడు 24 గంటల కరెంట్ వచ్చిన తెలంగాణలో ఇప్పుడు కరెంట్ ఎందుకు లేదు? కరెంట్ కొనుగోలు కోసం ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందం చేసుకుంటే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాన్ని కుంభకోణం అన్నాడు. ఇప్పుడేమో కొండామంటే కరెంట్ లేదు అని చెబుతున్నాడు. 3 రూపాయల 90 పైసలకు అప్పుడు మేము కొంటే కుంభకోణం అయితే, ఇప్పుడు 15 రూపాయలు పెట్టి కొనాలని చూస్తున్న కాంగ్రెస్ తీరుని ఏమనాలి? కరెంట్ కొనుగోళ్లపైన కుంభకోణం అంటూ ఒక కమిషన్ వేసిండు. బద్నాం చేయడానికి కుట్ర చేసిండు. రాష్ట్రంలో 30 లక్షల కరెంట్ పంపు సెట్లు ఉన్నాయి. సాగునీటి ప్రాజెక్టులకు కరెంట్ కావాలి, తెలంగాణ రైతులకు కరెంట్ ఇయ్యాలి. విద్యుత్‌పై ఆధారపడిన కుటీర పరిశ్రమలు, పరిశ్రమలకు విద్యుత్ ఇవ్వాలి. అందుకే ఆనాడు అన్ని ప్రయత్నాలు చేసి 24 గంటల కరెంట్ ఇచ్చాం. కానీ కాంగ్రెస్ రాగానే కరెంట్ కోతలు వచ్చాయి అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

నీళ్లు ఎత్తమంటే రేవంత్ రెడ్డి ఎత్తలేదు

రేవంత్ రెడ్డి 1000 టీఎంసీల నీళ్లను సముద్రంలో వదిలిపెట్టిండు. ఇప్పటిదాకా సాగునీటిపైన, కరువు పరిస్థితులపైన స్పందించకుండా కాలం వెళ్లిపోయినాక ఇప్పుడు నాటకాలు చేస్తున్నాడు. ఆరు నెలల ముందే కాళేశ్వరం నుంచి నీళ్లు ఎత్తిపోయాలని మా పార్టీ తరపున విజ్ఞప్తి చేశాం. కాళేశ్వరం ప్రాజెక్టులో వృథాగా కిందికి పోతున్న నీళ్లను అక్కడిదాకా పర్యటించి ప్రభుత్వానికి ప్రజలకు చూపించాం. కానీ కాళేశ్వరం ప్రాజెక్టును ఉపయోగిస్తే ఇన్ని సంవత్సరాలు తాను చేసిన దొంగమాటలు ప్రజలకు ముందు తేలిపోతుందని రేవంత్ రెడ్డి నీళ్లు ఎత్తిపోయలేదు. వృథాగా కిందికి పోయిన నీళ్లు ఎత్తిపోయకుండా ఇప్పుడు ఎల్-నీనో పేరుతో చేతులెత్తేసిండు. కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీళ్లు ఎత్తమంటే రేవంత్ రెడ్డి ఎత్తలేదు. ఉన్న నీళ్లు కిందికి పోయాయి, రాష్ట్రంలో ఉన్న పంటలు ఎండిపోతున్నాయి, తాగునీటికి సాగునీటికి కొరత మొదలయ్యింది. ఇప్పుడు ఎల్‌నినో వచ్చింది నేనేం చేసానని రేవంత్ రెడ్డి చేతులెత్తేస్తున్నాడు. ఇదే ఎల్‌నినో దేశమంతా ఉంది, పక్కనున్న ఆంధ్రప్రదేశ్‌లో కర్ణాటకలో కూడా ఉంది. కానీ ఆంధ్రాలో అక్కడ ముఖ్యమంత్రి జలపండగ చేస్తున్నాడు.



జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్లతో ఆర్ అండ్ డీ కేంద్రం

"భౌగోళికంగా తెలంగాణ దేశంలో మధ్య భాగంలో ఉంది. దేశంలోని ఆరు ప్రధాన మెట్రో నగరాల్లో హైదరాబాద్ కాస్మోపాలిటన్ నగరంగా, అత్యంత సురక్షితమైనదిగా, జీవించేందుకు అత్యంత అనుకూలమైన నగరంగా గుర్తింపు పొందింది" అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఇక్కడి సానుకూల పరిస్థితులను వివరించారు. జహీరాబాద్‌లోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ లో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ సమగ్ర గ్లోబల్ ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా హ్యుందాయ్ ప్రతినిధి బృందానికి హామీ ఇచ్చారు. నిమ్జ్‌లో రూ. 8,528 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న హ్యుందాయ్ కేంద్రం ద్వారా మొత్తం 4,276 ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యాన్ని సంస్థ నిర్దేశించుకుంది. 678 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టును దశలవారీగా అభివృద్ధి చేయనున్నారు. ప్రాజెక్టు పురోగతిని హ్యుందాయ్ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రికి వివరించింది. రానున్న కొన్ని నెలల్లో ఈ కేంద్రానికి శంకుస్థాపనకు సిద్ధం చేయనున్నట్టు తెలిపారు.

అమెరికా స్కూల్‌లో కాల్పుల ఘటన

న్యూఢిల్లీ, అక్టోబర్ 16 (సింగిడి)

అమెరికాలోని ఓరేగాన్ రాష్ట్రంలో దారుణం జరిగింది. ఓ 16 ఏళ్ల వ్యక్తి కాల్పులకు తెగించాడు. ఈ ఘటనలో ముగ్గురు చిన్నారులు, ఓ టీచర్ మృతిచెందారు. ప్రైమరీ స్కూల్ లో ఈ ఘాతుకం జరిగింది. అయితే ఆ ఉన్మాదిని మరో వ్యక్తి హతమార్చినట్లు పోలీసులు చెప్పారు. బెండ్ సిటీలో ఉన్న సిల్వర్ రైల్ ఎలిమెంటరీ స్కూల్‌లోకి అనుమానిత వ్యక్త దూసుకెళ్లాడు. అతని పేరును పోలీసులు వెల్లడించలేదు. మృతిచెందిన పిల్లల వయసు 11 ఏళ్ల లోపే ఉన్నది. ఈ ఘటనలో గాయపడ్డ 54 ఏళ్ల టీచర్ క్రిటికల్‌గా గాయపడింది. అయితే కాల్పులు జరిపిన వ్యక్తికి, స్కూల్‌కు ఏదైనా సంబంధం ఉందా లేదా అన్న కోణంలో విచారణ చేపడుతున్నారు.

పాకిస్థాన్‌లో ఘోర ప్రమాదం

న్యూఢిల్లీ, అక్టోబర్ 16 (సింగిడి)

పాకిస్థాన్‌లోని పెషావర్‌లో ఓ ప్రైవేట్ పాఠశాల పైకప్పు ఒక్కసారిగా కూలిపోవడంతో 34 మంది చిన్నారులతో పాటు ఓ ఉపాధ్యాయురాలు ప్రాణాలు కోల్పోయారు. 40 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పెషావర్ నగరంలో ఉన్న దిర్ కాలనీలో గురువారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. మరణించిన, గాయపడిన చిన్నారులందరూ 13 ఏళ్ల లోపు వారేనని అధికారులు తెలిపారు. శిథిలాల కింద మరికొందరు విద్యార్థులు, పాఠశాల సిబ్బంది చిక్కుకొని ఉండొచ్చని అనుమానిస్తున్నారు. మూడు అంతస్తుల భవనంలో పైకప్పును నాణ్యత లేని పద్ధతులతో నిర్మించినట్లు ప్రాథమికంగా గుర్తించామని పోలీసులు తెలిపారు.



అభిజీత్ దీపే అరెస్ట్

వీరిద్దరినీ అదుపులోకి తీసుకుంటున్న సమయంలో ఉద్రిక్తత తలెత్తింది. అటు పోలీసులు, ఇటు మీడియా.. మధ్యలో దీపే మద్దతుదారులతో ఈ ప్రదేశంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. దీపేను పోలీసులు అరెస్టు చేసి, తమ వాహనంలో తీసుకుని వెళ్లారు. అంతకుముందు దీపేకు ఢిల్లీ పోలీసులు రెండు వేర్వేరు నోటీసులు ఇచ్చారు. సెంట్రల్ పార్క్ వద్ద దీక్షకు వెళ్లకూడదని సూచిస్తూ.. ఢిల్లీ పోలీస్ యాక్ట్ కింద పోలీసులు ఒక నోటీస్ జారీ చేశారు. అనంతరం.. బీఎన్ఎస్ సెక్షన్ 163 కింద సౌత్ వెస్ట్ ఢిల్లీ పోలీసులు మరో నోటీస్ జారీ చేశారు.
ఈ సమయంలో దీపే నివాసం వద్ద భారీ స్థాయిలో పోలీసులు మోహరించారు. తన అరెస్టు సమయంలో దీపే పోలీసులతో ఘర్షణకు దిగారు. సెంట్రల్ పార్క్ వద్ద ఆందోళన చేయడానికి వీల్లేదన్న పోలీసులతో.. మరో చోటును చూపించాల్సిందిగా కోరాడు. మరో ప్రదేశం గురించి తర్వాత చెబుతామని, ఇప్పుడు అదుపులోకి తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు. తానేమీ చట్టాన్ని ఉల్లంఘించడం లేదని, తనను ఎందుకు అదుపులోకి తీసుకుంటున్నారని ప్రశ్నించారు. మరోవైపు ఈ రోజు నిరసన జరగాల్సి ఉన్న కన్నాట్ ప్లేస్, సెంట్రల్ పార్క్‌ను పోలీసులు మూసివేశారు. పార్క్ వద్ద ఆంక్షలు విధించారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.
దీంతో సెంట్రల్ ఢిల్లీ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో సీజేపీ ఆందోళన నిర్వహిస్తోంది. ఈ క్రమంలో నిబంధనలు ఉల్లంఘించారంటూ రెండు రోజులక్రితం ఢిల్లీ పోలీసులు సీజేపీ అగ్రనేతలు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌ను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. వారికి కోర్టు ఐదు రోజుల జుడీషియల్ కస్టడీ విధించింది. ప్రస్తుతం ఇద్దరూ తిహార్ జైలులో ఉన్నారు.

దేశాన్ని అస్థిర పరిచేందుకే ఆందోళనలు

బంగ్లాదేశ్‌ను ఆదర్శంగా తీసుకున్న ప్రతిపక్షాలు అక్కడిలాగా ఇండియాలో కూడా ప్రభుత్వాన్ని మార్చాలని ప్రయత్నిస్తున్నారు. ఇది వాళ్ల ప్రెస్ మీట్లలో బహిరంగంగానే చెబుతున్నారు. ప్రభుత్వాన్ని కూల్చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఇందుకోసం దేశ యువతను పావులుగా వాడుకుంటోంది. ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు, రాజ్యాంగ వ్యవస్థల విశ్వసనీయతను దెబ్బతీసేందుకు, దేశ అభివృద్ధి పథాన్ని అడ్డుకునేందుకు ప్రజాస్వామ్యం ఎవరికీ అనుమతి ఇవ్వదు అనే విషయాన్ని రాహుల్ గాంధీ, ఆయన మద్దతుదారులు గుర్తించాలి. ఈ అంశంలో సుప్రీంకోర్టు ప్రస్తావించిన అంశాల్ని గుర్తించాలి. శాంతి భద్రతల్ని కాపాడాలంటే చట్టాన్ని గౌరవించాలి. రాజకీయ ప్రయోజనాల కోసం దేశ ప్రజాస్వామిక, రాజ్యాంగ వ్యవస్థలు బలికాకూడదు. ఈ వాస్తవాన్ని ప్రతిపక్షాలు గుర్తించాలి. 1975లో ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ దేశ చరిత్రలో క్షమించరాని నేరం. ఆ తర్వాత 1984లో జరిగిన అల్లర్లకు కూడా కాంగ్రెస్ పార్టీనే కారణం. 1990లో తన ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి రామ భక్తులు, కరసేవకుల రక్తాన్ని చిందించారు'' అని రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు.

తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన ప్రచారం

వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈ ప్రచారం నిర్వహిస్తారు.ఈ స్థానంలో జనసేన అభ్యర్థిగా గడల శ్రీనివాసరావు బరిలో ఉన్నారు. మణికొండలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ప్రచార ప్రారంభానికి పార్టీ నేతలు, సామాజిక సేవకులు హాజరైయ్యారు. అలాగే జనసేనలో చేరిన పలువురు క్రీడాకారులు, యువతకు పవన్ కల్యాణ్ పార్టీ కండువా కప్పి జనసేనలోకి ఆహ్వానించారు. తెలంగాణలో పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణంపై పవన్ కల్యాణ్ ఫోకస్ పెట్టారు. ఇందులో భాగంగానే ఇటీవల హైదరాబాద్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.

విదేశాల నుంచి బొగ్గు దిగుమతి...

ఏ విచారణకైనా నేను సిద్ధమే

ఇప్పుడు కేటీఆర్ విదేశీ బొగ్గు గురించి లేఖ రాయడం విడ్డూరంగా ఉందన్నారు.
మేం స్వదేశీ బొగ్గుతో నడిపించేందుకు ప్రయత్నాలు చేస్తుంటే, కేటీఆర్ స్పందన మాత్రం భిన్నంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. యాదాద్రి పవర్ ప్లాంట్ డిజైన్ ప్రకారం అవసరమైన జీ-9 గ్రేడ్ బొగ్గు మహానది కోల్‌ఫీల్డ్ వద్ద ఉందని దేశీయంగానే ఈ బొగ్గును తీసుకునేందుకు వీలుగా కేంద్రంతో మాట్లాడామన్నారు.
యాదాద్రి పవర్ ప్లాంటులో 50 శాతం దిగుమతి బొగ్గు, మిగతా 50 శాతం సింగరేణిలోని జీ-9 బొగ్గుతో విద్యుత్తు ఉత్పత్తి చేస్తామని నాడు తొలుత ఒప్పందం చేసుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 2016 డిసెంబర్ 9న జీ-9 బొగ్గు 50 శాతం, మిగతా 50 శాతం బొగ్గు విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాలని ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. ఈ బొగ్గు కోసం సింగరేణి, ఎంఎస్‌టీసీ ఒప్పందం జరుగుతున్నపుడు వీటి వెనక ఒక బూచోడు దాక్కున్నారని, అప్పట్లోనే ఒప్పందం జరిగితే ఇప్పుడు విదేశీ బొగ్గు కొంటున్నారని కేటీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు.
విదేశాల నుంచి బొగ్గు దిగుమతికి ప్రత్యేక లైన్ కావాలని అప్పట్లోనే కేంద్రానికి లేఖ రాశారని గుర్తు సీఎం చేశారు. పోర్టు ప్రైవేటుది, బొగ్గు విదేశాలది. ఈ విదేశీ బొగ్గు వెనక ఉన్న ప్రతిభావంతుడు, ముసుగు వీరుడెవరని సీఎం నిలదీశారు. నష్టాల్లోని మీ వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టి షేర్లు కొన్నదెవరు? అప్పటి ఒప్పందాలు నిజం కావా? ఈ పెట్టుబడులు నిజం కావా? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

రూ.లక్ష కోట్ల నష్టం వాటిల్లే ప్రమాదం

దామరచర్ల వద్ద పవర్ ప్లాంటు కట్టాలన్న కేసీఆర్ అనాలోచిత నిర్ణయం కారణంగా రానున్న 50 ఏళ్లలో తెలంగాణకు దాదాపు రూ.లక్ష కోట్ల నష్టం వాటిల్లుతుందని సీఎం తెలిపారు. ఎల్‌నినో కారణంగా రాష్ట్రానికి విద్యుత్తు డిమాండ్ అధికంగా ఉన్నందున అత్యవసరంగా సరఫరా చేసేందుకు నిర్ణయం తీసుకోవాలని కేంద్రాన్ని కోరామన్నారు. మంత్రి మండలి ఉపసంఘం రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుని సోమవారానికి బొగ్గు అందిస్తామని హామీ ఇచ్చిందన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితోనూ మాట్లాడానని, దేశీయ బొగ్గును యాదాద్రిలో వాడేందుకు ప్రయత్నిస్తున్నామని సీఎం పేర్కొన్నారు.
"ఈరోజు కూడా సింగరేణిలో బొగ్గు లేదు. కష్టకాలంలో విద్యుత్ ఉత్పత్తి చేయాలంటే బొగ్గు కొరత ఉంది. దీంతో నైనీ కోల్ వాళ్లతో మాట్లాడాం. అక్కడి వారు వ్యతిరేకించడంతో కేంద్రంతో చర్చించి వారిని ఒప్పించేలా చేశాం. అది కూడా గ్రేడ్ -12, 13 బొగ్గు రోజుకు 3 ర్యాకుల వరకు బొగ్గు వస్తోంది. దీంతో విద్యుత్ ఉత్పత్తి మొదలుపెట్టాం. ఇది సరిపోవడం లేదని మహానది కోల్ ఫీల్డ్‌తో మాట్లాడాం. విద్యుత్ సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకొని వీటిని సోమవారం లోగా అందించేందుకు కేంద్రం ఏర్పాట్లు చేస్తోంది" - సీఎం రేవంత్‌రెడ్డి

అలా చేస్తే బూడిదే వస్తుంది

ఇప్పుడు గ్రేడ్-12, 13 బొగ్గు అయినా యాదాద్రి ప్రాజెక్టు నడుస్తుందని బీఆర్ఎస్ నాయకులు చెబుతున్నారని, ఈ ప్రాజెక్టును బీహెచ్ఈఎల్ జీ-9 బొగ్గు కోసం డిజైన్ చేసింది జీ-9 కాకుండా మిగతా బొగ్గు వాడితే బూడిద ఎక్కువ వస్తుందని సీఎం తెలిపారు. తక్కువ విద్యుత్తు ఉత్పత్తి అవుతుందన్నారు. అప్పట్లోనే ఈ ప్రాజెక్టులో అవినీతి ఉందని చెప్పామన్నారు. 2015లో యాదాద్రిలో 4 వేల మెగావాట్ల సూపర్ క్రిటికల్ విద్యుత్తు ప్లాంటును రూ.17,950 కోట్లతో చేపట్టాలని నిర్ణయించారన్నారు. మూడేళ్లలో నిర్మిస్తామని బీహెచ్ఈఎల్‌తో ఒప్పందం చేసుకున్నారని, ఈరోజు 3,200 మెగావాట్లు 4 యూనిట్లను ప్రాథమికంగా ప్రారంభించుకున్నామన్నారు.
సాధారణంగా బొగ్గు ఉత్పత్తి చేసే, నీళ్లు అందుబాటులో ఉండే ప్రాంతాల్లోనే విద్యుత్తు ప్రాజెక్టులు నిర్మిస్తారని కానీ సింగరేణిని నిండా ముంచి యాదాద్రి ప్రాజెక్టును కట్టారని సీఎం విమర్శించారు. నైనీ నుంచి లేదా సింగరేణి నుంచి బొగ్గు రవాణా చేసినా ప్రాజెక్టు కాలపరిమితి 25 ఏళ్లుగా లెక్కిస్తే రూ.50 వేల కోట్ల అదనపు భారం పడుతుందన్నారు. ఇది తెలంగాణ ప్రజలకు వాటిల్లే నష్టమని, ప్రాజెక్టు కాల వ్యవధి 50 ఏళ్లు తీసుకుంటే రూ.80 వేల కోట్లు అవుతుందని వెల్లడించారు.

సింగరేణిని చంపాలన్న ఆలోచనతో

పెరిగిన అంచనాలు రూ.20 వేల కోట్లు కలిపితే మొత్తం రూ.లక్ష కోట్ల నష్టం వస్తుందన్న సీఎం, నూటికి నూరు శాతం యాదాద్రికి సింగరేణి బొగ్గు వాడే పరిస్థితి లేదని తెలిపారు. సింగరేణి వద్ద ఏటా 2 మిలియన్ మెట్రిక్ టన్నుల జీ-9 బొగ్గు ఉత్పత్తి అవుతుందని, ఈ బొగ్గుకు ఇప్పటికే ఒప్పందాలు ఉన్నాయన్నారు. సింగరేణిని చంపాలన్న ఆలోచనతో విదేశీ బొగ్గు ఒప్పందం తెచ్చుకున్నారని నూరు శాతం దిగుమతి చేసుకోవాలన్న ఉద్దేశంతో బీఆర్ఎస్ నాయకులు ఎన్జీటీలో కేసు వేయించి స్టే ఇప్పించారని సీఎం విమర్శించారు.

వాటికి ఆధారాలు చూపించాలి

ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో తన కుమార్తె పేరుతో వాటాలు ఉన్నాయన్న ఆరోపణలపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి, వాటికి ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. గతంలో ఆ ఆస్పత్రి బ్రాంచ్‌లను కేసీఆర్, కిషన్ రెడ్డి, బండి సంజయ్ కూడా ప్రారంభించారన్న రేవంత్, ప్రారంభించినవన్నీ తనవే అయితే ప్రపంచంలోనే శ్రీమంతుడిని అవుతానని వ్యాఖ్యానించారు.



ఏపీలో తీవ్ర విషాదం

స్థానికుల సాయంతో కుటుంబ సభ్యులు మృతదేహాలను ఒడ్డుకు తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న పెనుకొండ పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. గాయత్రి కుమారెడ్డి అశ్వినికి ఇటీవల వివాహం జరిగింది. ఆమె భర్తతో కలిసి బెంగళూరులో ఉంటోంది. దసరా సెలవులు కావడంతో పుట్టింటికి వచ్చింది. అంతలోనే ఈ విషాదం చోటు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కన్నీరుమున్నీరవుతున్నారు.

సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

గొల్లపల్లి జలాశయం ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదు

10 నెలల్లో మోదీ ప్రభుత్వం కూలిపోతుందని దుష్ప్రచారం చేస్తున్నారని కిషన్ రెడ్డి ఆక్షేపించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన తీర్పును అపహాస్యంచేలా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వ్యవహరిస్తున్నారని ఆక్షేపించారు.

దమ్ముంటే మోదీ ప్రభుత్వాన్ని పడగొట్టి చూపండి

2029 వరకు ప్రధానమంత్రిగా మోదీ ఉండాలని ప్రజలు తీర్పునిచ్చారని కిషన్ రెడ్డి అన్నారు. బంగ్లాదేశ్, శ్రీలంకలో చేసినట్లు ప్రభుత్వాన్ని కూల్చుతామని దింపుడుకళ్లం ఆశలు పెట్టుకున్నారని ఆక్షేపించారు. ప్రపంచమంతా ఆర్థిక సంక్షోభంలో ఉంటే భారత్ మాత్రం అభివృద్ధి చెందుతోందని కిషన్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ తాటాకు చప్పుళ్లకు మోదీ సర్కారు భయపడదని స్పష్టం చేశారు. ధైర్యముంటే మోదీ ప్రభుత్వాన్ని పడగొట్టి చూపాలని రాహుల్‌గాంధీకి సవాల్ విసురుతున్నామన్నారు. ఎస్ఐఆర్ ప్రవేశపెట్టక ముందే అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందని, బీజేపీ విజయాలు సాధించిందని కిషన్ రెడ్డి అన్నారు. ఎస్ఐఆర్ వల్లే బీజేపీ అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అధికారంలోకి రావచ్చు పోవచ్చు కానీ వ్యవస్థలను నిర్వీర్యం చేయవద్దని ప్రతిపక్షాలకు హితవు పలికారు.

విద్రోహశక్తులన్నీ ఏకమై విఫలమయ్యాయి

దేశ విద్రోహ శక్తులు అన్ని ఏకమై.. విఫలమయ్యాయని కిషన్ రెడ్డి తెలిపారు. ప్రపంచ శక్తులు ఏకమైనా.. దేశంలోని శక్తులు ఏకమైనా నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని ఏమీ చేయలేవన్నారు.

ఏపీలో స్థానిక ఎన్నికల నామినేషన్ల తొలిరోజే పలుచోట్ల ఉద్రిక్తత

ఈ ఘటనలో పలువురు టీడీపీ కార్యకర్తలకు గాయాలు కాగా, పలు వాహనాలు ధ్వంసమయ్యాయి.

టీడీపీ, వైఎస్సార్సీపీ శ్రేణుల మధ్య ఘర్షణ

ఏపీలోని అన్నమయ్య జిల్లా పుంగనూరులో నామినేషన్ల దాఖలు తొలిరోజు యుద్ధక్షేత్రాన్ని తలపించింది. నామినేషన్ల దాఖలు వేళ టీడీపీ, వైఎస్సార్సీపీ వర్గాల మధ్య చెలరేగిన ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వైఎస్సార్సీపీ నేత, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి భారీ కాన్వాయ్‌తో అభ్యర్థులను, భారీ బలగాన్ని వెంటతీసుకుని ఎన్నికల అధికారి కార్యాలయానికి బయల్దేరారు. మరోవైపు తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు కూడా కొందరు నామినేషన్లు వేసేందుకు కార్యాలయానికి వెళ్లారు. ఈ క్రమంలోనే ఎంపీ మిథున్ రెడ్డి ఎన్నికల అధికారి కార్యాలయంలోకి వెళ్లడం నిబంధనలకు విరుద్ధమంటూ టీడీపీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు మిథున్ రెడ్డిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. మిథున్ రెడ్డి పోలీసుల్ని లెక్కచేయకుండా తన కాన్వాయ్‌ను బారికేడ్ల మీదుగా తీసుకెళ్లారు. ఈ క్రమంలో భద్రత విధుల్లో ఉన్న ఓ పోలీసుకు గాయాలయ్యాయని అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ తెలిపారు.

వీరంగం సృష్టించిన వైఎస్సార్సీపీ శ్రేణులు

పోలీసులు అడ్డగిస్తున్నా లెక్కచేయకుండా, వాహనాలతో వైఎస్సార్సీపీ శ్రేణులు వీరంగం సృష్టించాయి. మిథున్ రెడ్డి వాహనశ్రేణిలో మద్యం సీసాలు బయటపడటం కలకలం రేపింది. మిథున్ రెడ్డికి మద్దతుగా భారీగా వైసీపీ నాయకులు, ఆయన అనుచరగణం చేరుకొని టీడీపీ శ్రేణులపై దాడులకు యత్నించారు. ఈ క్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కూడా పెద్ద ఎత్తున కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఇరువర్గాలూ పరస్పర నినాదాలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. దాడులు ఉద్ధృతం కాకుండా పోలీసులు కూడా భారీ సంఖ్యలో అక్కడికి రావడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. వైఎస్సార్సీపీ దాడులను నిరసిస్తూ టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున ఆందోళనకు పిలుపునివ్వడంతో పరిస్థితులు అదుపుదాటకుండా పోలీసులు ముందస్తు చర్యలకు ఉపక్రమించారు.

15 కార్లు ధ్వంసం

మరోవైపు రాయచోటిలో భీతావాహ వాతావరణం నెలకొంది. ఇరువర్గాలూ పరస్పరం రాళ్ల దాడులు చేసుకున్నాయి. రాయచోటిలోని SN కాలనీలో రెండు పార్టీల కార్యకర్తలు కార్లకు పరస్పరం నిప్పు పెట్టుకున్నారు. అక్కడే రెండు పార్టీల కార్యాలయాలు ఉన్నాయి. వైఎస్సార్సీపీ నేత గడికోట శ్రీకాంత్ రెడ్డి ఆ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. అప్పటికే వైఎస్సార్సీపీ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు చేరుకున్నారు. కాసేపటికే మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి ప్రె

రైతుల వ్యవసాయ విద్యుత్ కష్టాలను పరిష్కరించాలి..

మంత్రి వివేక్ వెంకటస్వామికి
దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి వినతి



సిద్దిపేట బ్యూరో, అక్టోబర్, 16, (సింగిడి): వందలాది మంది రైతులతో కలిసి వ్యవసాయ విద్యుత్ సమస్యలపై వినతిపత్రం అందించారు కొత్త ప్రభాకర్ రెడ్డి, దుబ్బాక నియోజకవర్గంలోని రైతులు ఎదుర్కొంటున్న వ్యవసాయ విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ దుబ్బాక వందలాది మంది రైతులతో కలిసి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కి వినతిపత్రం సమర్పించారు. అక్బర్‌పేట్--భూంపల్లి మండలం నగరం గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి గారిని కలిసి రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ఎమ్మెల్యే వివరించారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాలో వేళాపాళా లేకపోవడం, లో-వోల్టేజ్, తరచూ విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించడంతో పాటు, విద్యుత్ సరఫరా సమయాలను ముందుగానే ప్రకటించాలని, పగటిపూట విద్యుత్ సరఫరాకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. లో-వోల్టేజ్ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయ మోటార్లు కాలిపోతూ రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను 24 నుంచి 48 గంటల్లోపు ఉచితంగా మార్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందుబాటులో ఉంటేనే వ్యవసాయ పనులు సజావుగా సాగుతాయని, విద్యుత్ సమస్యల కారణంగా పంటలకు నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కోరారు. రైతాంగం ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి, వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను సక్రమంగా అందించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్.ఆర్ నాయక్ నగర్ అభివృద్ధి
పనులపై సిఎంసి కమిషనర్‌తో కీలక చర్చ

సంపు స్థలాన్ని కాలనీ అభివృద్ధికి
వినియోగించాలని కోరిన మన్నె రాజు



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 16(సింగిడి): మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీజన, ఐఏఎస్ ను కలిసి ఎస్.ఆర్. నాయక్ నగర్ కాలనీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎస్.ఆర్. నాయక్ నగర్ సంపు స్థలాన్ని కాలనీ అభివృద్ధి పనుల కోసం వినియోగించుకునేందుకు సహకరించాలని మన్నె రాజు కమిషనర్ ను కోరడం జరిగింది. దీనిపై స్పందించిన కమిషనర్ ఈ విషయాన్ని ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెళ్లి, వారితో చర్చించి తన వంతు సహకారం అందిస్తానని తెలియజేశారు. ఎస్.ఆర్. నాయక్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ బాబి , మాజీ ప్రెసి డెంట్ టక్ శ్రీను , కిషోర్, చంద్రకాంత్ కాలనీకి చెందిన పలువురు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారిని... ఆదుకోవడంలోనే ఆత్మసంతృప్తి

డయాలసిస్ బాధితునికి
మాజీ డిప్యూటీ మేయర్ ఆర్థిక చేయూత



జవహర్ నగర్, అక్టోబర్ 16(సింగిడి): ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలోనే ఆత్మ సంతృప్తి లభిస్తుందని జవహర్ నగర్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ పరిధిలోని చంద్రపురి కాలనీలో నివాసం ఉంటూ డయాలసిస్ తో బాధపడుతున్న సండం సాయికుమార్ కు తన వంతు సహాయంగా మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సాయికుమార్ పరిస్థితిని తెలుసుకున్న వెంటనే స్పందించిన శ్రీనివాస్ గుప్తా నేరుగా అతని ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అందించడంతో పాటు ధైర్యం చెప్పారు. వైద్యానికి ఎలాంటి సహాయం కావాలన్నా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, సాయికుమార్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ బాబా, శ్రీమన్నారాయణ, మాధవ్, శ్రీనివాస్ గౌడ్, సవిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనంతోపాటు మౌలిక సదుపాయాలు
కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ దీపక్ తివారి



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 16(సింగిడి): అనంతగిరి గుట్ట వైద్య కళాశాల లను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, అదనపు కలెక్టర్ వెంకటాచారితో కలిసి గురువారం సందర్శించి వివిధ సమస్యలు, సౌకర్యాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా కనీస మౌలిక వసతులు కల్పనకై కృషి చేస్తానన్నారు. విద్యార్థులతో సంప్రదించి వారికి సౌలభ్యంగా ఉండే విధంగా రెండు కమిటీలను ఏర్పాటుచేసి మెనూను రూపొందించుకొని భోజన సౌకర్యానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. మెనూ విషయంలో పర్యవేక్షణ ఉండాలని ఆయన అన్నారు. వసతి గృహం, కిచెన్ షెడ్లకు సంబంధించి గ్రిల్స్, మరమ్మత్తు పనులకు అంచనాలను సమర్పించి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా పరిషత్ సీఈవో సుధీర్, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ దీన్ దయాల్ బంగ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శుభోదయ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రయ్య తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సాయి నగర్ ఆలయ పరిధిలో సిఎంసి
నిధులతో రూ. 20 లక్షల సీసీ రోడ్డు ప్రారంభం

పనులు ప్రారంభించిన
కొలన్ హుంమంతా రెడ్డి





కుత్బుల్లాపూర్, అక్టోబర్ 16 (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రగతి నగర్ 276వ డివిజన్ పరిధిలోని సాయి నగర్ ఆలయ ప్రాంతంలో సి ఎం సి నిధులతో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డును నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిలుగా పాల్గొని ప్రారంభించారు. కాలనీ అభివృద్ధిలో భాగంగా సిఎంసి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతూ, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ సి ఎంసీ నిధులతో కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. అనంతరం భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గారి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. దేశ యువతకు స్ఫూర్తిగా నిలిచిన కలాం సేవలను, దేశాభివృద్ధికి ఆయన అందించిన కృషిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి (తాతిరెడ్డి), మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, 277వ డివిజన్ అధ్యక్షులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆలేటి శ్రీనివాస్, గజ్జెల కాంతం, కూతురు నిర్మల, ప్రవీణ్ (లడ్డు), మల్లికార్జున్, శ్రీ నవీన్ రెడ్డి, వీరబాబు, సురేందర్ యాదవ్, పిల్లి ఆంజనేయులు, మురళి తదితరులు పాల్గొన్నారు.

డిసిసి నూతన
అధ్యక్షరాలికి శుభాకాంక్షలు

కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి



ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 16(సింగిడి): రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ (డిసిసి) అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు తీసుకున్న చిగురింత పారిజాత నరసింహ రెడ్డి గారిని గాంధి భవన్ లో కలిసి శుభాకాంక్షలు తెలియచేసిన జిల్లా అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి, ఇబ్రహీంపట్నం నియోజక వర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెదిరే సికిందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పండల శంకర్ మరియు వరకల శ్రీరాములు తదితుతులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా
చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ఘన ప్రమాణ స్వీకారం



రాజేంద్రనగర్, అక్టోబర్ 16 (సింగిడి): రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి గురువారం అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి పలువురు ప్రముఖ నాయకులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డిసీసీ ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్, నెక్నంపూర్ డివిజన్ అధ్యక్షులు జితేందర్, మాజీ కౌన్సిలర్ పురుషోత్తం, సీనియర్ నాయకులు మల్లేష్, షేక్ హాజీ తదితరులు పాల్గొని నూతన అధ్యక్షురాలికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి నాయకత్వంలో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత ముందుకు వెళ్తుందని, అట్టడుగు స్థాయి నుంచి పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని విశ్వాసం వ్యక్తం చేశారు.

దివ్యాంగుల ఆత్మవిశ్వాసం, స్వావలంబనకు
సమాజం అండగా నిలవాలి

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
లూయిస్ బ్రెయిలీ భవన్‌లో ఘనంగా ప్రపంచ తెల్లకర్ర దినోత్సవం, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు





కుత్బుల్లాపూర్, అక్టోబర్ 16(సింగిడి): పపంచ తెల్లకర్ర దినోత్సవం (వరల్డ్ వైట్ కాన్ డే) భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించు కుని గురువారం కుత్బుల్లాపూర్ నియోజ కవర్గం, 130వ డివిజన్ పరిధిలోని సూ రారంలోని లూయిస్ బ్రెయిలీ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ శ్రీ కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజ రయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దృష్టిలోపం ఉన్నవారికి తెల్లకర్ర కేవలం నడకకు ఉపయోగపడే సాధనం మాత్రమే కాదని, అది వారి ఆత్మవిశ్వాసానికి, స్వతంత్రంగా జీవించే హక్కుకు ప్రతీక అని పేర్కొన్నారు. దివ్యాంగులు సమాజంలో గౌరవప్రదం గా, ఆత్మగౌరవంతో జీవించేలా ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. వారి ప్రతిభను గుర్తించి, విద్య, ఉపాధి, సామాజిక అవకాశాల్లో సమాన ప్రాధాన్యత కల్పించడం మనందరి బాధ్యత అని అన్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ప్రస్తావిస్తూ కలాం ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ తమ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. దివ్యాంగుల సంక్షేమం, సాధికారతకు ప్రాధాన్యత నిస్తూ వారికి అవసరమైన సహకారం అందించడం ద్వారా సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి బాటలు వేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, కొంపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, స్థానిక సీనియర్ నాయకులు వరాల వినోద్, కోలా శ్రీకాంత్, గుబ్బల లక్ష్మీనారాయణ, గట్టు అశోక్, రాజ్ కుమార్, జన్ముల ప్రభాకర్, రామ్ బాబు, బైరేష్ గౌడ్, సత్యం గౌడ్, చిన్న వెంకటస్వామి, రాజు, అనీల్, గణేష్, మటన్ మహమూద్, బద్రి, జహీర్, లూయిస్ బ్రెయిలీ భవన్ ప్రతినిధులు, నిర్వాహకులు, అంజయ్య గౌడ్, ప్రవీణ్ గౌడ్, వీర రాఘవన్, యాదయ్య యాదవ్, నరేందర్ రెడ్డి, శేఖర్ గౌడ్ స్థానిక నాయకులు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ జెండాలు పక్కన పెట్టి జాతి లక్ష్యం కోసం పనిచేద్దాం...

తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి
రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్
జిల్లా అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య
నంగునూర్ మండల అధ్యక్షుడిగా బండి మల్లేశం నియామకం



సిద్దిపేట బ్యూరో, అక్టోబర్ 16, (సింగిడి): రజక జాతి సంక్షేమం కోసం ప్రతి రజక బిడ్డ కృషి చేయాలని జిల్లా అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నంగునూర్ మండలంలోని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి ఆధ్వర్యంలో రజక మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని మరియు జిల్లా కమిటీల ఉపాధ్యక్షుడిగా బస్వరాజు రాములు, (పాలమాకుల) జిల్లా కన్వీనర్ అనరాజుల నాగరాజు (నంగునూర్) నియామకమయ్యారు. నంగునూర్ మండల అధ్యక్షుడు బండి మల్లేశం, (సిద్దన్నపేట) గౌరవ అధ్యక్షులుగా గుండెల్లి మల్లయ్య (ఖానాపూర్) సుంకరి మహాదేవ్, (ఘనపూర్) ఉపాధ్యక్షులుగా వర్కోలు బాగయ్య, పావురాల సాయి చరణ్, అ-నరాజు చందు (నంగునూర్), ప్రధాన కార్యదర్శి పులిపాక సంపత్, (నాగరాజుపల్లి) కోశాధికారి కంచర్ల రాజు (కోనాయిపల్లి) మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నర్మెట లక్ష్మణ్ (ఆంక్షపూర్), మండల కార్యదర్శి బస్వారాజ్ భాస్కర్ (కొండంరాజ్ పల్లి), మండల యూత్ అధ్యక్షుడు అనురాజు మహేష్ (సిద్ధన్నపేట), మండల యూత్ ప్రధాన కార్యదర్శి రాచకొండ రామ్ (బద్దీపడగ), మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్ (ఆంక్షపూర్) జిల్లా అధ్యక్షుడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దిటి రాజు లు తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయ్ గణేష్ మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక యుగంలో ఎంతో ముందుకు పోతున్న రజక జాతి బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్న రాష్ట్రవ్యాప్తంగా రజకుల బతుకులు దినంగా ఉన్నాయని ఆరోపించారు. జాతీ ఐక్యత కోసం మనం పట్టుదలతో ముందుకు వెళ్లేందుకు రావాలని పిలుపునిచ్చారు. నవంబర్ లో జరిగే తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి 4వ మహాసభను విజయ వంతం కోసం రజకులు తరలి రావాలని కొరారు. మన జాతీ సంక్షేమం, మన ఐక్యత ను ముందుకు తీసుకు రావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దిటి రాజు, జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల సత్య స్వామి, జిల్లా మీడియా కన్వీనర్ జూపల్లి నర్సింలు, మరియు మండలంలో ఉన్న అన్ని గ్రామాల రజకులు పాల్గొన్నారు.

దసరా పండుగ ప్రత్యేక బస్సు సర్వీసులు విజయవంతం

టీజీఎస్ ఆర్టీసీ వీసీ, ఎండీ వై. నాగిరెడ్డి.
ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా క్షేత్రస్థాయిలో ప్రతీరోజూ సమీక్షలకు ఎండీ ఆదేశం.
అక్టోబర్ 9 నుండి 14 వరకు 2,474 ప్రత్యేక బస్సుల ఆపరేషన్ - 94.07 శాతం.
ఖమ్మంలో అత్యధికంగా 133.33%, మెదక్‌లో 123.15%, ఆదిలాబాద్‌లో 116.90% ఆపరేషన్ నమోదు



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 16 (సింగిడి): సద్దుల బతుకమ్మ, దసరా పండుగను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సు సర్వీసులు అత్యంత ప్రణాళికాబద్ధంగా, విజయవంతంగా కొనసాగుతున్నాయని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి వెల్లడించారు. పండుగ వేళ స్వంత ఊర్లకు వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఆటంకాలు, ఇబ్బందులు తలెత్తకుండా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు (ఈ డి), అన్ని రీజినల్ మేనేజర్లు (ఆర్ ఎం)లు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో పరిస్థితిని ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని ఎండీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అక్టోబర్ 9 నుండి 14 వరకు నడిపిన ప్రత్యేక సర్వీసుల గణాంకాలను పరిశీలిస్తే సంస్థ మొత్తం 2,630 బస్సులను సిద్ధం చేయగా 2,474 బస్సులను విజయవంతంగా నడిపి 94.07 శాతం లక్ష్యాన్ని సాధించిందని ఎండీ వివరించారు. అక్టోబర్ 10న అమావాస్య రోజున ప్రయాణికుల రద్దీ ఊహించని విధంగా పెరిగినప్పటికీ, కేటాయించిన 529 బస్సులకు గాను 689 బస్సులను నడిపించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం జరిగిందన్నారు. కరీంనగర్ జోన్ 1,770 బస్సుల లక్ష్యానికి గాను 1,565 బస్సులను నడిపి 88.42 శాతం సాధించింది . ఇందులో ఖమ్మం రీజియన్ నిర్ణయించిన 273 బస్సులకు గాను 364 బస్సులను నడిపి 133.33 శాతంతో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలవగా, ఆదిలాబాద్ రీజియన్ 116.90 శాతం, కరీంనగర్ 94.76 శాతం, వరంగల్ 66.73 శాతం, నిజామాబాద్ 62.69 శాతం ఆపరేషన్ సాధించాయి. అలాగే హైదరాబాద్ జోన్ 860 బస్సులకు గాను 682 బస్సులను నడిపి 79.30 శాతం ప్రగతిని కనబరిచింది. ఈ జోన్ పరిధిలోని మెదక్ రీజియన్ 123.15 శాతంతో మెరుగైన సేవలు అందించగా, నల్గొండ 79.70 శాతం, మహబూబ్‌నగర్ 70.17 శాతం, రంగారెడ్డి రీజియన్ 37.74 శాతం ఆపరేషన్ నమోదు చేశాయి. దీనికి అదనంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అదనపు రద్దీని తట్టుకోవడానికి ఎటువంటి ముందస్తు ప్రణాళిక లేకపోయినా ప్రత్యేకంగా 227 బస్సులను అందుబాటులోకి తెచ్చి ప్రయాణికులకు రవాణా సదుపాయం కల్పించారు. అక్టోబర్ 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున అవసరమైన చోట్ల అదనపు బస్సు లను నడపాలని ఆయన అధికారులను ఆదేశించారు. స్పెషల్ బస్సుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎండీ నాగిరెడ్డి అధికారులకు సూచించారు పండుగ ముగిసిన అనంతరం తిరిగి నగరాలకు చేరుకునే ప్రయాణికుల కోసం కూడా ఇదే తరహాలో ప్రత్యేక బస్సు సర్వీసులను సిద్ధం చేయాలని అధికారులను ఎండీ వై. నాగిరెడ్డి ఆదేశించారు. టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ ను ఎఎఇ.స్త్రంతీఎఎబం. అఅ వెబ్ సైట్ లో బుక్ చేసుకోవాలని ఆయన తెలిపారు. దసరా కు స్వంత ఊర్లకు వెళ్లే ప్రయాణికులు ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 లలో సంప్రదించాలని ఎండీ నాగిరెడ్డి సూచించారు. బస్ స్టేషన్లలో తాగునీరు, విశ్రాంతి వసతులు, పారిశుద్ధ్యం మరియు భద్రత విషయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రయాణికులందరూ ఆర్టీసీ సేవలనే వినియోగించుకుని సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఎండీ నాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

వ్యవసాయ పద్దతులపై పరిశోధనలో పాల్గొన్న రైతులు



కొడంగల్, అక్టోబర్ 16(సింగిడి): కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని కొడంగల్, బొంరాస్ పేట్, దౌల్తాబాద్, దుద్యాల మండల రైతులను ఆత్మ ఇక్రిసాట్ పరిశోధనకు ఎక్స్పోజర్ విజిట్ చేసేందుకు వ్యవసాయ అధికారులు తీసుకె ళ్లారు. ఈపరిశోధన లో రైతులకు మట్టినమూ నాలు, ఎరువుల వాడకం, ఎరువులు వాడే విధానం వంటి తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పిం చారు. నూతన పద్దతుల ను పాటిస్తూ పండించిన కంది, జొన్న పంటలను చూపిస్తూ వివరించా రు. ఈకార్య క్రమంలో శాస్త్రవేత్తలు రంగనాథ్, యశ్వంత్, యోగేష్, ప్రియాంక, కొడంగల్ ఎడిఎ వెంకటేశం, ఎఓ కొమురయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందక రైతులు కుదేలు

నిరంతరాయ విద్యుత్ అందించకుంటే పోరాటం ఉధృతం
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అప్రకటిత విద్యుత్ కోతలు పెరిగాయి
భారీ ర్యాలీతో హెచ్చరించిన బీజేపీ కిసాన్ మోర్చా



సంగారెడ్డి బ్యూరో , అక్టోబర్ 16(సింగిడి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అప్రకటిత విద్యుత్ కోతలు, తరచూ అంతరాయాల తో రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, నాయకులు మండిపడ్డారు. గురువారం బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంగారెడ్డి జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షులు రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో, సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు శ్రీమతి గోదావరి అంజిరెడ్డి మరియు కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ బస్వా లక్ష్మీనారాయణ గారి నేతృత్వంలో సంగారెడ్డి పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఐబీగెస్ట్ హౌస్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ విద్యుత్ శాఖ కార్యాలయం వరకు ఉత్సాహంగా సాగింది. అనంతరం విద్యుత్ శాఖ డీఈ (ణజు) గారిని కలసి, వ్యవసాయానికి నాణ్యమైన మరియు నిరంతరాయ ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమాన్ని విస్మరించి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతుల విద్యుత్ సమస్యలను పరిష్కరించకపోతే, బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేశపాండే, జిల్లా ప్రధాన కార్యదర్శులు మాణిక్ రావు, రాజశేఖర్ రెడ్డి, దోమల విజయ్ కుమార్ జగన్, జిల్లా ఉపాధ్యక్షులు యాదవ్, పవన్, వెంకట నర్సింహా రెడ్డి, ఎల్లన్న, జిల్లా కార్యదర్శులు రవిశంకర్, భూమయ్యలతో పాటు ఇతర జిల్లా నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు, కిసాన్ మోర్చా నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎడిటోరియల్

Editorial

దారిద్ర్య నిర్మూలనలో పాలకుల వైఫల్యాలు

అంతర్జాతీయ దారిద్ర్య నిర్మూలన దినోత్సవం

పేదరిక నిర్మూలన పేరిట ప్రత్యేకంగా ఏటా ఓ రోజును కేటాయించి జరుపుకొంటూనే ఉన్నాం. అదే అక్టోబర్ 17 అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినం. 'అంతర్జాతీయ పేదరికనిర్మూలన దినోత్సవం' ప్రతి ఏటా అక్టోబర్ 17న నిర్వహించ బడుతోంది. ప్రపంచ వ్యాప్తంగా పేదరికంలో మగ్గుతున్న వారి స్థితిగతులను అర్థం చేసుకుని, పేదరిక నిర్మూలనకోసం కృషి చేసేందుకు ఐక్యరాజ్య సమితి 1990అక్టోబర్ 17న అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం నిర్వహించాలని అధికారికంగా ప్రకటించింది.

హింసకు అత్యంత హీనరూపం పేదరికం అనేది మహాత్మాగాంధీ మాట. దారిద్ర్యం (ప్రాశీజవతీఎ) ఒక సామాజిక, ఆర్థిక సమస్య. ఇది దీర్ఘకాలిక సామాజిక సమస్యగా ఉంది. సమాజంలో ఒక వర్గం కనీస అవసరాలైన ఆహారం, గృహవసతి, దుస్తులు పొందలేని పరిస్థితిని పేదరికం లేదా దారిద్ర్యం అంటారు. పేదరికంతో బాధపడుతున్న వారిని "పేదలు" అంటారు. పేదలకు ప్రధాన ఆదాయ వనరు ఉపాధి. కాబట్టి, ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. సరైన ఉపాధి అవ కాశాలు లేని ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కష్టమైన పని. పేదరిక నిర్మూలన, సామాజిక పురోగతి కోసం చేపడుతున్న కార్యక్రమాలకు, పెరుగుతున్న ఆర్థిక అసమానతలు అతిపెద్ద సవాలుగా మారు తున్నాయి". ప్రజల చేతుల్లో డబ్బు ఉన్నంత మాత్రాన ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందినట్లు కాదు, వారికి విద్య, వైద్యం, రుణ సదుపాయం, మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలి. అవన్నీ లేవంటే సమగ్ర అభివృద్ధి జరగడం లేదని భావించాలి. ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో 2030 నాటికి పేదరికాన్ని నిర్మూలించాలన్నది ఒకటి. కానీ, ఆ గడువు పూర్తయ్యే నాటికి కూడా ప్రపంచ జనాభాలో ఆరు శాతం మంది అంతర్జాతీయ దారిద్ర్య రేఖకు



దిగువనే ఉంటారని 2019 జూలైలో ఆ సంస్థ విడుదల చేసిన నివేదిక పేర్కొంది. ప్రస్తుత అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు "పేదలకు బాగానే అందు తున్నాయి. కానీ, నిరుపేదలకు అందడం లేదు". కొందరి గుప్పిట్లోనే సంపద 'దారిద్ర్యానికి అంతం పలికి సంపదను సమానంగా పంపిణీ చేద్దాం' పేరిట ప్రపంచ బ్యాంకు ఇటీవల విడుదల చేసిన నివేదిక ఆసక్తికర అంశాలను వెల్లడించింది. 101 దేశాల్లో 23.1 శాతం మంది పేదరికంలో ఉన్నట్లు తేలింది. ఇందులో సగం 18 ఏళ్లలోపువారే. అధ్యయనం జరిపిన దేశాల్లో 17.5 శాతం వయోజనులు పేదరికంలో మగ్గుతుండగా, 33.8 శాతం చిన్నారులు ఆ దురవస్థలో కూరుకుపోయి ఉన్నారు. 1990 నుంచి 2015 వరకు ప్రపంచంలో అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న (రోజుకు 1.90 డాలర్లు (దాదాపు రూ. 135) లేదా అంతకంటే తక్కువ ఆదాయం) వారి సంఖ్య 190 కోట్ల నుంచి 73.5 కోట్లకు తగ్గింది. అంటే, 1990లో మొత్తం జనాభాలో 36 శాతం మంది పేదరికంలో ఉంటే, 2015 నాటికి అది 10 శాతానికి తగ్గింది. 2015 నాటికి అసమానతల వల్ల వృద్ధిలో వెనకబాటు, దారిద్ర్య నిర్మూలనలో సాను కూలంగా పెరిగేటట్లు చేయడం తొలి లక్ష్యం, వయసు, లింగం వైకల్యం, జాతి, పుట్టుక, మతం, ఆర్థిక వంటి వైరు ధ్యాలతో నిమిత్తం లేకుండా 2030 నాటికి ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ ఆదాయం కనీస అవస రానికి అనుగుణంగా ఉండాలనేది భావన.

2012లో అంతర్జాతీయంగా 90 కోట్ల మంది రోజుకు 1.90 డాలర్ల కంటే తక్కువ కోట్లకు పడి పోయింది. ఈ గణాంకాలు ఎలా ఉన్నా, దుర్భర దారిద్యం ప్రపంచ మానవాళిని దారుణంగా వేధిస్తోంది. 'క్రెడిట్ న్యూస్' నివేదిక ప్రకారం కేవలం ఒక శాతం సంపన్నుల చేతిలో ప్రపంచం లోని సగానికిపైగా సంపద కేంద్రీకృతమై ఉంది. శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన రంగాల్లో మానవ మేధ గగన సీమలను చుంబిస్తున్నా సర్వకాల సర్వావస్థల్లో విస్తరిస్తున్న పేదరి కానికి అడ్డుకట్ట వేయడంలో దారుణ వైఫల్యం వెక్కిరిస్తోంది. నేటికీ లక్షల మంది చిన్నారుల బాల్యం దోపిడికి గురవుతోంది. పేదరికంలో మగ్గుతున్న చిన్నారులు తమ హక్కుల్ని, ఆరోగ్యాన్ని, పోషకాల్ని, విద్యావకాశాలను కోల్పోతున్నారు. ఇవాళ అంతర్జాతీయ దారిద్ర్య నిర్మూలన దినోత్సవం జరుపు కొంటున్నాం. ప్రపంచం నుంచి పేదరికాన్ని తరిమి కొట్టడం సహస్రాబ్ది, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో కీలకంగా చెప్పుకొన్నారు. కానీ, ఆ లక్ష్యాలు సాకారమయ్యే అవకాశం కనుచూపు మేరలో కనిపించక పోవడమే బాధాకరం.

అవమానాల నుంచి, వెలివేతల నుంచి బాధా సర్పదష్టులనూ విముక్తి కలిగించి, అందరి భాగస్వామ్యంతో పేదరికాన్ని పునాదుల నుంచి పరిమార్చడమే నినాదంగా పేదరిక నిర్మూలన దినోత్సవం జరుపుతున్నారు. సర్వత్రా పెనువేగంతో విస్తరిస్తున్న అసమానతలు ఇప్పుడు ప్రపంచానికి అతిపెద్ద సవాలుగా నిలుస్తున్నాయి. దేశాల మధ్య యుద్ధం కాదు, పేదరికంపై సమరం చేయాలని ఆ మధ్య భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును ఈ నేపథ్యంలోనే అర్థం చేసుకోవాల్సి ఉంది. అందరికీ ఉపాధి కల్పించినట్లయితే పేదరికం, ఆదాయ అసమానతలను తగ్గించవచ్చు. ప్రభుత్వం, నీతి ఆయోగ్ ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించాలి. భారత దేశంలో వ్యవసాయం 50 శాతం శ్రామికులకు జీవనాధారం కల్పిస్తోంది. ఈ రంగం అనుబంధ వృత్తి, వ్యాపారాలు, ఉద్యోగాలను పెద్ద సంఖ్యలో అందించ గలదు. 2022 కల్లా రైతుల ఆదాయాలను సమయాల్లోనే కాదు, పంటలు విరగ పండిన సంవత్సరాల్లోనూ రైతులకు అరకొర ధరలైనా దక్కడం లేదు. అన్నదాతల ఆదాయాలు పెరగనంత వరకు పేదరికాన్ని నిర్మూలించలేం. ఇక భారతీయ శ్రామికుల్లో 92 శాతం అసంఘటిత రంగాల్లోనే పని చేస్తున్నారు. వారికి వేతనాలు బహు తక్కువ. పింఛన్ల వంటి సామాజిక భద్రత భృతులేవీ లభించవు. పైగా పని పరిస్థితులు దుర్భరం. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారిపోతున్న దృష్ట్యా సంఘటిత రంగ కార్మికులు సరికొత్త ఉద్యోగాల్లో మహిళల వాటా సైతం పెరగాలి. ఇతర దేశాల్లో 50 నుంచి శాతం మంది మహిళలు ఉద్యోగాలు చేస్తుంటే, భారత దేశంలో వారి సంఖ్య కేవలం 24 శాతం. స్థూలంగా చూస్తే భారత్, చైనాలు రెండింటిలో అసమానత ఒకేరకంగా ఉన్నట్లు కనిపించినా భారతీయ పేదలు కనీస అవసరాలు కూడా తీరని దుస్థితిలో ఉన్నారు. విద్య, వైద్యం, ఇతర సేవలూ సరిగ్గా అందడం లేదు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా... ఏళ్లయినా రైతులకు ఇప్పటికీ గిట్టుబాటు ధరలను అందించ లేక పోవడం విచారకరం. అనావృష్టి పీడిత ప్రతి పౌరుడికి కొంత ఆదాయం అందించడానికి సార్వజన కనీస ఆదాయ పథకం పెట్టాలని ప్రపంచ మంతటా ప్రతిపాదనలు వస్తున్నాయి. ఈ పథకాన్ని మొదట వృద్ధుల సంక్షేమం కోసం అమలు చేయవచ్చు. దేశ జనాభాలో ఎనిమిది శాతంగా ఉన్న వృద్ధులకు దీనివల్ల ఎంతో ఊరట కలుగుతుంది. తరవాత మిగతా లబ్ధిదారులకు క్రమంగా ఈ పథకాన్ని వర్తింప జేయవచ్చు. అనారోగ్యం ఉపాధి కోల్పోవడం, పంట నష్టం వంటి అనూహ్య విపత్తులతో అతలా కుతలమయ్యే పేదలకు కనీసాదాయ పథకం ఎంతో కొంత ఆసరా ఇస్తుంది. అదే సమయంలో పేదలకు సరైన ఉపాధి కల్పించడం ఎంతో ముఖ్యం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

సత్యాన్వేషణే ఆయన ధర్మం-

చరిత్ర రచన ఆయన తపస్సు

అక్టోబర్ 17...ఆంధ్ర చరిత్ర చతురానన చిలుకూరి వీరభద్రరావు జయంతి

ఆంధ్రుల చరిత్రను శాస్త్రీయ పద్ధతిలో ఆవిష్కరించిన ప్రథమ చరిత్రకారుడు, నిర్భయ పత్రికా సంపాదకుడు, సమగ్ర రచయితగా ప్రసిద్ధి పొందిన చిలుకూరి వీరభద్రరావు తెలుగు జాతి ఆత్మగౌరవ చరిత్రలో ఒక శాశ్వత స్తంభం. ఆయన చరిత్ర పరిశోధన కేవలం శాస్త్రీయ కృషి మాత్రమే కాకుండా, ఒక జాతి ఆత్మను మేల్కొలిపిన పునాదిగా నిలిచింది. ఆంధ్రుల మూలాలు, సంస్కృతి, సాహిత్యం, రాజకీయం అన్నింటినీ సమగ్రంగా ఆవిష్కరించడానికి తన జీవితాన్ని అంకితం చేసినందుకే ఆయనను "ఆంధ్ర చరిత్ర చతురానన"గా గౌరవించారు.



1872 అక్టోబర్ 17న పశ్చిమ గోదావరి జిల్లాలోని రేలంగి గ్రామంలో ఒక పేద కుటుంబంలో జన్మించిన వీరభద్రరావు చిన్నతనం నుంచే అసాధారణ మేధస్సును ప్రదర్శించారు. ఆ కాలంలో ఇంగ్లిష్ విద్య ఒక కొత్త దారిని చూపిస్తున్నప్పుడు, ఆయన పాశ్చాత్య విద్యతో పాటు భారతీయ సంస్కృతిని గుండెల్లో దాచుకున్నారు. విద్యార్జనతో పాటు ఆయనలో దేశభక్తి భావం మేల్కొంది. కష్టసాధ్యమైన పరిస్థితుల్లోనూ విద్యపై అపారమైన ఆసక్తితో సంస్కృతం, ఆంధ్ర భాషల్లో ప్రావీణ్యం సాధించారు. ఆయన విద్యార్జన కేవలం పుస్తక పరిధిలో మాత్రమే కాకుండా చుట్టూ ఉన్న సమాజాన్ని పరిశీలించి అర్థం చేసుకునే లోతైన జ్ఞానాన్వేషణగా మారింది.

వీరభద్రరావు వృత్తి ప్రారంభం పత్రికా సంపాదకత్వంలో జరిగింది. ఆ కాలంలో పత్రికలు ప్రజల్లో చైతన్యం కలిగించడంలో ప్రధాన పాత్ర పోషించేవి. ఆయన పనిచేసిన దేశోపకారి, ఆంధ్ర దేశాభిమాని, విబుధ రంజని, ఆంధ్రకేసరి, సత్యవాది వంటి పత్రికలు జాతీయోద్యమానికి, ఆత్మగౌరవ ఉద్యమానికి వేదికలుగా నిలిచాయి. ఆయన రచనలు నిష్పక్షపాతంగా, నిర్భయంగా ఉండేవి. ఏదైనా సామాజిక అన్యాయం, రాజకీయ మోసం, విద్యా వెనుకబాటు గమనించినప్పుడు ఆయన కలం ధర్మ యోధునిలా స్పందించేది. ఆ కాలంలో తెలుగునాట పత్రికా సంపాదకత్వం అంటే కేవలం వ్యాసరచన కాదు --- ప్రజా చైతన్యానికి దిశానిర్దేశం. ఆ పాత్రను ఆయన అత్యంత సమర్థంగా నిర్వర్తించారు.

అయితే ఆయన ఖ్యాతికి మూలం పత్రికా రంగం కాక, చరిత్ర పరిశోధనే. ఆంధ్రుల చరిత్ర రచనకు ఆయన చేసిన కృషి అసమానము. 1909 నుండి 1912 వరకు మద్రాసు (చెన్నై)లో నివసిస్తూ ఆయన ఐదు సంపుటాల ఆంధ్రుల చరిత్ర గ్రంథాన్ని రచించారు. విజ్ఞాన చంద్రికా మండలి ప్రచురించిన ఈ గ్రంథాలు తెలుగువారి జాతీయ చైతన్యానికి మూల స్తంభాలయ్యాయి. చరిత్రను కేవలం వృత్తాంతాల సమాహారంగా కాకుండా, ఆంధ్రుల ఆవిర్భావం, వలసలు, రాజకీయ వ్యవస్థ, సంస్కృతి, భాష, సాహిత్యం, సామాజిక నిర్మాణం వంటి అన్ని కోణాల నుండి విశ్లేషించిన ఆయన కృషి ఆధునిక చరిత్రా రచనకు మార్గదర్శకం అయింది.

ఆయన పరిశోధనా వైఖరి పూర్తిగా స్వతంత్రంగా ఉండేది. నిజాన్ని నిర్భయంగా చెప్పడం ఆయన ధర్మంగా భావించేవారు. తన సిద్ధాంతాలను నిరూపించడానికి ఆరోగ్యం, ఆస్తి, సమాజ ఒత్తిడిని కూడా లెక్కచేయకుండా పరిశోధనలో తలమునకలయ్యారు. "సత్యమే సత్పరిశోధన లక్షణం" అనే నమ్మకంతో ఏ మూలాధారాన్నీ అనవసరంగా తిరస్కరించకుండా శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేశారు.

ఆంధ్రుల చరిత్ర ప్రచురణ అనంతరం ఆయన సిద్ధాంతాలు విస్తృత చర్చలకు దారితీశాయి. ఆ కాలంలో చరిత్రా గ్రంథాల సంఖ్య తక్కువగా ఉండటంతో ఆయన పద్ధతి కొత్తదిగా, కొందరికి వివాదాస్పదంగా అనిపించింది. కొంతమంది పండితులు ఆయన నిర్ధారణలపై విమర్శలు చేశారు; కొంతమంది పుస్తక రూపంలో ప్రతివాదాలు కూడా రాశారు. అయినప్పటికీ, ఆంధ్ర చరిత్రను శాస్త్రీయ పద్ధతిలో స్థాపించడానికి మొదటి అడుగు ఆయనదే. అందుకే 1928లో నంద్యాలలో జరిగిన ఆంధ్ర మహాసభలో సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యక్షతన ఆయనను "ఆంధ్ర చరిత్ర చతురానన" అనే బిరుదుతో సత్కరించారు. ఈ బిరుదు ఆయన కీర్తికి మకుటం ధరింప చేసినట్లయింది.

వీరభద్రరావు రచనా ప్రస్థానం విస్తృతమైనది. ఆంధ్రుల చరిత్రతో పాటు ఆయన రాజమహేంద్రపుర చరిత్రము, జీర్ణ కర్ణాట రాజ్య చరిత్రము, తిక్కన సోమయాజి, తిమ్మరుసు మంత్రి, శ్రీనాథ కవి, శివాజీ చరిత్ర, వరలక్ష్మీ విలాసము, హిందూ సంసారము వంటి అనేక గ్రంథాలను రచించారు. ఆయన రచనలు వాస్తవాధారితమైనవి, చరిత్రలో వ్యక్తుల ప్రాముఖ్యతను నిష్పాక్షికంగా చిత్రించినవి. ఆయన చరిత్రను కేవలం రాజుల వృత్తాంతంగా కాకుండా ప్రజల జీవన ప్రవంతిగా చూపారు. ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ప్రసంగాలు, వ్యాసాలు, పాఠశాలల్లో సదస్సులు నిర్వహించారు. ఆయన ప్రేరణతో అనేక గ్రామాల్లో విద్యా కేంద్రాలు, గ్రంథాలయాలు స్థాపించ బడ్డాయి.

ఆయన సాహిత్య విమర్శకుడిగానూ పేరుపొందారు. కట్టమంచి రామలింగారెడ్డి వంటి ప్రముఖ విమర్శకులు వీరభద్రరావు గారి విమర్శన దృష్టిని ప్రశంసించారు. ఆయన వాక్యనిర్మాణం, భాషా పటిమ, విశ్లేషణా గాంభీర్యం తెలుగు శాస్త్రీయ రచనలో ఒక కొత్త దారిని చూపించాయి.

వీరభద్రరావు అధికార, పదవుల పట్ల అసక్తి చూపలేదు. తన కృషి విలువను కాలం గుర్తించక పోయినా, సత్యాన్వేషణలో తగ్గలేదు. పేదరికం, అనారోగ్యం, విమర్శలు ఆయనను కదిలించలేక పోయాయి. ఆయన జీవితం ఒక యజ్ఞం --- ఆంధ్రుల చరిత్ర యజ్ఞం. 1939లో ఆయన కన్ను మూశారు. కానీ ఆయన సృష్టించిన ఆంధ్రుల చరిత్ర గ్రంథం ఆంధ్ర భూమికి శాశ్వత వారసత్వంగా నిలిచింది. చిలుకూరి వీరభద్రరావు కృషి తరం తరాలకు ఆదర్శంగా నిలిచింది. విద్య, చైతన్యం, దేశభక్తి అనే మూడు స్తంభాలపై ఆయన జీవితం నిర్మించ బడింది.

ఆంధ్ర చరిత్ర ఉన్నంతకాలం చిలుకూరి వీరభద్రరావు పేరు నిలిచి ఉంటుంది. ఆయన పరిశోధనా పద్ధతి, రచనా ధోరణి, జ్ఞాన నిబద్ధత ఇవన్నీ నేటి చరిత్రకారులకు మార్గదర్శకంగా, ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఆంధ్రుల ఆత్మగౌరవ గాథకు ప్రాణం పోసిన చరిత్రకారుడు చిలుకూరి వీరభద్రరావే.

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్,
కాలమిస్ట్...9440595494

బిచ్చగాళ్ల ముసుగులో బిచ్చగత్తె వ్యవస్థ! ఇది దాతృత్వమా? దోపిడీనా?



భారతదేశంలో బిచ్చం అడుక్కోవడం ఒక వృత్తిగా మారిపోయింది. ఒకప్పుడు నిజంగా ఆకలితో, అనాధగా, వికలాంగులుగా ఉన్నవారు మాత్రమే చేయి చాచేవారు. కానీ నేడు సిగ్నల్ దగ్గర, గుడి ముందు, బస్టాండ్ లో, రైలులో... ఎక్కడ చూసినా బిచ్చగాళ్లే! అందులో చాలా మంది పని చేయగలిగిన యువకులు, ఆరోగ్యంగా ఉన్న మహిళలు, పిల్లలు కూడా ఉండటం మనల్ని ఆలోచింపజేస్తోంది. పని చేసేవాడు కూడా ఎందుకు అడుక్కుంటున్నాడు?

దీని వెనుక ఒక పెద్ద మాఫియా ఉందన్న ఆరోపణలు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ లాంటి పెద్ద నగరాల్లో బిచ్చగాళ్లను మెయింటైన్ చేసే గ్యాంగులు ఉన్నాయని పోలీసులే అనేకసార్లు చెప్పారు. ఒకొక్క బిచ్చగాడికి రోజుకు ఇంత టార్గెట్ ఇస్తారు, సాయంత్రం వసూలు చేసిన డబ్బులో సగం గ్యాంగ్ లీడర్ తీసుకుంటాడు. పిల్లలను కిడ్నాప్ చేసి, వికలాంగులుగా చేసి బిచ్చం ఎత్తించే దారుణాలు కూడా వెలుగులోకి వచ్చాయి. కానీ ఆశ్చర్యం ఏమిటంటే, ఇలాంటి గ్యాంగులు ఎక్కడా పూర్తిగా దొరకరు, శిక్ష పడదు. ఆరోపణలు గాలిలోనే కలిసిపోతాయి.

పని చేసేవాడు ఎందుకు అడుక్కుంటున్నాడు?
దీనికి మూడు కారణాలున్నాయి...

సులభంగా వచ్చే డబ్బు: రోజంతా కష్టపడి కూలి పని చేస్తే రూ. 500 వస్తుంది. అదే బిచ్చం ఎత్తుకుంటే 2-3 గంటల్లోనే రూ. 1000 వరకు వస్తుందని చాలా మంది లెక్క వేసుకుంటున్నారు. శ్రమ లేకుండా డబ్బు వచ్చే మార్గంగా దీన్ని చూస్తున్నారు.

ప్రజల్లో జాలి, దానగుణం: మన భారతీయుల్లో దానం చేస్తే పుణ్యం వస్తుందనే నమ్మకం బలంగా ఉంది. ఈ బలహీనతను ఆసరాగా చేసుకుని బిచ్చగాళ్లు ఎమోషనల్ డ్రామా చేస్తున్నారు. పసిపిల్లలను అడ్డం పెట్టుకుని జాలి పొందుతున్నారు.

ప్రభుత్వ వైఫల్యం: నిజంగా పని లేక, ఉపాధి లేక అడుక్కునేవారు కూడా ఉన్నారు. స్కిల్ డెవలప్మెంట్, ఉపాధి హామీ పథకాలు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. ఒక వ్యక్తికి గౌరవంగా బతకడానికి ప్రత్యామ్నాయం చూపించలేనప్పుడు, అతడు చేయి చాచక తప్పదు.

ఈ వ్యవస్థ ఇలాగే ఉండాలా? బిచ్చం ఇవ్వడం మానేయడం పరిష్కారం కాదు. బిచ్చం తీసుకునేలా చేస్తున్న వ్యవస్థను కొట్టాలి.
ప్రభుత్వం చేయాల్సింది – ప్రతి జిల్లాలో బిచ్చగాళ్ల సర్వే చేసి, పని చేయగలిగిన వారిని గుర్తించి, వారికి కౌన్సిలింగ్ ఇచ్చి, ఉపాధి కల్పించాలి. గ్యాంగులను ఉక్కుపాదం మోపాలి. పిల్లలతో బిచ్చం ఎత్తించడాన్ని బాల కార్మిక చట్టం కింద కఠినంగా శిక్షించాలి.

మనం చేయాల్సింది – గుడి ముందు, సిగ్నల్ దగ్గర డబ్బులు విసిరేయడం కాదు. నిజంగా అవసరం ఉన్నవారికి అన్నం పెట్టడం, చదువుకు సాయం చేయడం, ఒక చిన్న పని కల్పించడం చేయాలి. దానం చేయండి, కానీ బిచ్చగత్తె వ్యవస్థను పెంచేలా కాదు. బిచ్చం అడుక్కోవడం తప్పు కాదు, అడుక్కునేలా చేస్తున్న సమాజం తప్పు. ఆ తప్పును సరిదిద్దే రోజే నిజమైన అభివృద్ధి!

ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్,
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9440287170.

24 గంటల కరెంట్ హామీ ఏమైంది?

- రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కోతలు.. ఎండిపోతున్న పంటలు
- సింగరేణి భవిష్యత్తుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఏదీ?
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శలు



జమ్మికుంట, అక్టోబర్ 16 (సింగిడి): ఎన్నికల సమయంలో 24 గంటల విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయానికి ఆరు గంటలే విద్యుత్ ఇస్తోందని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పంటలు ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపించారు. సింగరేణి సంస్థను సంక్షోభంలోకి నెట్టి తెలంగాణను చీకట్లోకి తీసుకెళ్తున్నారని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.

హుజురాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తుంటే, సకాలంలో విద్యుత్ అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించడం ప్రభుత్వ బాధ్యత కాదా? రైతుల సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.

విద్యుత్ రంగంపై శ్వేతపత్రం విడుదల చేయాలి

విద్యుత్ ఉత్పత్తి, రాష్ట్ర అవసరాలు, విద్యుత్ కొనుగోళ్ల ఖర్చులు, సరఫరాలో అంతరాయాల కు గల కారణాలపై ప్రభుత్వం సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్ సమస్యలకు ప్రకృతి వైపరీత్యాలను సాకుగా చూపకుండా, సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్న ఆయన, ప్రస్తుత ప్రభుత్వం విద్యుత్ కోతలకు కారణాలను ప్రజలకు వివరించాలని కోరారు. అధికారులపై నెపం నెట్టి ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పించుకోలేదని అన్నారు.

సింగరేణి భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వాలి

తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన సింగరేణి సంస్థ భవిష్యత్తుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. సంస్థ ఉత్పత్తి, ఆదాయం, కార్మికుల సంక్షేమం, భవిష్యత్తు ప్రణాళికల వివరాలను వెల్లడించాలని కోరారు. సింగరేణి సంస్థను బలోపేతం చేస్తూ కార్మికుల హక్కులను కాపాడాలని సూచించారు.

రాష్ట్రంలో విద్యుత్ కోతలు ఎందుకు పెరుగుతున్నాయి?

వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించడంలో సమస్యలేమిటి? విద్యుత్ ఉత్పత్తి, కొనుగోళ్లు, పంపిణీ వ్యయాల వివరాలను ఎందుకు వెల్లడించడం లేదు? సింగరేణి సంస్థ భవిష్యత్తు కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి? అని ప్రశ్నించారు. రైతులకు నిరంతర విద్యుత్ అందించి, పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవడంతో పాటు విద్యుత్ రంగంపై సమగ్ర నివేదిక విడుదల చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, డీసీసీబీ వైస్ చైర్మన్ పింగిళి రమేష్, తిరుపతిరావు, ఇంద్రసేనారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సంపత్ రావు, పొనగంటి సంపత్, మాజీ ఎంపీపీ సురేందర్ రెడ్డి, వెంకటేష్, తిరుపతిరెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మణరావు, గందె శ్రీనివాస్, కొలిపాక శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ దిలీప్, వైస్ చైర్మన్ జావీద్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకమండలి నియామకం

- చైర్మన్‌గా రేవెల్లి రాజలింగం, వైస్ చైర్మన్‌గా రేమిడి శ్రీనివాస్ రెడ్డి





మానకొండూర్, అక్టోబర్16(సింగిడి): మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా రంగపేట గ్రామానికి చెందిన రేవెల్లి రాజలింగం నియామక మయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా ఊటూరు గ్రామానికి చెందిన రేమిడి శ్రీనివాస్ రెడ్డి నియమితులయ్యారు. ప్రభుత్వం ప్రకటించిన ఈ నూతన పాలకమండలి తక్షణమే అమలులోకి రానుంది. మార్కెట్ కమిటీ నూతన పాలకమండలి సభ్యులు,ఎర్రోళ్ల కవిత,తమిశెట్టి రాజేష్,రామినేని రామయ్య,కనకం అశోక్, రాపాక రాజేశ్వర్,కుంభం చిరంజీవి,కొత్తిరెడ్డి శ్రీనివాసరెడ్డి,మండల సంపత్ రెడ్డి,ముక్కెర సతీష్ కుమార్,ఏ రామాంజనేయ, దూలం వీరస్వామి,విశ్వనాథుల వీర కుమార్,నూతనంగా నియమితులైన చైర్మన్, వైస్ చైర్మన్ పాలకమండలి సభ్యులకు మానకొండూర్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల రైతులు, ప్రజాసంఘాల నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. తమపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు నూతన చైర్మన్ రేవెల్లి రాజాలింగం , వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా, మార్కెట్ యార్డ్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని అని అన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కోరపల్లి విద్యార్థులు



- జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ చాటిన ముగ్గురు విద్యార్థులు

జమ్మికుంట, అక్టోబర్ 16 (సింగిడి): రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కోరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 11న కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలబాలికల హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఎంపికైన విద్యార్థుల్లో ఎనిమిదో తరగతికి చెందిన పి. అక్షర, పి. సాయి నవిత, పి. సాయి మణితేజ ఉన్నారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు మహబూబ్‌నగర్ జిల్లా భగీరథ కాలనీలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు జరగనున్నాయి. విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేతిరి శ్రీనివాస్ రెడ్డి, వ్యాయామ విద్యా ఉపాధ్యాయులు జి. శ్రీను హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రజిత, సర్పంచ్ మధుసూదన్, మండల విద్యాధికారి ఎం. హేమలత, ఉపసర్పంచ్ రాజు యాదవ్ విద్యార్థులను అభినందించారు. గ్రామ యువకులు, గ్రామస్థులు సైతం విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తిప్పారపు తుకారాం



జమ్మికుంట, అక్టోబర్ 16 (సింగిడి): పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పెద్దపల్లి జిల్లా మోట్లపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గణిత స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తిప్పారపు తుకారాం నియమితులయ్యారు. అక్టోబర్ 15, 16 తేదీల్లో నల్లగొండలోని జీఎం గార్డెన్స్‌లో నిర్వహించిన పీఆర్టీయూ రాష్ట్ర ఆరవ కౌన్సిల్ సమావేశాల్లో జరిగిన ఎన్నికల్లో ఆయనను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు సుంకరి భిక్షం గౌడ్, ప్రధాన కార్యదర్శి బట్టపురపు మధుసూదన్ రెడ్డి చేతుల మీదుగా నియామకం జరిగింది. తుకారాం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులు కావడం పట్ల గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం జమ్మికుంటలో తుకారాం మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించిన సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ, పీఆర్టీయూ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన పీఆర్టీయూ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గుండు కృష్ణ, ప్రధాన కార్యదర్శి కాసుగడ్డ శ్రీనుతో పాటు రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల క్షేమమే ఆకాంక్షగా..అమ్మవారి చెంతన ఎస్సై సంతోష్



మంచిర్యాల, అక్టోబరు 16 (సింగిడి): విధి నిర్వహణలో ప్రజల భద్రతకు బాధ్యత వహించే పోలీసు అధికారి.. అమ్మవారి సన్నిధిలో ప్రజల క్షేమాన్ని కాంక్షించారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-5 గని ఆవరణలో కొలువుదీరిన అమ్మవారిని శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్ దర్శించుకుని ప్రత్యేకంగా ప్రార్థించారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నారు. నిత్యం విధి నిర్వహణలో బిజీగా ఉండే పోలీసు అధికారులు సైతం ఆధ్యాత్మికతలో మనశ్శాంతిని వెతుక్కుంటూ, సమాజ శ్రేయస్సును కాంక్షించడం విశేషం. వ్యక్తిగత క్షేమం కంటే ప్రజలందరి బాగోగులే ముఖ్యమనే ఆకాంక్షతో అమ్మవారిని ప్రార్థించడం భక్తిభావాన్ని, సామాజిక బాధ్యతను చాటుతోంది.

బతుకమ్మ, దుర్గామాత నిమజ్జనాలకు రూ.3 కోట్లతో ఏర్పాట్లు

నిమజ్జన ఘాట్లను పరిశీలించిన మేయర్ కొలగాని శ్రీనివాస్, ఉప మేయర్ యాదగిరి సునీల్ రావు



కరీంనగర్, అక్టోబర్16(సింగిడి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ, దుర్గామాత నిమజ్జన వేడుకలను వైభవంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రూ. 3 కోట్లతో ఏర్పాట్లు చేస్తున్నట్లు మేయర్ కొలగాని శ్రీనివాస్, ఉప మేయర్ యాదగిరి సునీల్ రావు తెలిపారు. శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కార్పొరేటర్లు, అధికారులతో కలిసి మానేరు డ్యామ్, మార్కండేయ నగర్, శివనగర్, సప్తగిరి కాలనీ, గౌతమి నగర్, వేదభవన్, కొత్తపల్లి, గోపాల్‌పూర్, దుర్గేడ్ తదితర ప్రాంతాల్లోని నిమజ్జన ఘాట్లను పరిశీలించారు. విద్యుద్దీపాలంకరణ, ధ్వని వ్యవస్థ, చదును పనులు, వేదికలు, బారికేడ్లు, తాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. ఈ నెల 21న జరిగే దుర్గామాత విగ్రహాల నిమజ్జనాల కోసం మానకొండూర్, కొత్తవల్లి చెరువులను ఎంపిక చేసినట్లు తెలిపారు. అక్కడ భారీ క్రేన్లు, గజ ఈతగాళ్లు, విద్యుద్దీపాలు, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. మహిళలు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చొప్పరి జయశ్రీ వేణు, మాసం గణేష్, ఏపీపీ చంద్ర, తెల్ల లక్ష్మి రమేష్, ఆకుల నర్మద నర్సయ్య, చాడగొండ కవిత బుచ్చిరెడ్డి, సొగాని కొమురయ్య, నాంపల్లి రేణుక శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడి గృహప్రవేశానికి ఉప మేయర్

నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికుడు బుచ్చయ్య కిసాన్ నగర్‌లో నిర్మించుకున్న నూతన ఇంటి గృహప్రవేశ వేడుకకు ఉప మేయర్ యాదగిరి సునీల్ రావు హాజరయ్యారు. బుచ్చయ్య, ఆయన కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా పొనగంటి మల్లయ్య జన్మదిన వేడుకలు...

శివాలయంలో మహా అన్నదానం

జమ్మికుంట, అక్టోబర్ 16 (సింగిడి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జమ్మికుంట మాజీ సర్పంచ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నగంటి మల్లయ్య జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మల్లయ్య పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని శివాలయంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం శాలువాతో మల్లయ్య ను ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ, తనపై అభిమానంతో నా పుట్టినరోజు వేడుకలను అట్టహాసంగా నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు నా ఆత్మీయులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. పుట్టినరోజు సందర్భంగా శివాలయంలో అన్నదానం చేయడం సంతోషంగా ఉందని భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపడతానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.



పొనగంటి కి శుభాకాంక్షలు తెలిపిన ప్రణవ్



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొన్నగంటి మల్లయ్య పుట్టినరోజు సందర్భంగా హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ బాబు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి మిఠాయి తినిపించారు. సింగాపురం లోని ప్రణవ్ నివాసంలో మల్లయ్య ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట పట్టణ అధ్యక్షులు సుంకరి రమేష్ మరియు జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, దుబ్బ మల్లన్న దేవస్థానం చైర్మన్ ముద్దు మల్ల రవి, జమ్మికుంట వేసే మార్కెట్ డైరెక్టర్ మానుపాటి సూర్య, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గూడుపు సారంగపాణి, 26 వార్డ్ కౌన్సిలర్ దిడ్డి రాము, 11వ వార్డు కౌన్సిలర్ పొనగంటి విష్ణువర్ధన్, 5వ వార్డ్ యాట్ల సునీత అశోక్ కౌన్సిలర్, 15వ వార్డు కౌన్సిలర్ పాతకాల మౌనిక అనిల్, కన్నా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పొనగంటి రవీందర్, మాజీ కౌన్సిలర్ జమ్మికుంట దొడ్డి సదానందం, యూత్ కాంగ్రెస్ నాయకులు గంగారపు మహేష్, రోమాల రాజ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాతకాల ప్రవీణ్, మహేష్ ప్రణయ్, సుంకర విశ్వంత్, ఎర్రం నవదీప్ రెడ్డి, ఎర్రం సాత్విక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

కలెక్టరేట్ వద్ద నిరసనకు మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ సంఘీభావం

కరీంనగర్, అక్టోబర్16(సింగిడి): జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, పొరుగు సేవల ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాజీ మేయర్, 58వ డివిజన్ కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్ కోరారు. కరీంనగర్ కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొని మద్దతు తెలిపారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు వైద్య సేవలందించిన ఉద్యోగులు నేడు ఉద్యోగ భద్రత, వేతనాల కోసం పోరాడాల్సి రావడం బాధాకరమని ఉద్యోగులు పేర్కొన్నారు. దీర్ఘకాలంగా సేవలందిస్తున్న సిబ్బందిని క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా ఐదో తేదీలోపు వేతనాలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతన సవరణ బకాయిలతో పాటు ఇతర బకాయిలను విడుదల చేయాలని కోరారు. వార్షిక వేతన పెంపు, సేవా ప్రోత్సాహకాలు అమలు చేయాలని, వేతనాలు తగ్గిన ఉద్యోగులకు పూర్వపు వేతనాలను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల వ్యవస్థను రద్దు చేసి, ఉద్యోగులను రాష్ట్ర ఆరోగ్య సంఘం పరిధిలో కొనసాగిస్తూ నేరుగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ. 20 లక్షల పరిహారం లేదా బీమా, అర్హులైన కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశం కల్పించాలని కోరారు. ఉద్యోగులందరికీ ఆరోగ్య బీమా సదుపాయాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సమస్యలు వారి కుటుంబ భద్రతతో పాటు ప్రజారోగ్య సేవల కొనసాగింపునకు సంబంధించినవని పేర్కొన్న నిరసనకారులు, ప్రభుత్వం చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించి స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. తమకు మద్దతు తెలిపిన సర్దార్ రవీందర్ సింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



మున్సిపాలిటీలో ముందస్తు బతుకమ్మ వేడుకలు

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

మున్సిపల్ చైర్మన్, కమిషనర్

జమ్మికుంట, అక్టోబర్ 16 (సింగిడి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం వైభవోపేతంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో మెప్మా ఆధ్వర్యాన ఈ ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మను పూలతో అందంగా అలంకరించి, దాని చుట్టూ తిరుగుతూ మహిళలు సంప్రదాయబద్ధంగా పాటలు పాడుతూ చప్పట్లతో బతుకమ్మ ఆటలు ఆడారు. మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, మెప్మా ఇన్‌చార్జి టీఎంసీ మల్లీశ్వరి మహిళా సంఘాల సభ్యులతో కలిసి ఉత్సాహంగా పాల్గొని వేడుకల్లో సందడి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదా యాలకు ప్రతీక అని పేర్కొన్నారు. మహిళలందరూ బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ వికాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇల్లందుల రమేష్, మున్సిపల్ సిబ్బంది, మెప్మా టీఎల్ఎఫ్ ఓబీలు కవిత, జ్యోతి, సీఆర్పీలు జ్యోతి, మంజుల, టీఎల్ఎఫ్ ఆర్పీ స్రవంతి, ఇతర ఆర్పీలు, ఓబీలు పాల్గొన్నారు.



పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు భరోసాగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్

- లబ్ధిదారులకు చెక్కులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేసిన మంత్రి వివేక్ వెంకటస్వామి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



సిద్దిపేట, అక్టోబర్ 16, (సింగిడి): దుబ్బాక నియోజకవర్గం అక్బర్‌పేట్--భూంపల్లి మండలం నగరం గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, గడ్డం వివేక్ ముఖ్య అతిథిగా పాల్గొన్న వివేక్ తో కలిసి కొత్తప్రభాకర్‌రెడ్డి నియోజకవర్గం లో లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులతో పాటు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే గొప్ప లక్ష్యంతో తెలంగాణ తొలి సీఎం బీఆర్ఎస్ కేసీఆర్ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారు. ఆడబిడ్డల పెళ్లిళ్లు పేద కుటుంబాలకు ఆర్థిక భారంగా మారకూడదనే సంకల్పంతో ప్రారంభించిన ఈ పథకాలు లక్షలాది కుటుంబాలకు అండగా నిలిచాయి. అదేవిధంగా, పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరినప్పుడే ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు చెక్కులు, మంజూరు పత్రాలు అందజేస్తూ వారి కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు. పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే సంక్షేమ కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో ఆనందాన్ని నింపాలని ఆకాంక్షించారు.

రైతుల విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని మంత్రికి ఎమ్మెల్యే విజ్ఞప్తి

ఈ కార్యక్రమం సందర్భంగా దుబ్బాక నియోజకవర్గంలోని రైతులు ఎదుర్కొంటున్న వ్యవసాయ విద్యుత్ సమస్యలను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మంత్రి వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో వ్యవసాయ విద్యుత్ సరఫరాలో వేళాపాళా లేకపోవడం, లో-వోల్టేజ్, తరచూ విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. సరైన సమయంలో విద్యుత్ అందక పంటలకు నీరందించేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని, లో-వోల్టేజ్ కారణంగా వ్యవసాయ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతూ రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించడంతో పాటు పగటిపూట విద్యుత్ సరఫరాకు ప్రాధాన్యత కల్పించాలని, విద్యుత్ సరఫరా సమయాలను ముందుగానే ప్రకటించాలని కోరారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను 24 నుంచి 48 గంటల్లోపు ఉచితంగా మార్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులు కష్టపడి సాగు చేసిన పంటలు విద్యుత్ సమస్యల కారణంగా నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, వ్యవసాయ విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మంత్రి వివేక్ కోరారు.



గాంధీ విగ్రహానికి అడ్డుగా ఫ్లెక్సీలు

అనుమతులు లేని ఫ్లెక్సీలను తొలగించాలి

మున్సిపల్ కమిషనర్‌కు ఆర్యవైశ్య సంఘం వినతి



జమ్మికుంట, అక్టోబర్ 16 (సింగిడి): జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో మహాత్మా గాంధీ విగ్రహం కనిపించకుండా అడ్డుగా ఏర్పాటు చేసిన ప్రైవేట్ ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలని పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం కనిపించకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం విచారకరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వెంటనే తొలగించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మున్సిపల్ అధికారులు శాశ్వత చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు లెంకలపల్లి శరత్ కుమార్, ప్రధాన కార్యదర్శి కొండ్ల నాగేష్, కోశాధికారి చిదురాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఘాట్లను పరిశీలించిన ఆకుల నర్మదా నర్సన్న పటేల్

పండుగకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలి



కరీంనగర్, అక్టోబర్16(సింగిడి): బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కరీంనగర్ నగరంలోని బతుకమ్మ ఘాట్ల వద్ద జరుగుతున్న ఏర్పాట్లను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సన్న పటేల్, 11వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల నర్మదా పరిశీలించారు. లేట్ పోలీస్ స్టేషన్ సమీపంలోని బతుకమ్మ ఘాట్‌తో పాటు గౌతమ్ నగర్ డ్యామ్ వద్ద ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆకుల నర్సన్న పటేల్ మాట్లాడుతూ, పండుగకు వచ్చే మహిళలు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పారిశుధ్య సిబ్బంది న

జమ్మికుంటలో నభా నటేష్ సందడి!

- గరుడ వస్త్ర సిల్క్‌ను ప్రారంభించిన టాలీవుడ్ హీరోయిన్
- వ్యాపార రంగంలో దినదినాభివృద్ధి చెందుతున్న జమ్మికుంట
- ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూరి వెంకట్

జమ్మికుంట, అక్టోబర్ 16 (సింగిడి): కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో టాలీవుడ్ హీరోయిన్ నభా నటేష్ సందడి చేశారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన గరుడ వస్త్ర సిల్క్ షోరూమ్‌ను శుక్రవారం ఆమె ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూరి వెంకట్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నభా నటేష్ రాకతో షోరూమ్ ప్రాంగణం అభిమానుల సందడితో కళకళలాడింది. తమ అభిమాన నటితో



సెల్ఫీలు దిగేందుకు యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

వ్యాపార రంగంలో దూసుకెళ్తున్న జమ్మికుంట

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లాలో ప్రముఖ వ్యాపార కేంద్రంగా ఉన్న జమ్మికుంట పట్టణం రోజురోజుకూ అభివృద్ధి చెందుతూ వ్యాపార రంగంలో ముందుకు సాగుతోందన్నారు. పట్టణంలో ఆధునిక హంగులతో నూతన వస్త్ర షోరూమ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. వ్యాపారంలో ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని, వినియోగదారులకు నాణ్యమైన వస్త్రాలను అందిస్తూ నమ్మకంతో వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కొత్త వ్యాపార సంస్థల ఏర్పాటుతో స్థానిక యువతకు, మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. గరుడ వస్త్ర సిల్క్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

నాణ్యమైన వస్త్రాలే లక్ష్యం

గరుడ వస్త్ర సిల్క్ నిర్వాహకులు మాట్లాడుతూ.. ఆధునిక ఫ్యాషన్ ట్రెండ్లకు అనుగుణంగా సరికొత్త డిజైన్లు, విభిన్న కలెక్షన్లతో అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వస్త్రాలను అందించడమే తమ లక్ష్యమని వెల్లడించారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష ఖరారు

సిద్దిపేట్ల ప్రతినిధి, అక్టోబర్ 16 (సింగిడి): మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు 12 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి వై. జయప్రద తీర్పు వెల్లడించారు. సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2022 జనవరి 8వ తేదీన మాసుల శేఖర్ (28) అనే వ్యక్తి మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు కేసు నమోదు అయింది అప్పటి దర్యాప్తు అధికారి సిద్దిపేట రూరల్ ఎస్ఐ. శంకర్, సిఐలు సురేందర్ రెడ్డి, జానకి రామ్ రెడ్డి, సమగ్ర దర్యాప్తు నిర్వహించి పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి చార్జీ షీట్లు న్యాయస్థానంలో దాఖలు చేశారు. సాక్ష్యదారాలు సాక్షులు వాంగ్మూలాలు ఇతర ఆధారాలు న్యాయమూర్తి పరిశీలించిన అనంతరం నిందితుడిని దోషిగా నిర్ధారించి 20 సంవత్సరాల కఠిన కారకాల శిక్షతో పాటు 12, వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాదుల ఆత్మ రాములు వాదనలు వినిపించారు. ప్రస్తుత సిద్దిపేట రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్ఐ. నవత సాక్షాలు నమోదు చేసి సిఐ. వాసుదేవరావు, లైజానింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, సిడిఓ రవి, భరోసా లీగల్ అధికారి సౌమ్య, భరోసా సిబ్బంది ని సిపి రష్మీ పేరముల్ అభినందించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల భాగస్వామ్యం అవసరం



- ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించిన బీజేపీ నేతలు

కరీంనగర్, అక్టోబర్16(సింగిడి): ప్రజల భాగస్వామ్యంతోనే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధ మల్ల ఆనంద్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం చౌరస్తాలో రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని నాయకులు సూచించారు. ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు భద్రతా బెల్టు పెట్టుకోవాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని కోరారు. ప్రతి వాహనదారుడు బాధ్యతగా వ్యవహరించినప్పుడే రహదారి భద్రత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, రాష్ట్ర నాయకులు కందికట్ల సత్యనారాయణ, ఆడిచర్ల రాజు, పెరక సురేష్, జాడి బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి

ఎస్ఐతో పాటు నలుగురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలి

బత్తుల లక్ష్మీనారాయణ



కరీంనగర్, అక్టోబర్ 16 (సింగిడి) : నిజాలను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులపై చిత్రహింసలకు పాల్పడినట్లు వస్తున్న ఆరోపణలు సిగ్గుచేటని బీజేపీ ఎస్సీ సెల్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బత్తుల లక్ష్మీనారాయణ అన్నారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏక్ దమ్ న్యూస్ జిల్లా ప్రతినిధి సంపత్, సంపాదకుడు కొత్తూరు శేఖర్‌లను ఆయన పలువురితో కలిసి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట ఎస్ఐ చుక్కల శ్రీకాంత్‌తో పాటు నలుగురు కానిస్టేబుళ్లు జర్నలిస్టులను నిర్బంధించి తీవ్రంగా కొట్టినట్లు, చిత్రహింసలకు గురిచేసినట్లు వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరారు. బాధితుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు, ఇతర ఆధారాలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తేవాలన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐతో పాటు నలుగురు కానిస్టేబుళ్లను తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేయాలని, నేరం రుజువైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల సురేష్, లింగంపల్లి కళ్యాణ్, చందు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగం అమానుషం

బాధితులకు న్యాయం చేయాలి జర్నలిస్టుల భద్రతకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

రాజన్న ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కొంపెల్లి మహేష్



కరీంనగర్, అక్టోబర్16 (సింగిడి): జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించినట్లు వస్తున్న ఆరోపణలు ఆందోళనకరమని రాజన్న ప్రెస్ క్లబ్ సిరిసిల్ల అధ్యక్షుడు కొంపెల్లి మహేష్ అన్నారు. కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్టులు పొత్తూరి శేఖర్, రాతిపల్లి సంపత్‌లను ఆయన పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై దాడులు, వేధింపులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల హక్కులను కాపాడటంతోపాటు, వారు నిర్భయంగా విధులు నిర్వహించేలా ప్రభుత్వం తగిన రక్షణ కల్పించాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగే వరకు జర్నలిస్టు సంఘాలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల పరిరక్షణకు రాజన్న ప్రెస్ క్లబ్ సిరిసిల్ల అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

అడవిలో విద్యుత్ తీగలు అమరిస్తే కఠినచర్యలు

ఎస్పై సాంబమూర్తి

మహదేవపూర్ అక్టోబర్ 16, (సింగిడి): అడవి జంతువుల వేట కోసం అడవిలో విద్యుత్ తీగలు అమరిస్తే వేటగాళ్లకు కఠిన చర్యలు తీసుకుంటామని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ ఎస్పై సాంబమూర్తి హెచ్చరించారు. అటవీ జంతువులను వేటాడేందుకు అడవుల్లో గతంలో విద్యుత్ తీగలు అమర్చిన నలుగురు వ్యక్తులను ముందు జాగ్రత్త చర్యగా స్థానిక తహసిల్దార్ ముందు బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ జంతువులను వేటాడేందుకు విద్యుత్ తీగలు అమర్చడం వల్ల అటవీ జంతువులతో పాటు మనుషుల ప్రాణాలకు సైతం ముప్పు ఏర్పడుతుందని, ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని అన్నారు. గ్రామ పరిసరాల్లో లేదా అడవుల్లో ఎవరైనా అటవీ జంతువులను వేటాడేందుకు విద్యుత్తుగా ఏర్పాటు చేసినట్లు సమాచారం తెలిస్తే వెంటనే 8712658116 కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలు

సిద్దిపేట ప్రతినిధి, అక్టోబర్ 16, (సింగిడి): సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కె. హైమావతి, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్ ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..అందమైన పూలతో బతుకమ్మలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన మహిళా ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ధనిక, పేద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తమ సంప్రదాయాల ప్రకారం అమ్మవారిని ఆరాధిస్తారని, భక్తిశ్రద్ధలతో పూజించే బతుకమ్మ పండుగను జిల్లా ప్రజలు ఘనంగా జరుపుకోవాలని అన్నారు. భక్తితో ప్రార్థించినా అమ్మవారు అనుగ్రహిస్తారని తెలిపారు. చండీ హోమం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎక్కడ నిర్వహించినా వీలైనంతవరకు పాల్గొనాలని సూచించారు. ధర్మాన్ని కాపాడేందుకు, దుష్టశక్తులను సంహరించేందుకు దేవతలు వివిధ రూపాల్లో అవతరిస్తారని వివరించారు. నవరాత్రుల



సందర్భంగా ప్రతి ఒక్కరూ అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు. అమ్మవారు ప్రకృతిలో, ప్రాణశక్తిలో, క్షమాగుణంలో, మర్యాదలో, శరీర కాంతిలో, ఐశ్వర్యంలో వివిధ రూపాల్లో కొలువై ఉంటారని పేర్కొన్నారు. శక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని నిష్ఠతో, భక్తిశ్రద్ధలతో పూజించాలని పిలుపునిచ్చారు. అనంతరం అమ్మవారి స్తోత్రాలను పఠించారు. బతుకమ్మలను అందంగా తీర్చిదిద్దిన శాఖలకు బహుమతులు ప్రదానం చేశారు. రెవెన్యూ



శాఖకు మొదటి బహుమతి, డీఆర్‌డీఓకు రెండో బహుమతి, పట్టుపరిశ్రమల శాఖకు మూడో బహుమతి అందజేశారు. ఉద్యానవన శాఖ, టీఎన్జీఓలకు కన్సొలేషన్ బహుమతులు ప్రదానం చేశారు. బాలసదనం నుంచి బతుకమ్మలను తయారు చేసి తీసుకువచ్చిన చిన్నారులను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్, డీఆర్ఓ నాగరాజమ్మ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు కరెంట్ ఇవ్వలేని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు?

- మంగపేట అభివృద్ధి పనులపై నిర్లక్ష్యమెందుకు?
- బీఆర్ఎస్ నేత కుడుముల లక్ష్మీనారాయణ

ములుగు ప్రతినిధి, అక్టోబర్ 16 (సింగిడి): రైతులకు వ్యవసాయ విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయాలని, పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని, ఏటూరునాగారం--మంగపేట ప్రధాన రహదారికి బీటీ రోడ్డు నిర్మించాలని, మంగపేట బస్టాండ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బీఆర్ఎస్ పార్టీ మంగపేట మండల మాజీ అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మంగపేట మండలంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై విమర్శలు చేశారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లక్ష్మీనారాయణ అన్నారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతో పాటు, కాలిపోయిన మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మరమ్మతు చేయాలని కోరారు. విద్యుత్ సమస్యల కారణంగా పంటలు దెబ్బతినకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రెండో పంట సాగుపై స్పష్టత ఇవ్వాలి

రైతులు రెండో పంట సాగు చేయాలా వద్దా అనే అంశంపై ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించాలని ఆయన కోరారు. సాగుకు అవసరమైన విద్యుత్, నీటి సదుపాయాలు కల్పించి, రైతులపై అదనపు ఆర్థిక భారం పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సాగుకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు.



ఏటూరునాగారం--మంగపేట ప్రధాన రహదారిపై ప్రయాణించే ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే ఒక లేయర్ బీటీ రోడ్డు నిర్మించాలని లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ప్రమాదకరంగా ఉన్నప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టి, రహదారి పనుల పూర్తి గడువును అధికారులు ప్రకటించాలని కోరారు. మంగపేట బస్టాండ్ పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆయన విమర్శించారు. సంబంధిత అధికారులు పనుల పురోగతిని సమీక్షించి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ అసంపూర్తి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా బస్టాండ్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలు, ఇతర కారణాలతో పంట నష్టపోయిన రైతులను గుర్తించి సమగ్ర సర్వే నిర్వహించాలని లక్ష్మీనారాయణ కోరారు. అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందించి, వ్యవసాయ రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. ములుగు జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు, పంట నష్టాలు, రహదారుల దుస్థితి, అసంపూర్తి అభివృద్ధి పనులపై స్థానిక మంత్రి సీతక్క దృష్టి సారించాలని లక్ష్మీనారాయణ కోరారు. రైతులకు సక్రమంగా విద్యుత్ ఎప్పుడు అందిస్తారు? పంట నష్టపోయిన వారికి పరిహారం ఎప్పుడు చెల్లిస్తారు? ఏటూరునాగారం--మంగపేట రహదారికి బీటీ రోడ్డు ఎప్పుడు నిర్మిస్తారు? బస్టాండ్ పనులు ఎప్పటికి పూర్తవుతాయి? అని ప్రశ్నించారు. విద్యుత్ కోతలకు గల కారణాలను ప్రభుత్వం ప్రజలకు వివరించాలని, విద్యుత్ ఉత్పత్తి, సరఫరా పరిస్థితిపై వాస్తవాలను వెల్లడించాలని లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గు నిల్వలు, సరఫరా వివరాలపై స్పష్టత ఇవ్వడంతో పాటు, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించేలా కార్యాచరణ ప్రకటించాలని కోరారు. మంగపేట మండలంలో రైతుల సమస్యలతో పాటు రహదారులు, బస్టాండ్ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు. ప్రజలకు హామీలు ఇవ్వడమే కాకుండా వాటిని అమలు చేసి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయకపోతే, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాన్ని ఉధృతం చేస్తుందని కుడుముల లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మండల మాజీ ప్రధాన కార్యదర్శి గుండేటి రాజుయాదవ్, జిల్లా నాయకులు యడ్లపల్లి నర్సింహారావు, కర్రి శ్యాంబాబు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కోరం సంతోష్, మహిళా మండల మాజీ అధ్యక్షురాలు కాటూరి సుగుణ, బోర్ నర్సాపురం మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రావుల రమణ, పార్టీ నాయకులు చల్లగురుగుల తిరుపతి, గుండారపు రమేష్, అమిలి చంద్రం, పంజాల సత్యం, యువజన నాయకులు కేక్కం జగదీష్, కర్రి రామ్మోహన్, సోషల్ మీడియా వారియర్లు బీసా సాంబయ్య, గుడివాడ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మూలా నక్షత్రం వేళ మహాశక్తి ఆలయానికి పోటెత్తిన భక్తులు

- సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారి దర్శనం
- వైభవంగా పల్లకీ సేవ, ప్రత్యేక ఆకర్షణగా దాండియా

కరీంనగర్, అక్టోబర్16(సింగిడి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్‌లోని శ్రీ మహాశక్తి ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారు సరస్వతీదేవి (కాత్యాయనీ) అలంకారంలో దర్శనమివ్వగా, వేలాది మంది భక్తులు తరలివచ్చారు. విద్యార్థుల అక్షరాభ్యాసాలు, పుస్తక పూజలు, భవానీ భక్తుల రాకతో ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భవానీ

దీక్షలో ఉన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పుల్లారావు యాదవ్ తదితర ప్రముఖులు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, కళాకారులు సరస్వతీదేవిని పూజించి జ్ఞానం, వివేకం, ఏకాగ్రత ప్రసాదించాలని ప్రార్థించారు. సాయంత్రం అమ్మవారి పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక ప్రవచనాలతో పాటు సరస్వతీదేవిని కీర్తిస్తూ చిన్నారులు, మహిళలు చేసిన నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, ఉప మేయర్ సునీల్ రావు పల్లకీ సేవలో పాల్గొన్నారు. రాత్రి నిర్వహించిన దాండియా కార్యక్రమంలో ప్రత్యేక వస్త్రధారణతో యువతీ యువకులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొని నృత్యాలతో సందడి చేశారు.

ఫిరంగి నాలా సమస్యతో పాటు మౌలిక వసతుల కల్పనకు ప్రజల విజ్ఞప్తి

రాజేంద్రనగర్, అక్టోబర్ 16 (సింగిడి): ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే లక్ష్యంతో చేపట్టిన 'వన్ డే -- వన్ వార్డ్' కార్యక్రమంలో భాగంగా నార్సింగి సర్కిల్--45 డిప్యూటీ కమిషనర్ జి. లక్ష్మారెడ్డి గురువారం జన్వాడ, మిర్జాగూడ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, గ్రామ పెద్దలతో మాట్లాడి ఆయా ప్రాంతాల్లో నెలకొన్న పౌర సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

పర్యటనలో భాగంగా జన్వాడ గ్రామంలోని ఫిరంగి నాలాను పరిశీలించిన అధికారులు, సమస్యలపై స్థానికుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. నాలాలో మురుగునీరు ప్రవహించడం వల్ల పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమల బెడద పెరుగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అదేవిధంగా జన్వాడ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను



మెరుగుపరచడం, మంచినీటి సరఫరా సమస్యలను పరిష్కరించడం, అవసరమైన ప్రాంతాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయడం, దోమల నివారణకు ఫాగింగ్, యాంటీ లార్వా చర్యలు చేపట్టడం, సీసీ రోడ్లు నిర్మించడం వంటి సమస్యలను డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. నాలాల వద్ద ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ పెద్దలు కోరారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్‌ను ప్రజలకు మరింత అందుబాటులో ఉండేలా గ్రామంలోని శివాజీ చౌక్ వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని, పారిశుధ్య నిర్వహణ మెరుగుపడేందుకు అదనపు పారిశుధ్య సిబ్బందిని నియమించాలని కోరారు. దేవాలయాలకు సంబంధించిన భూములను పరిరక్షించి, ఆక్రమణలకు తావులేకుండా చూడాలని గ్రామ పెద్దలు విజ్ఞప్తి చేశారు. ఇందిరారెడ్డి నగర్, మిర్జాగూడ ప్రాంతాల్లో డ్రైనేజీ, మంచినీటి సరఫరా, దోమల నివారణ, రహదారులు, వీధి దీపాలు తదితర సమస్యలను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజలు తెలియజేసిన సమస్యలను సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రాధాన్యతా క్రమంలో పరిశీలిస్తామని తెలిపారు. సాంకేతికంగా సాధ్యమైన మేరకు, అందుబాటులో ఉన్న వనరులకు అనుగుణంగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, పారిశుధ్యం, డ్రైనేజీ, మంచినీరు, వీధి దీపాలు, రహదారులకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. 'వన్ డే -- వన్ వార్డ్' కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు నార్సింగి సర్కిల్--45, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. ఈ పర్యటనలో ఏఈ సంతోష్, వార్డు ఆఫీసర్ ప్రభాకర్, శానిటేషన్ ఇన్‌చార్జ్ లచ్చిరాం, జన్వాడ, మిర్జాగూడ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

జనగణన సిబ్బందికి శిక్షణ



సూర్యాపేట ప్రతినిధి అక్టోబర్ 16 (సింగిడి): జనగణన 2027 రెండోదశను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవర్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా ఇన్చార్జులు,క్లర్కులు అసిస్టెంట్లకు శిక్షణను ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంటిలో ప్రతి వ్యక్తి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని ఖచ్చితమైన జనాభా వివరాల సేకరణ ఎన్యుమరేషన్ బ్లాక్ వంటి కీలక అంశాలపై అవగాహన కల్పించామని అన్నారు. మొదటి దశలో ఏర్పాటుచేసిన హౌస్ లిస్టింగ్ బ్లాక్ లను రెండో దశ జనాభా గణనకు అనుగుణంగా ఈ బీలుగా మార్చడం జరిగిందని మొబైల్ యాప్ ద్వారా సమాచార నమోదు సి ఎం ఎం ఎస్ కోటలో సిబ్బంది వివరాలు పనుల పురోగతి పర్యవేక్షణ డేటా నిర్వహణ అంశాలపై శిక్షణ ఇచ్చామని తెలిపారు.

తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి



నల్లగొండ ప్రతినిధి అక్టోబర్ 16 (సింగిడి) : బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి అన్నారు. శుక్రవారం నల్గొండ పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్లో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారి క్యాంపు కార్యాలయం (ఇందిరా భవన్) లో ఘనంగా కాంగ్రెస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ మన తెలంగాణ ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెబుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. మహిళల సంక్ష

అతివ Athiva

సింగిడి

అసమాన కలం యోధుడు

షహీద్ షోయబుల్లా ఖాన్

అక్టోబర్ 17...షోయబ్ ఉల్లాఖాన్ జన్మదినం

పెన్నును గన్నుగా మార్చి, అక్షరాలను బుల్లెట్లుగా ప్రయోగించి, నాటి నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా రాజీలేని రచనలతో నిజాం ప్రభుత్వానికి నిద్దుర పట్టనీయకుండా వణికించిన షోయబ్ ఉల్లా ఖాన్ అక్షర వీరుడు. ప్రజల కోసం కలం పట్టి ప్రాణాలను తృణప్రాయంగా వదలిన ధీరుడు. పాత్రికేయ వృత్తికే వన్నె తెచ్చిన నిజాయితీ పరుడు. తన రచనలతో తెలంగాణ పాత్రికేయ చరిత్రలో సుస్థిర స్థానం పొందిన కలం యోధుడు. లక్ష్య సాధనలో ప్రాణ త్యాగం చేసిన అమరుడు. నిఖార్సైన వాడి వేడితో కూడిన తన రచనల ద్వారా నిజాం ప్రభుత్వ విధానాలను, రజాకార్ల దుశ్చర్యలను ఎండగట్టిన నిబద్ధత కలిగిన పాత్రికేయుడు. తన స్వేచ్ఛా రచన జీవితానికి చరమగీతం పాడుతుందని తెలిసినా వెనుకంజ వేయని మేరు నగ ధీరుడు. అపూర్వ త్యాగ ధనుడు.

షోయబ్ ఉల్లాఖాన్ 1920, అక్టోబరు 17 న ఖమ్మం జిల్లా సుబ్రవేడులో జన్మించాడు. తండ్రి హబీబుల్లా ఖాన్. తల్లి లాయహున్నీసా బేగం. వారి కుటుంబం ఉత్తర ప్రదేశ్ నుంచి నిజాం ప్రాంతానికి వలస వచ్చి ఇక్కడ స్థిరపడింది. షోయబ్ ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి బిఎ, జర్నలిజం డిగ్రీ పూర్తి చేశాడు. బొంబాయిలో ఇంటర్మీడియట్ గ్రేడ్ డ్రాయింగ్ పరీక్ష కూడా ఉత్తీర్ణుడైనాడు. తన కుమారునిలో గాంధీ మహాత్ముని పోలికలున్నాయని భావించి హబీబుల్లాఖాన్... 'షోయబుల్లా గాంధీ' అని ముద్దుగా పిలుచుకునే వాడు. గాంధీ లాగానే షోయబ్ కూడా తాను నమ్మిన మార్గంలో ప్రయాణించడంలో నిబద్ధతను, మొండితనాన్ని ప్రదర్శించాడు. తెలంగాణ అగ్నిగోళంలా మండుతున్న కాలమది. నిరంకుశ పాలన, దోపిడీ, దౌర్జన్యాలు సాగదంటూ సామాన్యుడు సమరం సాగిస్తున్న సమయమది. అది పత్రికలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్న కాలం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తా ప్రచురణ చేయడానికి సాహసించని గడ్డుకాలం. ఉస్మానియా యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి, ప్రజాస్వామ్య కాంక్షతో దుర్మార్గ పాలనను ఎదురించే చైతన్యంతో క్యాంపస్ నుంది షోయబుల్లా ఖాన్ బయట కొచ్చాడు. సమ సమాజం కోసం, అణగారిన అమాయక ప్రజల కోసం ఏదో చేయాలన్న తపన బలంగా ఉన్న షోయబ్ జాతీయోద్యమ స్ఫూర్తితో జర్నలిజాన్ని వృత్తిగా ఎంచు కున్నాడు. చిత్తశుద్ధి, అంకితభావం, నిబద్ధత కలిగిన జర్నలిస్ట్ గా జీవితం ప్రారంభించాడు.

మొదట షోయబ్ 'తేజ్ 'అనే ఉర్దూ పత్రికలో ఉప సంపాదకుడిగా చేరాడు. నిరంకుశ నిజాం ప్రభుత్వం, ఆయన తాబేదార్లయిన రజాకార్ల దౌర్జన్యాలు, అరాచ కాలను తీవ్ర స్థాయిలో విమర్శిస్తూ వార్తలనే అస్త్రాలను సంధించాడు. ప్రజా సమస్యలపై పాలకులను నిలదీస్తూ ప్రజల్లో చైతన్యం తెచ్చే ప్రయత్నం చేశాడు. చివరకు 'తేజ్' పత్రికను నిషేధించారు. కణకణ మండుతున్న నిప్పుకణికల్లాంటి షోయబుల్లాఖాన్ అక్షరాలకు ప్రచురణ అవకాశం అప్పటికే ముందుమల నర్సింగ రావు నిర్వహణ లోని రయ్యత్ పత్రిక కల్పించింది. ఆయన స్వతంత్ర భావ ప్రకటనలకు ఆ పత్రిక వేదిక అయింది. కొంత కాలానికి నిజాం ప్రభుత్వం 'రయ్యత్' పత్రికను మూసి వేయించింది.

నిజాం దౌర్జన్యాన్ని ఎదిరించడానికి సొంత పత్రిక ఉంటేనే మంచిదను కున్నాడు షోయబుల్లా ఖాన్. మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణా రావు సహాయంతో భార్య, తల్లి నగలను అమ్మి ఇమ్రోజ్ ను స్థాపించాడు. 1947 నవంబర్ 17న మొదటి సంచిక వెలువడింది.

బూర్గుల రామకృష్ణారావు ఇంట్లో ఇమ్రోజ్ ఆఫీస్ ఉండేది. ఉర్దూలో ఇమ్రోజ్ అంటే ఈ రోజు. పాలక వర్గాల దౌర్జన్యాలను, దోపిడీని చీల్చి చెండాడాడు. 'ఇమ్రోజ్' దిన పత్రిక తొలి సంచిక 1947 నవంబరు 17 వ తేదీన వెలువ డింది. నిజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియన్ లో విలీనం చేయాల్సిందేనని ఖరాఖండిగా చెబుతూ సంపాదకీయాలు రాశాడు. విశాల దేశ ప్రయోజనాల దృష్ట్యా విలీనం తప్పనిసరి అని పేర్కొన్నాడు. పదునైన విమర్శనాస్త్రాలు సంధించాడు.

ఎక్కడ ఏ మూలన నిజాం ఏలుబడిలో ఆగడాలు చెలరేగుతున్నా, ఎక్కడ ఆర్మీ క్యాంప్స్ ఉన్నా వాటి గురించి నిర్భయంగా రాసేవాడు. హైదరాబాద్ ఇండియాలో విలీనం కావాల్సిందేనని తన రాతలతో స్పష్టం చేసేవాడు. నిజాంకు వ్యతిరేకంగా ఉన్న ముస్లిం విద్యావంతుల అభిప్రాయాలను ప్రచురించే వాడు. నిజాం మొండి తనానికి, రజాకార్ల ఉన్మాదానికి ఎక్కువ బలవుతోంది పేద ముస్లిం కుటుంబాలు, యువకులేనని ఎన్నో సార్లు ఆవేదన చెందాడు. రచనల ద్వారా బహిర్గతం చేశాడు.



కమ్యూనిస్టులు, ఆర్యసమాజ్ వారు, విద్యార్థులు, యూత్ లీగ్ ఎవరు పోరాటాలు చేసినా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వార్తలన్నీ ప్రముఖంగా ప్రచురించాడు. హైదరాబాద్ ఇండియాలో విలీనం కావడమనేది షోయబుల్లా ఖాన్ కల. లక్ష్యం. దాని కోసం ఆత్మార్పణ కైనా సిద్ధ పడ్డాడు. నడి రోడ్డు మీద ప్రాణాలను బలి పెట్టాడు. రజాకార్ల నాయకుడు ఖాసీం రజ్వీ 1948 ఆగష్టు 19 సభలో షోయబ్ చేతులు నరికి వేస్తామని బహిరంగం గానే హెచ్చరించాడు.

1948 ఆగష్టు 21న.. కాచిగూడ లోని రైల్వే స్టేషన్ రోడ్ లో ఇమ్రోజ్ ఆఫీసులో పని పూర్తి చేసుకుని అర్ధ రాత్రి బావమరిది ఇస్మాయిల్ ఖాన్ తో కలిసి ఇంటికి బయలు దేరిన షోయబుల్లాను ఒక్కసారిగా పదిమంది దుండగులు చుట్టుముట్టి ఆయన వార్తలు రాసే కుడి అర చేతిని ముష్కరులు నిర్దాక్షిణ్యంగా నరికి వేశారు. అడ్డుకో బోయిన ఇస్మాయిల్ నూ తీవ్రంగా గాయ పరిచి గానీ వదల్లేదు. నెత్తిటి మడుగులో కొట్టుమిట్టాడిన షోయబుల్లాను ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా 1948 ఆగస్టు 22 న తెల్లవారు జామున షోయబ్ తుది శ్వాస విడిచాడు. నిజాం సర్కార్ షోయబ్ అంతిమ యాత్రను నిషేధించింది. అంతిమ యాత్ర పోలీసు బందూకుల మధ్య జరిగింది. గోషామహల్ మాలకుంట శ్మశాన వాటికలో ఆయన ఖననం జరిగింది.

-రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

జమ్మికుంటలో నభా నటేష్ సందడి!





- **గరుడ వస్త్ర సిల్క్‌ను ప్రారంభించిన టాలీవుడ్ హీరోయిన్**
- **వ్యాపార రంగంలో దినదినాభివృద్ధి చెందుతున్న జమ్మికుంట**
- **ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూరి వెంకట్**

జమ్మికుంట, అక్టోబర్ 16 (సింగిడి): కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో టాలీవుడ్ హీరోయిన్ నభా నటేష్ సందడి చేశారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన గరుడ వస్త్ర సిల్క్ షోరూమ్‌ను శుక్రవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూరి వెంకట్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నభా నటేష్ రాకతో షోరూమ్ ప్రాంగణం అభిమానుల సందడితో కళకళలాడింది. తమ అభిమాన నటితో సెల్ఫీలు దిగేందుకు యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

వ్యాపార రంగంలో దూసుకెళ్తున్న జమ్మికుంట

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లాలో ప్రముఖ వ్యాపార కేంద్రంగా ఉన్న జమ్మికుంట పట్టణం రోజురోజుకూ అభివృద్ధి చెందుతూ వ్యాపార రంగంలో ముందుకు సాగుతోందన్నారు. పట్టణంలో ఆధునిక హంగులతో నూతన వస్త్ర షోరూమ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. వ్యాపారంలో ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని, వినియోగదారులకు నాణ్యమైన వస్త్రాలను అందిస్తూ నమ్మకంతో వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కొత్త వ్యాపార సంస్థల ఏర్పాటుతో స్థానిక యువతకు, మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. గరుడ వస్త్ర సిల్క్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

నాణ్యమైన వస్త్రాలే లక్ష్యం

గరుడ వస్త్ర సిల్క్ నిర్వాహకులు మాట్లాడుతూ.. ఆధునిక ఫ్యాషన్ ట్రెండ్లకు అనుగుణంగా సరికొత్త డిజైన్లు, విభిన్న కలెక్షన్లతో అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వస్త్రాలను అందించడమే తమ లక్ష్యమని వెల్లడించారు.



ముఖానికి పసుపు తేనె పెరుగు చాలట!

సెలబ్రిటీలు బ్యూటీ కోసం ఏం చేస్తారో తెలుసుకోవాలనే ఆసక్తి చాలామందికి ఉంటుంది. ఖరీదైన ఫేషియల్స్, విదేశీ బ్రాండ్ల స్కిన్‌కేర్ ప్రొడక్ట్స్ వాడుతారని అనుకుంటాం. కానీ నటి అనన్య పాండే చెప్పిన స్కిన్‌కేర్ సీక్రెట్ మాత్రం ఇంట్రెస్టింగ్‌గా ఉంది. మన ఇంట్లో సులభంగా దొరికే పసుపు, తేనె, పెరుగు మాత్రమే ఉన్నాయి. ఈ మూడు పదార్థాలను కలిపి ముఖానికి ఉపయోగిస్తారట. ఆ ఫేస్ ఫ్యాక్ ఏమిటో, దాని వల్ల కలిగే ప్రయోజనాలు ఏంటో ఈ స్టోరీలో చూద్దాం.మన వంటింట్లోనే కనిపించే పసుపు, తేనె, పెరుగుతో ఆమె ఫేస్ మాస్క్ వేసుకుంటారట. ఈ మూడు పదార్థాలు కలిపి ముఖానికి రాసుకోవడం వింటే.. నిజంగానే ఇవి చర్మానికి ఉపయోగపడతాయా? అనే డౌట్ రావడం సహజమే.అయితే పసుపులో ఉండే కొన్ని సమ్మేళనాలు



చర్మంలోని వాపు, ఎర్రదనాన్ని తగ్గించడానికి సహాయపడతాయి. తేనె చర్మానికి తేమను అందిస్తుంది. పెరుగులో ఉండే లాక్టిక్ యాసిడ్ చర్మంపై పేరుకున్న మృతకణాలను మృదువుగా తొలగిస్తుంది.
ఈ ప్రత్యేకమైన ఫేస్ మాస్క్ తయారు చేయడానికి ఒక టీస్పూన్ పసుపు, ఒక టీస్పూన్ తేనె, ఒక టేబుల్ స్పూన్ పెరుగు కావాలి. పసుపులో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు చర్మంపై ఉండే మచ్చలను తగ్గించి, సహజమైన కాంతిని ఇస్తాయని ×జీఎ అధ్యయనం పేర్కొంది. తేనె చర్మానికి అవసరమైన తేమను అందించి, చర్మాన్ని మృదువుగా ఉంచుతుంది. ఇక పెరుగులో ఉండే లాక్టిక్ యాసిడ్ చర్మంపై ఉన్న మృతకణాలను తొలగించి, రంధ్రాలను శుభ్రపరుస్తుంది. ఈ మూడు పదార్థాలు కలసి చర్మానికి అవసరమైన పోషణను అందిస్తాయి.

స్టాక్ మార్కెట్

గ్రే మార్కెట్లో జియో ఐపీఓ జోరు

తగ్గిన క్రూడాయిల్ ధరలు.. జియో ఐపీఓ తెచ్చిన జోష్‌తో ఇన్వెస్టర్లకు పండగే..



భారత స్టాక్ మార్కెట్ సూచీలు బలంగా కోలుకుంటున్నాయి. కిందటి రోజు పడిపోయినా ఇప్పుడు అక్టోబర్ 15న సెన్సెక్స్ ఏకంగా 1300 పాయింట్లకుపైగా ఎగబాకింది. ఐటీ స్టాక్స్‌కు మంచి కొనుగోళ్ల మద్దతు సహా రూపాయి బలపడటం, క్రూడ్ ధరలు తగ్గడం, జియో ఐపీఓ ప్రకటన వంటివి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. దీంతో ఇన్వెస్టర్లకు మంచి లాభాలు వస్తున్నాయి. మార్కెట్ ర్యాలీకి పూర్తి కారణాల గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం.

స్టాక్ మార్కెట్ అక్టోబర్ 16

స్టాక్ మార్కెట్లు విపరీతమైన రిస్క్‌తో కూడుకొని ఉంటాయన్నసంగతి తెలిసిందే. ఎప్పుడు సూచీలు పెరుగుతాయో, ఎప్పుడు పడిపోతాయో చెప్పలేని పరిస్థితి. ఇటీవలి కాలంలో సూచీలు తీవ్ర ఒడుదొడుకుల్లో ట్రేడయిన సంగతి తెలిసిందే. ముందుగా పశ్చిమాసియా ఉద్రిక్తతలు, యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లు పెంచడం, క్రూడాయిల్ ధరలు పెరగడం, ద్రవ్యోల్బణం పెరగడం, యూఎస్ బాండ్ ఈల్డ్స్ పుంజుకోవడం, రూపాయి పతనం అవడం ఇలా ఇవన్నీ స్టాక్ మార్కెట్లను భారీగా పడిపోయేలా చేశాయి. దీంతో కనిష్ఠ స్థాయిలకు పడిపోయాయి. ఇప్పుడు ఆ కనిష్ఠ స్థాయిల నుంచి ఈ వారంలో కోలుకుంటున్నాయి. మంగళ వారం భారీగా పెరిగి బుధవారం పడిపో యిన సూచీలు, మళ్లీ గురువారం సెషన్‌లో దూసుకెళ్లాయి.ప్రస్తుతం అక్టోబర్ 15న వార్త రాసే సమయంలో మధ్యాహ్నం 12.30 గంటలకు సెన్సెక్స్ ఏకంగా 1300 పాయింట్లకుపైగా పెరిగి 74100 మార్కు ను దాటింది. నిఫ్టీ 370 పాయింట్లకుపైగా ఎగబాకి 23 వేలకు చేరువైంది. ఇక్కడ పలు హెవీ వెయిట్ స్టాక్స్ సహా ఐటీ స్టాక్స్‌లో భారీగా కొనుగోళ్లు జరుగుతుండటం ప్రధాన కారణంగా తెలుస్తోంది. సెన్సెక్స్ 30 ప్యాక్ ఇండెక్స్‌లో చూస్తే అత్యధికంగా టెక్ మహీంద్రా స్టాక్ దాదాపు 4 శాతం పరకు పెరిగి టాప్ గెయినర్‌గా ఉంది. ఎయిర్‌టెల్ కూడా 3.50 శాతానికిపైగా పెరిగింది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, రిలయన్స్ ఇండ స్ట్రీస్, టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్ కూడా 3 శాతానికిపైగా ఎగబాకాయి. ఇతర హెవీ వెయిట్ స్టాక్స్‌లోనూ కొనుగోళ్ల మద్దతు కనిపిస్తోంది. ట్రెంట్, హిందుస్థాన్ యూని లివర్, బీఈఎల్ స్వల్ప నష్టాల్లో ఉన్నాయి.

స్టాక్ మార్కెట్ లాభాలకు కారణాలు

స్టాక్ మార్కెట్లు ఇవాళ పుంజుకోవడానికి చాలా కారణాలే ఉన్నాయి. అంతర్జాతీ యంగా సానుకూల సంకేతాలు, క్రూడాయి ల్ ధరలు తగ్గడం, ఐటీ షేర్లలో భారీగా కొనుగోళ్లు, రూపాయి బలపడటం, జియో ఐపీఓ ప్రకటన వంటివి మార్కెట్ సెంటి మెంట్‌ను బలపరిచాయి.

1. జియో ఐపీఓ ఎఫెక్ట్

రిలయన్స్ ఇండస్ట్రీస్ తన డిజిటల్ విభాగం జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ వివరాల్ని వెల్లడించింది. ప్రైస్ బ్యాండ్‌ను రూ. 1065-1119 గా ఖరారు చేయగా, అక్టోబర్ 21న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది. సుమారు రూ. 30 వేల కోట్లకు పైగా నిధుల సమీకరణతో దేశంలోనే అతిపెద్ద ఐపీఓగా నిలవనుంది. ఈ ఐఓ ఓతో రిలయన్స్ వాల్యూ అన్‌లాక్ అవుతుం దన్న కారణంతో రిలయన్స్ షేర్లు కూడా 3 శాతానికిపైగా పెరిగాయి. సెన్సెక్స్, నిఫ్టీలో రిలయన్స్ వెయిటేజీ ఎక్కువగానే ఉండగా లాభాలకు ఇది కారణమైంది. ఇంకా జియో ఐపీఓ మార్కెట్లో సానుకూల పరిణామాలను కూడా తీసుకొచ్చింది. దీంతో కొనుగోళ్లు భారీగా జరుగుతున్నాయి.

-20 శాతం దాటిన +MP.. ఇన్వెస్టర్లు తెలుసుకోవాల్సిన విషయాలివే

జియో ప్లాట్‌ఫామ్స్ రూ. 30200 కోట్ల ఐపీఓకు సన్నాహాలు వేగంగా జరుగుతున్నాయి. అక్టోబర్ 21న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది. ఇక గ్రే మార్కెట్లో ప్రస్తుతం రూ. 225 ప్రీమియం కనిపిస్తోంది. గరిష్ఠ ఇష్యూ ధరపై దాదాపు 20 శాతానికిపైగా లిస్టింగ్ ప్రీమియాన్ని ఇది సూచిస్తోంది. ఈ సమయంలో జియో ఐపీఓ గురించి ఇన్వెస్టర్లు ఏమేం తెలుసుకోవాలో ఇప్పుడు చూద్దాం. దిగ్గజ పారిశ్రామిక వేత్త ముకేశ్ అంబానీ నేతృత్వంలోని జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ పై ఇన్వెస్టర్లలో రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. దేశంలోనే అతి పెద్ద పబ్లిక్ ఇష్యూగా ఇది నిలవనుంది. సుమారు 27 కోట్ల షేర్లను విక్రయించడం ద్వారా ఏకంగా రూ. 30,200 కోట్లవరకు నిధుల్ని సమీకరించాలని ప్లాన్ చేస్తోంది. ఇప్పటివరకు దేశంలో అతి పెద్ద ఐపీఓగా హ్యుందాయ్ మోటార్ ఇండియా ఉండగా, దానిని జియో అధిగమించనుంది. ఈ ఐపీఓ ఇష్యూ ప్రైస్ బ్యాండ్ రూ. 1065-1119 గా ఉంది. అక్టోబర్ 21న ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై, అక్టోబర్ 23న ముగియనుంది. అక్టోబర్ 28న స్టాక్ ఎక్స్చేంజీల్లో లిస్టింగ్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఇప్పటికే సబ్‌స్క్రిప్షన్‌కు రాకమునుపే గ్రే మార్కెట్లో జియో ఐపీఓ జోరు చూ యిస్తోంది. మంచి ప్రీమియంతో దూసుకెళ్తోంది. ప్రస్తుతం అక్టోబర్ 16 సెషన్‌లో గ్రే మార్కెట్ ప్రీమియం జియో ఐపీఓకు ఒక్కో



ఈక్విటీ షేరుపై రూ. 225 గా చూయిస్తోంది. ఇది ఇష్యూ ప్రైస్ బ్యాండ్ గరిష్ఠ ధర రూ. 1119 తో చూస్తే దాదాపు 20 శాతం కంటే ఎక్కువగానే ఉంది. ఈ లెక్కన అంచనా చూస్తే దాదాపు రూ. 1340 పైనే లిస్టింగ్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. గ్రే మార్కెట్ ప్రీమియం అనేది అంచనా మాత్రమే. కచ్చితంగా అంతే ధర దగ్గర లిస్టవుతుందనేదేమీ ఉండదు. దానికి అటుఇటుగా ఉండొచ్చు. లిస్టింగ్ సమయంలో కచ్చితంగా జీఎంపీ ఉన్నంతే లిస్టవుతుందన్న హామీ ఏం ఉండదు. మార్కెట్ పరిస్థితులు, ఇన్వెస్టర్ల డిమాండ్ ఆధారంగా ఫైనల్ లిస్టింగ్ ప్రైస్ మారొచ్చు. ఇక జియో ఐపీఓపై పలు బ్రోకరేజీలు కూడా తమ అభిప్రాయాల్ని వ్యక్తం చేస్తున్నాయి. జుఎన్ఫిఎ గ్లోబల్ ఈ జియో ఐపీఓకు సబ్‌స్క్రైబ్ రేటింగ్ ఇచ్చింది. టెలికాం రంగంలో ప్రస్తుతం ఆధిపత్యం చెలాయిస్తుం డటం, ధరల్ని పెంచుకునే సామర్థ్యం, డిజిటల్ సేవల్లో వేగంగా విస్తరణ అవకాశాలు దీనికి ప్రధాన కారణాలుగా పేర్కొంది. రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ ద్వారా జియో దేశంలో అతి పెద్ద టెలికాం నెట్‌వర్క్ వ్యవస్థను కలిగి ఉంది. 2026 జూన్ నాటికి కంపెనీకి సుమారు 53 కోట్లకుపైగా కస్టమర్లు ఉన్నారు. వైర్‌లెస్ బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్లలో 50 శాతం వాటా, ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్‌లో 42.6 శాతం వాటా ఉన్నట్లు బ్రోకరేజీ తెలిపింది. భారత్‌లో వైర్‌లెస్ డేటా ట్రాఫిక్‌లో సుమారు 60 శాతం జియో నెట్‌వర్క్ ద్వారానే సాగుతుంది. ఇంకా చైనా వెలుపల అతిపెద్ద 5+ కస్టమర్ బేస్ ఉన్న సంస్థల్లో జియో ముందుందని జుఎన్ఫిఎ పేర్కొంది.జియో భవిష్యత్తు వృద్ధి కేవలం మొబైల్ కనెక్షన్లపైనే ఆధారపడదని వఎన్ఫిఎ అంచనా వేసింది. 5+ వినియోగం పెరగడం, 2+ కస్టమర్లు 4+, 5+ సేవలకు మారడం కంపెనీకి అదనపు అవకాశాల్ని అందిస్తుందని పేర్కొంది. అందుకే జియో ఐపీఓను సబ్‌స్క్రైబ్ చేసుకోవచ్చని సిఫార్సు చేస్తోంది. ఐపీఓ ప్రైస్ బ్యాండ్ గరిష్ఠ ధర వద్ద కంపెనీ మార్కెట్ విలువ రూ. 10 లక్షల కోట్ల కంటే ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ విలువలో జియో మార్కెట్ ఆధిపత్యం, లాభాల వృద్ధి, టెక్నాలజీ సామర్థ్యాలు, భవిష్యత్తులో డిజిటల్ సేవల ద్వారా ఆదాయాన్ని పెంచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయని బ్రోకరేజీలు అభిప్రాయపడుతున్నాయి.

జియో ఐపీఓలో రిస్క్ ఉందా?

పలు బ్రోకరేజీలు సానుకూల అంచనాలు వ్యక్తం చేసినప్పటికీ, కొన్ని రిస్కుల్ని కూడా గుర్తించాయి. ఇక్కడ స్పెక్ట్రమ్ కొనుగోలు, నిర్వహణ ఖర్చులు ఎక్కువగా ఉండొచ్చు.పోటీ పెరిగితే వృద్ధిపై ఒత్తిడి పడొచ్చు. కస్టమర్లు ఇతర నెట్‌వర్క్‌లకు మారే అవకాశం ఉంటుంది.రిలయన్స్ గ్రూప్ సంస్థలపై అతిగా ఆధారపడటం, మౌలిక సదుపాయాల సరఫరాదారులపై అధికంగా ఆధారపడటం రిస్కులుగా మారొచ్చు.కంపెనీకి భవిష్యత్తులో భారీగా మూలధన వ్యయం అవసరం అవుతుంది.టెలికాం నియంత్రణ నిబంధనలు, స్పెక్ట్రమ్ లైసెన్సులపై ఆధారపడటం కూడా కీలక అంశాలుగా ఉన్నాయి. అందుకే ఇవన్నీ గుర్తుంచుకోవాలి. కేవలం జీఎంపీ ఎక్కువగా ఉందని మాత్రమే చూసి ఐపీఓలో పెట్టుబడి పెట్టడం సరైన నిర్ణయం కాదని నిపుణులు సూచిస్తున్నారు.

బంగారం, వెండి దిగుమతులపై ట్యాక్స్

దేశంలోకి బంగారం, వెండి, ప్లాటినం దిగుమతులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకులు, నానినేటెడ్ ఏజెన్సీలకు బంగారం, వెండి, ప్లాటినం దిగుమతులపై ఇన్నాళ్లు ఇస్తున్న జీఎస్టీ మినహాయింపును రద్దు చేసింది. ఆయా దిగుమతులపై 3 శాతం ఐజీఎస్టీ ట్యాక్స్ వర్తిస్తుందని స్పష్టం చేసింది. అయితే, ఈరోజు దేశీయ మార్కెట్లో బంగారం ధరలు భారీగా పెరిగాయి. జీఎస్టీ మినహాయింపు రద్దు చేయడం తోనే బంగారం ధరలు పెరిగాయా? ఏమైనా లింక్ ఉందా? తెలుసుకుందాం. బ్యాంకులు, నామినేటెడ్ ఏజెన్సీలు దిగుమతి చేసుకునే బంగారం, వెండి, ప్లాటినంపైనా 3 శాతం ఐజీఎస్టీ వర్తిస్తుందని కేంద్ర రెవెన్యూ సెక్రెటరీ అరవింద్ శ్రీవాస్తవ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2026-27 ప్రారంభం (ఏప్రిల్ 1, 2026) నుంచే ఈ జీఎస్టీ వర్తింపు అమలులోకి వచ్చినట్లు స్పష్టం చేశారు. 2026, మార్చి 31 తర్వాత దిగుమతి అయిన బంగారం, వెండి, ప్లాటినంలపై ఐజీఎస్టీ మినహాయింపు వర్తించని బ్యాంకులు, ఏజెన్సీల జాబితాను జీఎస్టీ కౌన్సిల్‌కు ప్రభుత్వం గురువారం అందజేసినట్లు తెలిపారు. అయితే, బంగారం దిగుమతులపై పన్ను



మినహాయింపులు కట్ చేయడానికి, ఈరోజు దేశీయంగా బంగారం ధరలు పెరిగేందుకు ఏమైనా లింక్ ఉందా? ఈరోజు గోల్డ్ రేట్లు ఎలా ఉన్నాయి?"ఒక మార్గానికి బదులుగా మరొక మార్గానికి ప్రాధాన్యత ఇవ్వడానికి పన్ను ఒక కారణంగా మారకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయాన్ని ఏప్రిల్ 1 నుంచి అమలు చేస్తున్నాం. గురువారం జరిగిన సమావేశంలో ఈ విషయాన్ని జీఎస్టీ కౌన్సిల్‌కు తెలియజేశాం. ప్రభుత్వం మినహా యింపులు కల్పించే గడువు పొడిగించకపోవడంతో, కొంతమంది దిగుమతిదారులు గత కొన్ని నెలలుగా ఇప్పటికే పన్ను చెల్లిస్తున్నారు. విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ జనరల్ ఏప్రిల్ 17న అధీకృత దిగుమతి దారుల కొత్త జాబితాను జారీ చేసింది. కానీ పన్ను మినహాయింపు నోటిఫికేషన్‌ను నవీకరించలేదు." అని అరవింది శ్రీవాస్తవ తెలిపారు. దేశంలో బంగారం, వెండి, ప్లాటినం దిగుమతులను నియంత్రించేందుకు, అక్రమ మార్గాలను అరికట్టేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలు స్తోంది. నోటిఫైడ్ బ్యాంకులు బంగారం, వెండి, ప్లాటి నం వంటి విలువైన లోహాలను దిగుమతి చేసుకునేట ప్పుడు ఇన్నాళ్లు పన్ను మినహాయింపులు ఇవ్వగా ఇప్పుడు ఆ ప్రయోజనాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. దిగుమతి చేసుకున్న విలువైన లోహాలపై బ్యాంకులు పొందుతున్న మినహాయింపు విధానాలను కొందరు దుర్వినియోగం చేస్తున్నట్లు, దీని వల్ల ప్రభుత్వ ఖాజానాకు పన్ను ఆదాయం గండిపడనతున్నట్లు ఆర్థిక శాఖ గుర్తించింది. బ్యాంకుల ద్వారా సులభ మైన పన్ను ప్రయోజనాలతో దిగుమతి అయిన బంగారాన్ని తిరిగి దేశీయ మార్కెట్లలో లేదా అనధికార రౌండ్ ట్రిప్పింగ్ వ్యాపారాల్లో ఉపయో గిస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. దీనికి ముగింపు పలకడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం.

ఎల్‌నినో ఎఫెక్ట్..

అంతర్జాతీయ మార్కెట్లో భారత బియ్యానికి ఫుల్ డిమాండ్



ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈసారి సాగు అంతలా సాగలేదు. దీంతో పంట పండించిన వారు పండగ చేసుకుంటున్నారు. విపరీతమైన డిమాండ్ నేపథ్యంలో ధరలు భారీగా పెరిగాయి. భారత బియ్యం ఎగుమతి ధరలు కూడా ఏడాదికిపైగా గరిష్ఠాలకు చేరుకున్నాయి. రూపాయి బలపడటం, దేశీయంగా వరి సరఫరా తగ్గడం, కొన్ని రాష్ట్రాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం దీనికి కారణాలుగా ఉన్నాయి. మరోవైపు వియత్నాం, థాయిలాండ్‌లోనూ బియ్యం ధరలు పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లో భారత బియ్యం ఎగుమతి ధరలు పెరుగుతు న్నాయి. రూపాయి ఇటీవల వరుసగా పెరగడం, దేశీయ మార్కెట్లో మరోవైపు వరి సరఫరా తగ్గడం వంటి కారణాలతో భారత బియ్యం ధరలు ఏడాదికిపైగా గరిష్ఠ స్థాయిలకు చేరాయి. ఇదే సమయంలో థాయిలాండ్, వియత్నాంలో కూడా ధరలు పెరగడంతో ఆసియా బియ్యం మార్కెట్లో పైపైకి వెళ్లే ధోరణి కనిపిస్తోంది. ఈ క్రమంలో డిమాండ్ విపరీతంగా ఉన్న నేపథ్యంలో పంట పండించిన రైతులు రారాజులుగా మారారని చెప్

ఎంఎస్ డీజే ఎలక్ట్రానిక్స్ సెంటర్ ప్రారంభం



దుగ్గొండి ,(సింగిడి): నర్సంపేట పట్టణంలోని అరవింద టాకీస్ ఎదురుగా ఏర్పాటు చేసిన ఎంఎస్ డీజే ఎలక్ట్రానిక్స్ సేల్స్ అండ్ సర్వీస్ సెంటర్‌ను నల్లబెల్లి బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు డాక్టర్ బానోతు సారంగపాణి ప్రారంభించారు. మేడపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కన్నెబోయిన యాకయ్య ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి కోటిలింగాచారి, సర్పంచులు అరైం సాంబయ్య, జాటోత్ రవి చిన్న, పల్నాటి మూర్తి, కేలోతు రాజ్‌కుమార్, పార్టీ నాయకులు గాధం రాజ్‌కుమార్, కన్నెబోయిన రాజేష్ పాల్గొన్నారు.



యువత గంజాయి డ్రగ్స్‌కు బానిసలు కావద్దు

గంజాయి అమ్మే వ్యక్తులను వదిలి పెట్టం
గ్రామాల్లో నిఘా పెట్టండి మత్తును తరిమికొడదాం
యువత చెడు మార్గం కాకుండా మంచి మార్గం ఎంచుకోండి
నీటిని, చెట్లను కాపాడుకుందాం ఏసీపీ ప్రశాంత్ రెడ్డి





కమలాపూర్, (సింగిడి): ఈ తరాన్ని గనక మనం కాపాడుకోకపోతే వచ్చే తరం మనకు ఉండదని కాజిపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి అన్నారు. గురువారం కమలాపూర్ సి ఐ పి నవీన్ అధ్యక్షతన మంచి చెడు అనే రెండు మార్గాలపై యువతకు అవగాహన కోసం మామిడి తోటలో మార్గ నిర్దేశం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ యువకులు గంజాయి డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు బానిసలు కావద్దన్నారు. యువత ఒక్కసారి ఆలోచించండని అన్నారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరు నా బాధ్యత అనుకోని మన ఊరిని, మన వాడను, మండలం మొత్తాన్ని కాపాడుకుందాం అని పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం చల్లగా ఉండాలని, మనం పుట్టింది కన్న వాళ్లను ఆగం చేయడానికి కాదని ఒక్కసారి ఆలోచించండని అన్నారు. కమలాపూర్ ఎవరన్నా గంజాయి పొట్లాలు అమ్మినా, గంజాయి పొట్లాల కోసం మోటార్ సైకిల్ మీద వేరే రాష్ట్రాల పోతారు,వాటిని తెచ్చి అమ్ముకుంటే పైసలు వస్తాయి ఇదొక బిజినెస్ అనుకుంటున్నారు. అలాంటి వాళ్లను వదిలి పెట్టం అని అన్నారు. ప్రభుత్వ జగలల్ల, రాత్రిపూట ఖాళీ ప్లాట్ల ఊళ్ళల్లో ఖాళీగా ఉన్న ప్రదేశాలు ఎన్నుకుంటారు. వాటి మీద నిగా పెట్టండి ఊళ్లో ఎవడు గంజాయి అమ్మడానికి సాహసం చేయకుండా చూడాలన్నారు. ఈ దసరాకు జమ్మి చెట్టుకు పూజలు చేసి గంజాయి ఆకులకు బదులు జమ్మి ఆకు పొట్లాలను పంపిణీ చేసి ఆ కుటుంబం పచ్చగా, సంతోషంగా గొప్పగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుందాం. అవమానకరమైన పని కాకుండా నలుగురు శభాష్ వెరీ గుడ్ అని గొప్పగా అనే విదంగా బ్రతకండిఅని అన్నారు. అందరూ మెడికల్ ఇన్సూరెన్స్ చేయించుకోండి మెడికల్ ఇన్సూరెన్స్ చాలా చాలా కీలకం అని అన్నారు. నాకు డిపార్ట్మెంట్ ఇన్సూరెన్స్ ఉన్న సరిపోదు అని భయంతోనే మల్ల చేయించినఅని తెలిపారు. ఆరోగ్యం బాగలేక పోతే ఉన్న మొత్తం అమ్ముకుంటారు. యువత గుర్తుంచుకోండి నీ వయస్సునీ జీవితానికి పెట్టుబడి అన్నారు. ఈ ఎండలు ఎప్పుడు చూడలేదు, రాబోయే రోజుల్లో నీరు దొరకడం కష్టం అవుతుంది ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంత నిర్మించుకోవాలన్నారు. చెట్లను కాపాడుకోవలన్నారు వాటి వల్లనే మనము జీవిస్తున్నామని తెలిపారు. వయసును సరిగ్గా సద్వినియోగం చేసుకుంటే జీవితం అంతా మంచిగుంటదన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా ఉపాది కోసం మంచి పనులను చేయాలని తెలిపారు. కమలాపూర్ ప్రాంతం అంటే మంచి పేరు ఉండాలే అని అన్నారు. అలా పేరు రావాలంటే యువత మంచి మార్గాలను ఎంచుకోవలన్నారు. గంజాయి డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు అలవాటై చేతిలో డబ్బులు లేనప్పుడు దొంగతనాలు చేయడానికి కూడా వెనుకడారని తెలిపారు. ప్రతి ఒక్కరూ కష్టపడి చదుకోవలన్నారు. చదువుంటే అన్ని మన దగ్గరకు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు మధు, దిలీప్, పోలీస్ సిబ్బంది, సర్పంచ్ లు పబ్బు సతీష్, నకిర్త రాజు, పలువురు గ్రామాలకు చెందిన యువకులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్ హైస్కూల్ ప్రీమియర్ లీగ్ విజేతగా తాజీమ్ 11 జట్టు

విజేతకు బహుమతి అందజేసిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



కాగజ్ నగర్(సింగిడి): బెజ్జూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల మైదానంలో నిర్వ హించిన బెజ్జూర్ హైస్కూల్ ప్రీమియర్ లీగ్ సీజన్-2 క్రికెట్ టోర్నమెంట్ అట్టహాసంగా ముగి సింది ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్ పోరులో తాజీమ్ 11 జట్టు విజయం సాధించి ఛాంపి యన్‌గా నిలవగా బెజ్జూర్ లెజెండ్స్ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ముఖ్య అతిథిగా హాజరై, విజేత తాజీమ్ 11 జట్టుకు రూ. 14,000 నగదు బహుమతి రన్నరప్ బెజ్జూర్ లెజెండ్స్ జట్టుకు రూ. 7,000 నగదు బహుమతిని అందజేసి క్రీడాకారులను అభినందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతో దోహదపడతాయని కొనియాడారుఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు బాషారత్ ఖాన్, అమీర్ ఒద్దీన్, కొండ్ర నరేందర్ గౌడ్, తెలంగాణ జావిద్, జాకీర్ హుస్సేన్, గుమ్ముల శ్రీనివాస్, చిప్పకుర్తి దేవాజి, తులసిరామ్, రంగు సురేష్ గౌడ్, టోర్నమెంట్ నిర్వాహకుడు కావుడే సురేష్, క్రీడాకారులు మరియు స్థానిక యువత పాల్గొన్నారు

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారుల దాడులు

15 లీటర్ల గుడుంబా స్వాధీనం..
650 లీటర్ల పులియబెట్టిన పానకం ధ్వంసం



అసిస్టెంట్ కమిషనర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు కాటారం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఈ దాడులు నిర్వహించారు.



దాడుల్లో పాల్గొన్న అధికారులు

కాటారం, (సింగిడి): అక్రమ గుడుంబా తయారీపై ఎక్సైజ్ అధికారులు దాడులు ముమ్మరం చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని గంగారం , గట్లకుంట తండాల్లో గురువారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో నాలుగు కేసులు నమోదు చేసి, ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకోవడంతోపాటు, తయారీకి సిద్ధంగా ఉంచిన 650 లీటర్ల పులియబెట్టిన పానకాన్ని ధ్వంసం చేశారు.

ఉన్నతాధికారుల ఆదేశాలతో చర్యలు

వరంగల్ డిప్యూటీ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్, వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ భారతి, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ రాకేష్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పై సాయికుమార్, స్టేషన్ సిబ్బంది, కాటారం సీఐ కరుణశ్రీ, ఎస్పై సందీప్ కుమార్‌తోపాటు సంబంధిత సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు. అక్రమ గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

ప్రజలకు వైద్య సేవలకు
అంతరాయం కలగకుండా చర్యలు

హనుమకొండ జిల్లా వైద్య
ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య.



హన్మకొండ ,(సింగిడి): ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమ్మె ప్రజలకు అందించే వైద్య సేవలకు అంతరాయం కాకుండా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ అప్పయ్య అధికారులకు సూచించారు. హనుమకొండ జిల్లాలోని పెద్దమ్మగడ్డ, పోచమ్మకుంట, లష్కర్ సింగారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను గురువారం సందర్శించి, అక్కడ అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ప్రస్తుతం ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు సమ్మె నిర్వహిస్తున్న నేపథ్యంలో, ప్రజలకు వైద్య సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా గ్రామీణ ప్రాంత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి సిబ్బందిని ఈ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు డిప్యూటేషన్‌పై నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా ప్రజలకు అవసరమైన వైద్య సేవలు నిరంతరాయంగా అందుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ మూడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కలిపి 100 మందికి పైగా రోగులకు ఔట్ పేషెంట్ (ఓపీ) సేవలు అందించినట్లు తెలిపారు. అలాగే, కుక్క కాటు బాధితులకు కూడా అవసరమైన వైద్య సేవలు అందించి, చికిత్స అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ప్రజారోగ్య పరిరక్షణకు వైద్య ఆరోగ్య శాఖ ప్రాధాన్యత ఇస్తుందని, సమ్మె పరిస్థితుల్లోనూ సాధారణ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య తెలిపారు.

దసరా నాటికి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఓపీ సేవలు ప్రారంభించాలి

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.

హనుమకొండ,(సింగిడి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిఆదేశాల మేరకు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని దసరా నాటికి పూర్తిచేయాలని వరంగల్ నారాయణ రాజేందర్ రెడ్డి అధికారులకు సూచించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను జిల్లా ఇన్‌చార్జిమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యులువేం నరేందర్ రెడ్డితో కలిసి వరంగల్ పశ్చిమనియోజకవర్గ శాసనసభ్యులునాయిని రాజేందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయినిరాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిఆదేశాల మేరకు దసరా నాటికి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఓపీ సేవలుప్రారంభించేందుకు మొదటి దశ పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఈ నెల 20వ తేదీనుంచి రోజుకు 3,000 మంది రోగులకు ఓపీ సేవలు అందించనున్నట్లువెల్లడించారు. ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమేప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో శాసన మండలి సభ్యులుబస్వరాజు సారయ్య, శాసనసభ్యులు కేఆర్ నాగరాజు,రేవూరి ప్రకాష్ రెడ్డి,జిల్లా కలెక్టర్లు చాహత్ బాజ్ పాయ్, సత్య శారద, ఎంపీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నితిన్ హోమ్ ఫర్నిచర్స్ షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



హన్మకొండ, (సింగిడి): గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ కి చెందిన గొలుసు సంతోష్ మడికొండలో నూతనంగా ఏర్పాటు చేసిన నితిన్ హోమ్ ఫర్నిచర్స్ షాపును వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా షాపు నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించి, వినియోగదారులకు నాణ్యమైన ఫర్నిచర్‌ను అందిస్తూ మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గొలుసుల నితిన్, సచిన్,స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

లలిత మహా త్రిపుర సుందరిగా శ్రీ భద్రకాళి అమ్మవారు





హన్మకొండ, (సింగిడి): చారిత్రక శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్ర మహాట రీత్సవములు గురువారం ఐదవ రోజుకు చేరుకు న్నాయి. కార్యక్రమాలలో భాగంగా ఉదయం 4గంటలకు అర్చకులు నిత్యాహ్నికం నిర్వర్తించిన పిమ్మట అమ్మవారిని లలితా మహా త్రిపుర సుందరిగా అలంకరించడానికి అంగీకార ప్రార్ధన జరిపి సూచిన వచ్చిన వెంటనే అమ్మవారిని రాజరాజేశ్వరి (లలిత)గా అలంకరించి పూజారాధనలు జరిపారు. మంత్రదీక్ష తీసుకొని సాధకుడు మంత్రానుష్ఠానం చేస్తుండగా అమ్మవారు ఈ సాధకుడు ధనం కోసం అనుష్ఠానం చేస్తున్నాడేయో ఎందుకంటే ధనమూలమిదం జగత్ అని కదా అందుకోసం సాధకుడి అనుష్ఠానం వల్ల ప్రసన్నమైన అమ్మవారు సాధకుడికి అమితమైన ఐశ్వర్యాన్నిస్తుందనటానికి సంకేతంగా నిన్న అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు. ఐశ్వర్యం కోసమే సాధకుడి అనుష్ఠానం అంటే సాధన అక్కడికి అగిపోతుంది కానీ అమ్మ ఐశ్వర్యం, బీదరికం గత జన్మలో చేసుకున్న పాపపుణ్యాల ఫలితంగా వస్తుంది. ముక్తి అనేది నూరు కోట్ల జన్మల పుణ్యం ఉంటే గానీ దొరకదని వివేక చూడామణిలో శంకరాచార్యులవారు తెలిపారు. మరి ముక్తి అనే పదం మిథ్యయేనా! అన్న శంక కలుగుతుంది. అమ్మవారిని ముద్దుస్వామి దీక్షితులు తమ కృతులలో దయాతీతమోక్ష ప్రదచతురే అని కీర్తించారు. పంచదశీ, షోడశీ మంత్ర దీక్షలు తీసుకున్న వారికి మరుజన్మ వుండదు అని శాస్త్రం చెబుతోంది. కాబట్టి దానికి సంకేతంగా మంత్రాలకు అధిష్టాన దేవతయైన రాజరాజేశ్వరీ (లలిత)గా అలంకరించడమనేది నేపథ్యం. ఉదయం పల్లకీ సేవ సాయంకాలం శేషవాహన సేవ జరిపారు. పల్లకీ సేవలో అమ్మవారిని దర్శించడం వల్ల యోగసిద్ధి కలుగుతుందని ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి వేషు తెలిపారు. సాయంకాలం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా హరికథ, భక్తి సంగీతం, కర్ణాటక సంగీతం మరియు కూచిపూడి నృత్యాలు భక్తులను ఎంతగానో అలరించాయి.

అమ్మ కర్తల మండలి ప్రమాణ స్వీకారం

సాయంకాలం దేవాలయ ప్రాంగణంలో తెలంగాణా ప్రభుత్వముచే నూతనంగా ఏర్పాటు చేయబడిన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం చేయబడినది. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎం. ఎల్. ఏ నాయిని రాజేందర్ రెడ్డి సమక్షంలో ఈ. ఓ రామల సునీత దేవాలయ చైర్మన్ డా॥ బి. శివసుబ్రహ్మణ్యం ధర్మకర్తలుగా కమటం వేణుగోపాల్, కల్లూరి పవన కుమార్, కటకం రాములు, కారెంగుల సురేష్బాబు, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, చిదర అంజనీదేవి, మాడిశెట్టి సతీష్ పేరాల శ్రీనివాసరావు, రమేష్ చందర్ భంగ్, చింతలపణి వాసవి రెడ్డి, మోతుకూరి మయూరి ఎక్స్ అఫీషియో మెంబర్ పార్నంది నర్సింహమూర్తిలు ప్రమాణ స్వీకారం చేశారు.

టీచర్ కాలనీలో బతుకమ్మ వేడుకలు



తొర్రూరు,(సింగిడి): తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలోని టీచర్స్ కాలనీలో వరసిద్ధ వినాయక ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని రంగ రంగ వైభవంగా రంగురంగుల బతుకమ్మలతో పిల్లల కోలాటంతో బతుకమ్మ పాటలతో ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా వారు తెలంగాణ ఆడబిడ్డల బతుకమ్మ పండగ దేశంలోనే సాంప్రదాయ నీటిలో ప్రత్యేకమైన అన్నారు. తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రత్యేక ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు కుర్ర శ్రీనివాస్ గౌడ్,ప్రధాన కార్యదర్శి కోటగిరి కుమార్,ఉపాధ్యక్షులు దుస్సశ్రీను,బిక్షం రెడ్డి,కమిటీ ముఖ్య సలహాదారులు ఎనమినేని శ్రీనివాసరావు, దామోదర్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, చిదురాల యాకయ్య, నరేందర్ రెడ్డి,సంజీవరెడ్డి సారు వెంకటరెడ్డి సారు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ వాణిజ్య సెల్ జిల్లా అధ్యక్షుడిగా తాటిపల్లి రాజన్న

- నియామక పత్రాన్ని అందజేసిన ప్రణవ్..



జమ్మికుంట,(సింగిడి): కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ వాణిజ్య సెల్ అధ్యక్షుడిగా తాటిపల్లి రాజన్నను నియమిస్తూ కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నియామక పత్రాన్ని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆయనకు అందజేశారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ పార్టీ నమ్ముకున్న వారికి సముచిత స్థానం కల్పిస్తామని,జిల్లాలో ఉన్న వ్యాపార,వాణిజ్య సముదాయాలను సమన్వయం చేస్తూ,వారి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని రాజన్నను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యాపారస్థులకు,వాణిజ్య సముదాయాలకు అండగా ఉంటుందని,ఏ సమస్యలు ఉన్నా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం రాజన్న మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఇంతటి బాధ్యత అప్పగించిన మంత్రులకు,జిల్లా పార్టీ నాయకత్వానికి, హుజురాబాద్ ఇంచార్జి ప్రణవ్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాపార,వాణిజ్య సముదాయాల నాయకులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చాలో కొండ వెంకటేష్ కీలక బాధ్యతలు



మంచిర్యాల, (సింగిడి): భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొండ వెంకటేష్ నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, జిల్లా అధ్యక్షుడు నాగునూరి వెంకటేశ్వర్ గౌడ్ సూచన మేరకు ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కృష్ణ దేవరాయలు ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఎస్సీ మోర్చాకు సంబంధించిన కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తరించడం, ఎస్సీ వర్గాల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం వంటి అంశాలు కీలకంగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొండ వెంకటేష్ నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది. కొత్త బాధ్యతలతో పార్టీ కార్యక్రమాల నిర్వహణ, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, ప్రజా సమస్యలపై స్పందించడం వంటి అంశాల్లో ఆయన పాత్ర పోషించాల్సి ఉంటుంది. పార్టీ నాయకత్వం అప్పగించిన బాధ్యతలను నిర్వహిస్తూ ఎస్సీ మోర్చా కార్యకలాపాల విస్తరణకు కృషి చేయాల్సిన అవకాశం ఆయనకు లభించింది.

అమ్మవారిని దర్శించుకున్న దుద్దిల్ల శీను బాబు



మహాదేవపూర్ (సింగిడి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని అమ్మవారి మండపాల లోటీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శీను బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాల త్రిపుర సుందరి అవతారంలో గురువారం అమ్మవారిని దర్శించుకున్న ఆయన రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథా లయ చైర్మన్ కోట రాజబాపు, స్థానిక సర్పంచ్ హసీనాబాను, పిఏసిఎస్ చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్కం అశోక్ తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తులం బంగారం ఇవ్వలేకపోతే..
లక్ష 50 వేల రూపాయలైనా ఇవ్వండి?





కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు వరం

చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్:

నిర్మల్ ప్రతినిధి, భైంసా (సింగిడి): కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు పేదలకు వరమని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ అన్నారు. గురువారం భైంసా పట్టణంలోని బృందావన్ గార్డెన్స్ లో 121 మందికి భైంసా పట్టణం, మండలం లోని ఆయా గ్రామాల వారికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 69 మందికి కళ్యాణ లక్ష్మి, 52 మందికి షాదీ ముబారక్ చెక్కులను అందించారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటినుండి ఇప్పటివరకు ఆరు దఫాలుగా చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని, లబ్ధిదారులకు ఆలస్యం చేయకుండా త్వరిత గతిన అందిస్తున్నామన్నారు. దసరా పండుగ ఉన్న నేపథ్యంలో పండుగ కంటే ముందే ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రజల సౌకర్యార్థం ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కళ్యాణ్ లక్ష్మి షాది ముబారక్ ద్వారా లక్ష రూపాయలు అందిస్తున్నందుకు కృతజ్ఞతలు చెబుతూనే, ఎన్నికల్లో తులం బంగారం హామీ ఇచ్చారని, బంగారం ఇవ్వకున్నా ఈ పథకానికి లక్ష యాభై వేల రూపాయలకు పెంచాల్సిందిగా కోరారు. తులం బంగారం ఇవ్వలేకపోతున్నామని కేంద్ర ప్రభుత్వం వల్లే బంగారం ధరలు పెరిగాయని కాంగ్రెస్ నాయకుల మాటలు మాట్లాడడం అది అజ్ఞానమే అవుతుందన్నారు. డాలర్ విలువ ప్రకారం బంగారం ధర పెరుగుతుందన్నారు. గత పది సంవత్సరాల్లో ఎన్నడు లేని విధంగా పెద్ద మొత్తంలో రేషన్ కార్డులు ముఖ్యమంత్రి ఇచ్చిన మాట వాస్తవమేనని, కానీ అందులో ఒక్కొక్కరికి కేంద్ర ప్రభుత్వ వాటా ఐదు కిలోల బియ్యం అయితే, రాష్ట్ర ప్రభుత్వ వాటా ఒక కిలో బియ్యం అన్న విషయాన్ని గుర్తుచేయాలన్నారు. తనకు ప్రజలే ముఖ్యమని, ప్రజా శ్రేయస్సును కోరే వారిని స్వాగతిస్తామన్నారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు రెండున్నర వేలు ఇస్తానని కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానం చేసిందని, ఆ మాటను నెరవేర్చుకొని ఆడపడుచులకు డబ్బులను పంపిణీ చేయాల్సిందిగా సూచించారు. భైంసా పట్టణం మండలంలో మరో 244 మంది దరఖాస్తులు చేసుకున్నారని, 144 మందికి త్వరలోనే చెక్కులు ఇవ్వరునట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మోల్ల దత్తాత్రి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్,, భైంసా పట్టణ నాయకులు, కోతల్ గాన్ సర్పంచ్ సట్ల భూమేష్, బిజ్జూర్ సర్పంచ్ వెంకట్ రెడ్డి మండలంలోని పలువురు సర్పంచులు, కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు , పెద్ద మొత్తంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

డబ్బాగ్రామంలో కబడ్డీ పోటీలు ప్రారంభం





– క్రీడా స్ఫూర్తిని చాటుతున్న యువత

చింతలమానేపల్లి, (సింగిడి): మండలంలోని డబ్బా ఎక్స్‌రోడ్డు వద్ద డబ్బా యూత్ జైభవాని ఆధ్వర్యంలో, గ్రామ పెద్దల సహకారంతో కబడ్డీ టోర్నమెంట్‌ను ఘనంగా ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించడంతో పాటు యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయాలనే ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. టోర్నమెంట్ ప్రారంభోత్సవం సందర్భంగా క్రీడాకారులు, యువకులు, గ్రామస్థులతో ఆ ప్రాంతంలో సందడి నెలకొంది. టోర్నమెంట్‌ను డాక్టర్ అడప కేదారి (అసోసియేట్ ప్రొఫెసర్), డబ్బా గ్రామ సర్పంచ్ సంతోష్, ఉపసర్పంచ్ మౌనిక వరప్రసాద్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు చిలుకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అడప కేదారి మాట్లాడుతూ క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. విద్యతో పాటు క్రీడలకు కూడా యువత ప్రాధాన్యం ఇవ్వాలని, క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, ఐకమత్యం, పట్టుదల వంటి లక్షణాలను అలవర్చుతాయని పేర్కొన్నారు. కబడ్డీ వంటి గ్రామీణ క్రీడలు మన సంప్రదాయంలో ప్రత్యేక స్థానం కలిగి ఉన్నాయని, ఇలాంటి పోటీల ద్వారా యువతలో పోటీతత్వం, జట్టుగా పనిచేసే మనస్తత్వం పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం లభిస్తే వారు ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడలు, సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని అన్నారు. టోర్నమెంట్ ప్రారంభం కావడంతో క్రీడాకారుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. మైదానంలో క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ ప్రత్యర్థి జట్లకు గట్టి పోటీ ఇచ్చారు. క్రీడాకారుల ఆటతీరును వీక్షించేందుకు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. క్రీడాకారులను ఉత్సాహపరుస్తూ కేరింతలు కొట్టడంతో మైదానం సందడిగా మారింది. గ్రామ పెద్దల సహకారంతో డబ్బా యూత్ సభ్యులు కబడ్డీ పోటీల నిర్వహణకు ముందుకు రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి క్రీడా కార్యక్రమాలు గ్రామాల్లో యువత మధ్య స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు వివిధ గ్రామాల యువకుల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని క్రీడా పోటీలు నిర్వహించాలని గ్రామస్థులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆడపెల్లి ఉపసర్పంచ్ మహేష్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ యాదవ్, వార్డు సభ్యుడు శ్రీకాంత్, డబ్బా యూత్ సభ్యుడు కొంపరి అంజన్న, యువకులు, యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు

నిర్మల్ ప్రతినిధి, (సింగిడి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 189 మంది వయోవృద్ధులు స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి విజయలక్ష్మి ఈ సందర్భంగా మాట్లాడుతూ, వయోవృద్ధులు స్వయం సహాయక సంఘాలలో చేరడం వల్ల చేకూరే ఆర్థిక, సామాజిక ప్రయోజనాలపై ఈ సందర్భంగా వారికి సమగ్రమైన అవగాహన కల్పించారు. వయోవృద్ధులలో పొదుపు అలవాటును పెంపొందించడం, ఆర్థిక స్వావలంబన సాధించడం, సంఘాల ద్వారా పరస్పర సహకార ప్రాముఖ్యతను వివరించారు. వారి జీవనోపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లభించే రకరకాల ప్రయోజనాలను ఏ విధంగా వినియోగించుకోవాలో తెలియజేశారు. వయోవృద్ధులతో బతుకమ్మలను స్వయంగా తయారు చేయించి, వారితో బతుకమ్మ ఆటపాటలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు, సిబ్బంది, వయోవృద్ధులు, తదితరులు పాల్గొన్నారు.



నడుము నొప్పికి రోబోటిక్ చికిత్స

మంచిర్యాల, (సింగిడి): నడుము నొప్పి.. మూత్రం తగ్గిపోవడం.. కింది పొత్తికడుపులో ఇబ్బంది.. ఈ లక్షణాలను సాధారణ సమస్యలుగా భావించి నిర్లక్ష్యం చేస్తే మూత్ర వ్యవస్థపై ప్రభావం పడే ప్రమాదం ఉంది. ఓ 25 ఏళ్ల యువతి ఇలాంటి సమస్యలతో బాధపడగా, పరీక్షించిన వైద్యులు ఆమెకు కుడివైపు మూత్రనాళం చివరి భాగంలో సంకోచం (డిస్టల్ యూరెటరిక్ స్ట్రిక్చర్) ఉన్నట్లు గుర్తించారు. మలక్‌పేట యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రోబోటిక్ శస్త్రచికిత్స ద్వారా చికిత్స అందించి ఆమెను కోలుకునేలా చేశారు. యువతి కుడివైపు నడుము నొప్పి, మూత్ర విసర్జన తగ్గిపోవడం, కింది పొత్తికడుపులో నొప్పి, ఇతర మూత్ర సంబంధిత సమస్యలతో ఆసుపత్రిని సంప్రదించారు. వైద్య పరీక్షల్లో కుడివైపు మూత్రనాళం చివరి భాగం సంకుచితమైనట్లు, దాని పైభాగంలో మూత్రనాళం విస్తరించినట్లు గుర్తించారు. ఈ అడ్డంకి కారణంగా మూత్ర ప్రవాహానికి ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉండటంతో సమస్య తీవ్రత, సంకోచం ఉన్న ప్రదేశాన్ని పరిగణనలోకి తీసుకుని రోబోటిక్ రైట్ యూరెటరిక్ రీ-ఇంప్లాంటేషన్ శస్త్రచికిత్స నిర్వహించారు. శస్త్రచికిత్స సమయంలో మూత్రనాళం సంకుచితమైన ప్రాంతంతో పాటు, విస్తరించిన మూత్రనాళాన్ని వైద్యులు గుర్తించారు. మూత్రాశయం, ముందు పొత్తికడుపు గోడ మధ్య అతుక్కుపోయిన కణజాలం (అడ్హీషన్స్) కూడా ఉన్నట్లు నిర్ధారించారు. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని శస్త్రచికిత్స పూర్తి చేశారు. శస్త్రచికిత్స అనంతరం యువతి ఎలాంటి తక్షణ సమస్యలు లేకుండా కోలుకున్నారు. ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉండటంతో వైద్యులు ఆమెను ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. అయితే, సమస్య పూర్తిగా పరిష్కారమైందా? మూత్ర ప్రవాహం సక్రమంగా ఉందా? అనే అంశాలను నిర్ధారించేందుకు వైద్యుల సూచనల మేరకు తదుపరి పరీక్షలు, ఫాలోఅప్ అవసరమని తెలిపారు. మూడు నెలల తర్వాత క్లినికల్ అంచనా ఆధారంగా డీటీపీ ఏ రీనోగ్రామ్ పరీక్ష నిర్వహించాల్సి రావచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కన్సల్టెంట్ యూరాలజిస్ట్, ఆండ్రాలజిస్ట్, యూరో-ఆంకాలజిస్ట్, రోబోటిక్, రీనల్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ యశస్వి రెడ్డి టి. మాట్లాడుతూ.. యూరెటరిక్ స్ట్రిక్చర్ కారణంగా మూత్రనాళం సంకుచితమై మూత్ర ప్రవాహానికి ఆటంకం ఏర్పడవచ్చన్నారు. ఫలితంగా నడుము నొప్పి, మూత్ర విసర్జనలో మార్పులు వంటి లక్షణాలు కనిపించవచ్చని వివరించారు. యువతిలో సంకోచం ఉన్న ప్రాంతాన్ని బట్టి రోబోటిక్ యూరెటరిక్ రీ-ఇంప్లాంటేషన్ నిర్వహించామని, తదుపరి వైద్య పరీక్షలు కీలకమని



తెలిపారు. శస్త్రచికిత్సకు డాక్టర్ పరిక్షిత్ అనస్థీషియా సేవలు అందించారు. నిరంతరంగా నడుము నొప్పి రావడం, మూత్రం తగ్గిపోవడం, మూత్ర విసర్జనలో ఇబ్బందులు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా యూరాలజిస్ట్‌ను సంప్రదించాలని ఆసుపత్రి అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర సూచించారు. మలక్‌పేట యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అధునాతన వైద్య సదుపాయాలతో యూరాలజీ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సంపాదకీయ సూచన: ప్రచురణకు ముందు శస్త్రచికిత్స తేదీ, వైద్యుల పేర్ల స్పెల్లింగ్, అలాగే డిశ్చార్జి సమయంలో యువతి ఆరోగ్య పరిస్థితి, మూడు నెలల తర్వాత చేయాల్సిన పరీక్ష వివరాలను ఆసుపత్రి వర్గాలతో నిర్ధారించుకోవడం మంచిదన్నారు.

విద్యుత్ కోతలతో అల్లాడిపోతున్న రైతాంగం





కాంగ్రెస్ అధికారం లోకి వచ్చిన తర్వాత రైతులు ఇన్వర్టర్లే, జనరేటర్లు కొనుగోలు చేస్తున్నారు

రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వంకు తప్పకుండ తగులుతుంది...

చెన్నూర్ (సింగిడి): మంచిర్యాల జిల్లా చెన్నూరు విద్యుత్ కోతలతో రైతాంగం అల్లాడిపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరంతరం విద్యుత్ సరఫరా చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారం లోకి వచ్చిన తర్వాత ఇన్వర్టర్లే, జనరేటర్లు కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఒక పక్క వర్షాలు లేక పంటలు ఏడిపోతున్నాయని, మోటార్లు పెట్టి పంటను తడుపు కుందనుకుంటే విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర కమిటి పిలుపు మేరకు విద్యుత్ కోతల పై రానున్న రోజుల్లో ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మల్లెల దామోదర్ రెడ్డి, విద్యాసాగర్, మంత్రి బాపు, మణిశెట్టి శ్రీనివాస్, రెవెల్లి మహేశ్, కౌన్సిలర్లు ప్రభాకర్, ఇమ్రాన్, సురేష్ రెడ్డి, వెంకటరాజం తదితరులు పాల్గొన్నారు.....

ఘనంగా బతుకమ్మ వేడుకలు పాల్గొన్న జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా







నిర్మల్ ప్రతినిధి, (సింగిడి): జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బతుకమ్మలకు పూజలు చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో పూల బతుకమ్మలను పేర్చి, ఆయా శాఖల మహిళా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, వీరితో పాటుగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాలయబద్ధంగా బతుకమ్మ ఆడారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ అంటే ప్రకృతి, వ్యవసాయం, రైతులతో మమేకం అయ్యి ఉంటుందని అన్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని చెప్పారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, రైతులు అన్ని సమస్యల నుంచి బయటపడాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరు రైతులకోసం ప్రార్థించాలని కోరారు. జిల్లా ప్రజలకు, అధికారులకు, సిబ్బందికి ఈ సందర్భంగా బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ బతుకమ్మ వేడుకల్లో ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఖజానా శాఖ అధికారి సరోజ, మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న, ఉపాధి కల్పన శాఖ అధికారి విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి నామస్మరణ.. ఆధ్యాత్మిక సందడి

మంచిర్యాల, (సింగిడి): మ్మవారి నామస్మరణ.. ఆలయాల్లో మంగళవాయిద్యాలు.. ప్రత్యేక పూజలు.. దీపాల వెలుగులు.. ఎటుచూసినా ఆధ్యాత్మిక సందడి! శరన్నవరాత్రి ఉత్సవాలతో మంచిర్యాల జిల్లా భక్తిభావంతో పులకిస్తోంది. పట్టణాలు, పల్లెల్లోని ఆలయాలు అమ్మవారి పూజలతో కళకళలాడుతున్నాయి. దుర్గామాతను దర్శించుకునేందుకు భక్తులు కుటుంబ సమేతంగా తరలివస్తుండగా.. పూజలు, హోమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పండుగ వాతావరణం నెలకొంది. శరన్నవరాత్రులు కేవలం ఆధ్యాత్మిక వేడుకలే కాదు.. మన సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ బంధాలకు ప్రతీకలు. తొమ్మిది రోజులపాటు అమ్మవారిని వివిధ రూపాల్లో పూజిస్తూ భక్తులు తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆలయాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, చండీ హోమాలు భక్తులను ఆధ్యాత్మిక అనుభూతిలో ముంచెత్తుతున్నాయి. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారుతున్నాయి. ఉరుకుల పరుగుల జీవితంలో తీరికలేకుండా గడిపే ప్రజలు పండుగ వేళ కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాలకు చేరుకుంటున్నారు. పిల్లలకు సంప్రదాయాల గొప్పతనాన్ని పరిచయం చేస్తూ.. పెద్దల ఆశీస్సులు తీసుకుంటూ ఆధ్యాత్మిక వేడుకల్లో భాగస్వాములవుతున్నారు. భక్తుల రాకతో ఆలయాల వద్ద సందడి నెలకొనగా.. పూలు, పూజా సామగ్రి విక్రయాలు కూడా ఊపందుకుంటున్నాయి. ఉత్సవాలు స్థానిక వ్యాపారులకు కొంత ఉపాధిని కల్పిస్తున్నాయి. నవరాత్రి వేడుకలు భక్తులను ఒక్కచోట చేర్చి సామాజిక ఐక్యతను చాటుతున్నాయి.



వైభవంగా అమ్మవారికి భక్తిశ్రద్ధలతో మహిళలు బోనాలు







జగిత్యాల, (సింగిడి): అంగరంగ వైభవంగా అమ్మవారికి మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించేందుకు నెత్తిన బోనాలు ఎత్తుకున్న డప్పు చప్పుళ్ల నడుమ భారీ ర్యాలీగా జిల్లా కేంద్రమైన జగిత్యాల మార్కండేయ ఆలయం నుంచి నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం రాత్రి బోనాల పండుగ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా వందలాది మంది మహిళలు బోనాలను ఎత్తుకొని మార్కండేయ ఆలయం నుంచి వరకు డప్పు చప్పుళ్లు, మంగళ వాయిద్యాల నడుమ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద కొలువుదీరిన దుర్గామాతకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు జగిత్యాల ప్రజలందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు.

వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలి

ఎంఏఓ సంతోష్

బోధన్ (సింగిడి): రైతులు యాసంగి సీజన్‌లో వరికి బదులుగా ఆరు తడి పంటలు సాగు చేయాలని బోధన్ మండల వ్యవసాయ శాఖ అధికారి సంతోష్ సూచించారు. ఎల్ ని నో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు తగ్గిపోయే అవకాశం ఉందని, విద్యుత్ కొరత ఏర్పడే అవకాశం ఉన్నందువల్లరైతులు వరి పంటలు సాగు చేసి నష్టపోయే దానికంటే ఆరు తడి పంటలు సాగు చేయడం పై దృష్టి సారించాలన్నారు. ఆరుతడి పంటలైన శనగలు, కుసుమలు, పొద్దు తిరుగుడు, మినుములు, పెసర్లు, నువ్వులు, కందులు జొన్నలు, మొక్కజొన్న, వేరుశనగ, కూరగాయలు వంటి తక్కువ నీటితో పండే పంటలు సాగు చేయడం లాభదాయకమని రైతులకు సూచించారు. వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం వల్ల పంట మార్పిడి జరిగి భూమిలో సారం పెరుగుతుందని తద్వారా దిగుబడి పెరిగే అవకాశం ఉంటుందన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించి ఆరుతడి పంటలు సాగు చేసి ప్రభుత్వానికి సహకరించాలని రైతులను కోరారు.



రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా
నూతన కార్యవర్గానికి ఘన సన్మానం

బోధన్ , (సింగిడి): బోధన్ పట్టణంలోని టిటిడి కళ్యాణ మండపంలో బోధన్ ఏక చక్ర సేవా సమితి ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిజామాబాద్ జిల్లానూతన కార్యవర్గానికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. చైర్మన్ పోతన్ కర్ లక్ష్మీనారాయణ, కోశాధికారి కెశేపుల నాగరాజు, సభ్యులు కొండా సత్యప్రసాద్, ఎండల సుధాకర్, పద్మ సుభాష్, బాలాజీలను పూలమాలలు,శా లువాలు, మెమెంటో లతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏకచక్ర సేవాసమితి అధ్యక్షులు అంకు మహేష్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో హిందూవాహిని ప్రాంత సంఘటన మంత్రి యాదిరెడ్డి, బోధన్ ఏక చక్ర సేవాసమితి అధ్యక్షులు అంకు మహేష్, గౌరవ అధ్యక్షులు యార్లగడ్డ శ్రీనివాసరావు, సలహాదారులు ప్రవీణ్ మహారాజ్,సభ్యులు



లక్ష్మణరావు పటేల్, సంగం శ్రీనివాస్, రవి గౌడ్, రవీందర్ రెడ్డి,ఆనంద్,తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతనన సింగిడి ప్రతి రంగూ ఓ నిజం Singidi శనివారం 17-10-2026

వసూళ్ల ప్రచారంపై విచారణ ఏదీ?

అంగన్వాడీ కేంద్రాల వ్యవహారంపై జిల్లా అధికారుల స్పందన కోసం ఎదురుచూపులు

పండుగ కానుకల పేరుతో డబ్బుల సేకరణపై చర్చ.. వాస్తవాలు వెల్లడించాలని విజ్ఞప్తి

మెట్‌పల్లి, (సింగిడి): మెట్‌పల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో దసరా, దీపావళి పండుగల సందర్భంగా కానుకల పేరుతో అంగన్వాడీ టీచర్ల నుంచి డబ్బులు సేకరిస్తున్నారనే ప్రచారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారానికి సంబంధించి ఓ పోస్టర్ వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారంలో ఉండటంతో అంగన్వాడీ సిబ్బంది, సంబంధిత వర్గాల్లో చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కో టీచర్ నుంచి రూ. 3 వేల వరకు వసూలు చేస్తున్నారనే సమాచారం కూడా ప్రచారంలో ఉంది. అయితే, ఈ వివరాలకు సంబంధించి స్వతంత్రంగా నిర్ధారించిన ఆధారాలు అందుబాటులో లేనందున వసూళ్లు జరిగినట్లు నిర్ధారించడం సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో ప్రచారంలో ఉన్న అంశాలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

181 కేంద్రాల పరిధిలో చర్చ

అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం మెట్‌పల్లి అర్బన్ పరిధిలో 21, మెట్‌పల్లి రూరల్ వెల్లుల్ల సెక్టార్‌లో 24, జగసాగర్ సెక్టార్‌లో 25, మల్లాపూర్ సెక్టార్‌లో 54, ఇబ్రహీంపట్నం అర్బన్ సెక్టార్‌లో 19, అమ్మకపేట సెక్టార్‌లో 38 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నట్లు పేర్కొంటున్నారు. ఈ సంఖ్యల ప్రకారం మొత్తం 181 కేంద్రాలు ఉన్నాయి. అయితే, ఈ సంఖ్యలను సంబంధిత శాఖ రికార్డులతో ధ్రువీకరించాల్సి ఉంది. పండుగ కానుకల పేరుతో డబ్బులు సేకరించాలనే సూచనలు ఏమైనా వచ్చాయా? వచ్చినట్లయితే అవి ఎవరి నుంచి వచ్చాయి? సిబ్బందిపై ఏమైనా ఆర్థిక ఒత్తిడి ఉందా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రచారంలో ఉన్న సమాచారాన్ని మాత్రమే ఆధారంగా చేసుకుని ఎవరిపైనా ఆరోపణలు చేయడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గత ఏసీబి వ్యవహారం నేపథ్యంలో ఆసక్తి

మెట్‌పల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టుకు సంబంధించిన ఓ అధికారి విషయంలో గతంలో ఏసీబీకి ఫిర్యాదు చేసిన వ్యవహారం వార్తల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో తాజాగా పండుగ కానుకల పేరుతో డబ్బుల సేకరణపై జరుగుతున్న ప్రచారంపై కొందరు ఆసక్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే, గత ఫిర్యాదుకు, ప్రస్తుత ప్రచారానికి సంబంధం ఉన్నట్లు నిర్ధారించే ఆధారాలు లేవు. కాబట్టి ఈ రెండు అంశాలను వేర్వేరుగా చూడాల్సిన అవసరం ఉంది.

అధికారుల వివరణ కోసం ఎదురుచూపులు

ప్రస్తుతం ప్రచారంలో ఉన్న పోస్టర్ వాస్తవమైనదేనా? దాని వెనుక ఉన్న వివరాలేమిటి? డబ్బుల సేకరణకు సంబంధించి ఏమైనా ఆధారాలు ఉన్నాయా? అనే అంశాలపై సంబంధిత శాఖ అధికారులు పరిశీలన జరిపి స్పష్టత ఇవ్వాల్సి ఉంది. అంగన్వాడీ టీచర్లు స్వచ్ఛందంగా డబ్బులు ఇచ్చారా? లేక ఎవరైనా ఒత్తిడి తెచ్చారా? అనే అంశాలను సిబ్బంది నుంచి వివరాలు సేకరించి నిర్ధారించాల్సి ఉంది.

ఈ వ్యవహారంపై జిల్లా అధికారులు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేశారనే విషయం స్పష్టంగా తెలియరాలేదు. సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడిస్తే ప్రచారంలో ఉన్న సందేహాలకు సమాధానం లభించే అవకాశం ఉంది.

పారదర్శక విచారణకు విజ్ఞప్తి

పండుగ కానుకల పేరుతో డబ్బుల సేకరణ జరుగుతోందనే ప్రచారంపై అవసరమైన విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలని పలువురు కోరుతున్నారు. ఆరోపణలకు సంబంధించి ఆధారాలు లభిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ప్రచారంలో వాస్తవం లేదని తేలితే ఆ విషయాన్ని కూడా స్పష్టం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో కీలకంగా పనిచేసే అంగన్వాడీ సిబ్బందికి సంబంధించి ఇలాంటి ప్రచారం వచ్చినప్పుడు పారదర్శకతతో వ్యవహరించడం అవసరం. ఎవరిపైనా ముందస్తు నిర్ధారణలకు వెళ్లకుండా, అందుబాటులో ఉన్న ఆధారాలు, సంబంధిత వ్యక్తుల వివరణ ఆధారంగా వాస్తవాలను వెల్లడించడమే సముచితమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.పండుగ కానుకల పేరుతో డబ్బుల సేకరణపై జరుగుతున్న ప్రచారంలో వాస్తవమెంత? సిబ్బందిపై ఏమైనా ఒత్తిడి ఉందా? ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు విచారణ చేపడతారా? అనే అంశాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

శ్రీ నవదుర్గ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

అధ్యక్షుడిగా భారతపు రాజశేఖర్.. ప్రధాన కార్యదర్శిగా కప్పల పోచయ్య



బుగ్గారం, (సింగిడి): బుగ్గారం మండల కేంద్రంలోని శ్రీ నవదుర్గ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సంఘం గౌరవ అధ్యక్షుడిగా దశర్తి పూర్ణచందర్, అధ్యక్షుడిగా భారతపు రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా మాదాసు రాజేష్, ప్రధాన కార్యదర్శిగా కప్పల పోచయ్య ఎన్నికయ్యారు.అలాగే సహాయ కార్యదర్శిగా భారతపు శేఖర్, కోశాధికారిగా కప్పల మల్లేష్, సంఘ సలహాదారుడిగా మాదాసు రాజేందర్, ప్రచార కార్యదర్శిగా భారతపు గంగాధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన కార్యవర్గం సంఘ అభివృద్ధికి, సభ్యుల ఐక్యతకు కృషి చేస్తూ, సంఘాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ముందుకు సాగాలని సభ్యులు ఆకాంక్షించారు.

వంగర ఎస్సైగా ఎం. రాజు బాధ్యతల స్వీకరణ

వర్ధన్నపేట నుంచి బదిలీ.. దివ్యకు హనుమకొండకు స్థానచలనం



భీమదేవరపల్లి, (సింగిడి): పోలీస్ శాఖలో ఇటీవ ల జరిగిన బదిలీల్లో భాగంగా హనుమ కొండ జిల్లా భీమదేవ రపల్లి మండలంలోని వంగర పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్సైగా ఎం. రాజు నియమితుల య్యారు. వర్ధన్న పేట పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై వచ్చిన ఆయన గురు వారం వంగర పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించా రు.ఇప్పటివరకు వంగర ఎస్సైగా విధులు నిర్వహించిన జి. దివ్య హనుమకొండ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఎం. రాజుకు పోలీస్ స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై రాజయ్య, కూన యాదగిరి, పోలీస్ కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ



మహాదేవపూర్ (సింగిడి): విజయదశమి, సద్దుల బతుకమ్మ పండుగలను పురస్కరించుకొని జయ శంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ గ్రామపంచాయతీ కార్మికులకు స్థానిక సర్పంచ్ హసీనాబాను, ఉప సర్పంచ్ తుంగల శ్రీజలు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉండడానికి నిరంతరం శ్రమిస్తూ పారిశుద్ధ్యం నిర్వహిస్తున్న వీరి సేవలు వెలకట్టలేనివి అని అన్నారు. పండుగల వేళ వారు ఆనందంగా ఉండాలని ఈ కార్యక్రమం చేపట్టినట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు నయుముద్దీన్, మహమ్మద్ బిన్ వలి, గడ్డం స్వామి, నల్లబుగ సమ్మయ్య, రాములు, పంచాయతీ కార్యదర్శి కల్పన తోపాటు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు





ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల

హుస్నాబాద్ (సింగిడి): హుస్నాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి బతుకమ్మ ఆటల్లో పాల్గొన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతిపై ప్రేమకు ప్రతీక అని ఆమె పేర్కొన్నట్లు కథనంలో పేర్కొనవచ్చు. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి, ఆటపాటలతో జరుపుకునే ఈ పండుగ మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడుతుందని, భావిత రాలకు ఈ గొప్ప వారసత్వాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆమె అన్నారు. ప్రకృతిని ప్రేమిస్తూ, పూల విశిష్టతను చాటిచెప్పే బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, కుటుంబాల మధ్య అనుబంధాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం మహిళలు సంప్రదా యబద్ధంగా బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ చేరి ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైర్మన్ దండి లక్ష్మి, వైస్ వైర్మన్ చిత్తారి పద్మ, మున్సిపల్ కౌన్సిలర్లు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో పలు బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే...



ఆర్మూర్, (సింగిడి): బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ గ్రామంలో గురువారం మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పలు బాధిత కుటుంబాలను సందర్శించి పరామర్శించారు. దళిత కుటుంబానికి చెందిన మోత్కు జీవన్ అనే యువకుడు ఇటీవల గల్ఫ్ నుండి అనారోగ్యంతో బాధపడుతూ మరణించిన విషయాన్ని తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను సందర్శించి పరమార్శించి మనోధైర్యం అందజేశారు. అంతేకాకుండా వారి కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవలే మరణించిన కుదురుపాక రాజు వారి తల్లి కాలం చేయడంతో వారి కుటుంబాన్ని సందర్శించి పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఆర్.ఎం.పి.డాక్టర్ అశోక్ కుటుంబాన్ని సందర్శించి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. టిఆర్ఎస్ నాయకులు నాకిడి శ్రీకాంత్ అనారోగ్యంతో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకొని వారి కుటుంబాన్ని సందర్శించి పరామర్శించి, ప్రస్తుతము ఆరోగ్య యోగక్షేమాలను బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కల్లెడ ఏలియా, మోర్తాడ్ గ్రామ సర్పంచ్ భోగా ఆనంద్, ఉప సర్పంచ్ సామ శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ, పాపాయి పవన్, సీనియర్ నాయకులు గోపిడి సత్యనారాయణ, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఇంతియాజ్, యూసఫ్, మాజీ ఉపసర్పంచ్ జే.సి. గంగారెడ్డి, గంధం మహిపాల్, అశోక్, చిన్న రాజేశ్వర్, రాజేందర్, సుంకేట్ గ్రామనాయకులు, పలువురు, పాల్గొన్నారు.

న్యాయమూర్తిగా మల్లారం యువకుడు డ్యాగల సాయి పవన్ ఎంపిక

జూనియర్ సివిల్ జడ్జి పరీక్షలో ప్రతిభ.. నాలుగు రోజుల క్రితమే ఏపీపీగా అర్హత

భీమదేవరపల్లి, (సింగిడి): పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని నిరూపిస్తూ హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామానికి చెందిన డేగల సాయి పవన్ న్యాయమూర్తిగా ఎంపిక య్యారు. తెలంగాణ హైకోర్టు నిర్వహించిన జూనియర్ డివిజన్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ నియామక పరీక్ష ఫలితాల్లో ఆయన అర్హత సాధించడం గ్రామానికి గర్వకారణంగా నిలిచింది.హుజూ రాబాద్ సమీపం లోని సింగపూర్ కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యను పూర్తి చేసిన సాయి పవన్‌కు న్యాయశాస్త్రంపై ఆసక్తితో న్యాయవి ద్య అభ్యసిం చాలని నిర్ణయించు కున్నారు. పశ్చి మ బెంగాల్‌లోని ఐఐటీ ఖరగ్‌పూ ర్‌లో ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. అనంతరం న్యూఢిల్లీలోని తీస్ హజారీ జిల్లా కోర్టులతో పాటు హనుమకొండ జిల్లా కోర్టులో ఇంటర్న్‌షిప్ పూర్తి చేశారు.ప్రస్తు తం రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు ముద్దసాని సహోదర రెడ్డి వద్ద జూనియర్ న్యాయవాదిగా విధులు నిర్వహిస్తు న్నారు. న్యాయవృత్తిలో అనుభవాన్ని సంపాదిస్తూనే పోటీ పరీక్షలకు సిద్ధమై న్యాయమూర్తిగా ఎంపిక య్యారు.నాలుగు రోజుల వ్యవధిలో మరో విజయంన్యాయ మూర్తిగా ఎంపిక కావడానికి ముందే తెలంగా ణ పోలీస్ శాఖ నిర్వహించిన అసి స్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) నియామక పరీక్ష ఫలితాల్లోనూ సాయి పవన్ అర్హత సాధించారు. వరుస విజయా లతో తన ప్రతిభను చాటుకున్న ఆయన ప్రయాణం యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోం ది.మల్లారం గ్రామానికి చెందిన యువకుడు



న్యాయమూర్తిగా ఎంపిక కావడంతో గ్రామస్థులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. న్యాయరంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నారు.

లలిత త్రిపుర సుందరి అలంకరణలో అమ్మవారు దర్శనం



మహాదేవపూర్ (సింగిడి): దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని తస్సర్ కాలని శ్రీ సిద్దేశ్వర శివాలయంలో ఏర్పాటు చేసిన శ్రీ చౌడేశ్వరి భవానీ మాత అమ్మవారు గురువారం ఐదవ రోజు లలితాత్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చౌడేశ్వరి మాత నుదిటిన నెల వంక కిరీటం చేతుల చేరుకుగద ధరించిన సుందరమైన రూపంలో భక్తులకు దర్శనమిచ్చిరు. అర్చకులు రాజబాబు, లలిత్ అమ్మవారికి ప్రత్యేకపూజలు చేపట్టారు. భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం నింపి కుంకుమ అర్చనపూజలు నిర్వహించారు. లలితాత్రిపుర సుందరి దేవి అమ్మవారుకి పలు రకాల పదార్థలతో నైవేద్యం సమర్పించారు. తీర్థప్రసాద వితరణ అనంతరం గోండ్రాల రాకేష్ మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు కర్క రవి కుమార్. గొర్రె హరి శంకర్,తెలిపారు. ఈ కార్యక్రమం లో భవాని మాలధారణ భక్తులు కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దుర్గాదేవి ఆలయంలో కొనసాగుతున్న అన్నదానం

ఆలయ అధ్యక్షుడు ఆమంద్ విజయ్ కృష్ణ

నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):
నిజామాబాద్ నగరంలోని గుమస్తా కాలనీలో కొలువు దీరిన శ్రీశ్రీశ్రీ దుర్గాదేవి ఆలయంలో నిర్వహిస్తున్న తొమ్మిది రోజుల అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. అన్నదానం మహాదానం అనే స్ఫూర్తితో ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాన్ని అంది స్తూ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఈ అన్నదా న కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోం ది. దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు ఆమంద్ విజయ్ కృష్ణ మాట్లాడుతూ అమ్మవా రిని తొమ్మిది రూపాలలో కొలుస్తున్నామని తెలిపారు. ప్రజలు తండోతండాలుగా వస్తుండడంతో వారికి అమ్మవారి ఆశీస్సులతో తొమ్మిది రోజుల పాటు



నిత్యన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఐదు రోజులు విజయవంతంగా పూర్తయ్యాయని, మిగిలిన నాలుగు రోజుల కార్యక్రమాన్ని కూడా విజయవంతంగా నిర్వహించేం దుకు భక్తులు, దాతలు సహకరించాలని కోరారు. ఈ పవిత్ర సేవా కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు, భక్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

నీటి కుంటలో పడి మృతి చెందిన బాలుడి కుటుంబానికి వైద్యులు పరామర్శ



డోర్నకల్ /మరిపెడ (సింగిడి):
మున్సిపల్ కేంద్రం లోని ఐదో వార్డుకు చెందిన ఎలక్ట్రీషి యన్ హరీష్ కుమారుడు అక్షిత్ (9) ఇటీవల ఆడుకుంటూ నీటి కుంట లో పడి మృతి చెందాడు. బాలుడి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న మరిపెడలోని శ్రీ శ్రేష్ట హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కారుణ్య సాగర్, డాక్టర్ బిందు శ్రీ, ప్రేమ్ సాగర్ గురువారం బాలుడి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అక్షిత్ మృతిపట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించి,వారికి మనోధైర్యాన్ని కల్పించారు.

2027 జనాభా లెక్కల్లో న్యాయమైన కుల గణన చేపట్టాలి

బిఎల్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి

నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి): కేంద్ర ప్రభుత్వం నిర్వహించే 2027 జనాభా లెక్కల్లో న్యాయమైన కుల గణన చేపట్టాలని ప్రస్తుత సెన్సస్ ప్రక్రియను నిలిపివేసి, రాష్ట్రాల వారీ ఓబీసీ డ్రాప్-డౌన్ జాబితాల ఆధారంగా కుల కోడింగ్‌తో తిరిగి ప్రారంభించాలని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ బిఎల్ ఎఫ్ నిజామాబాద్ జిల్లా కన్వీనర్లు కాంట్లే మధు,కర్రోల్ల శ్రీనివాస్ లు రాష్ట్రపతి కి రాసిన లేఖను నిజా మాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ కి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వెనుకబడిన తరగతులు , షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారు రాజ్యాం గబద్ధమైన హక్కులు, సంక్షేమ ఫలాలను కాపాడటానికి ఖచ్చితమైన డేటా ఎంతైనా అవసరమని, నిజమైన ప్రజాస్వామ్య పరిపాలనకు ఇది అత్యంత విలక్షణ మైనదన్నారు. వెనుకబడిన తరగతుల బీసీల చేర్పు సెన్సస్ 2027 షెడ్యూల్‌లోని 'ప్రశ్న సంఖ్య 10'లో ఎస్సీ, ఎస్టీ వర్గాలతో పాటు వెనుకబడిన తరగతులు (బీసీలు) అనిస్పష్టంగా పేర్కొనాలనివారికి సమాన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాష్ట్రాల వారీ కులాల డ్రాప్-డౌన్ జాబితాలు డేటాలో ఎలాంటిపొరపాట్లు,సమాచారం సమోదు కాకపోవడం, లేదా పరిపాలనాపరమైన అయోమయం లేకుండా ఉండేలా ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీలకు సంబంధించి రాష్ట్రాల వారీగా నిర్దిష్ట కులాల పేర్లతో కూడిన డ్రాప్-డౌన్ జాబితాలను సెన్సస్ ఫ్రేమ్‌వర్క్ లో చేర్చాలన్నారు. వనరుల సమాన పంపిణీని నిర్ధారించడానికి ప్రభుత్వం తన అస్పష్టమైన వైఖరిని వీడి, వివరమైన కులాల వారీ డేటాను బహిరంగంగా విడుదల చేస్తామని స్పష్టమైన కట్టుబాటును ప్రకటించాలన్నారు. భారత జనాభాలో వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు అత్యంత భారీ నిష్పత్తిలో ఉన్నారని, ఖచ్చితమైన,



నిష్పాక్షికమైన సంఖ్యాత్మక డేటా లేకుండా నిర్దిష్ట సంక్షేమ విధానాలు, విద్యా రిజర్వే షన్లు, నిధుల కేటాయింపులు లోపభూయిష్టంగా అసంపూర్తిగా ఉండిపోతా యన్నారు. ప్రస్తుత సెన్సస్ ప్రక్రియను వెంటనే నిలిపివేసి, రాష్ట్రాల వారీ ఓబీసీ డ్రాప్-డౌన్ జాబితాల ద్వారా కుల కోడింగ్‌ను అమలు చేస్తూ హైబ్రిడ్ మోడ్‌లో దీనిని తిరిగి ప్రారంభించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని, సెన్సస్ 2027 పూర్తిగా పారదర్శకంగా, సమగ్రంగా, ఖచ్చితమైనదిగా ఉండటానికి ఇది అత్యంత అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఎఫ్ జిల్లా నాయకులు హైమద్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం

యువ నాయకుడు నూకల అభినవ్ రెడ్డి

డోర్నకల్/మరిపెడ (సింగిడి): అన్ని దానాలలో కెల్లా అన్నదానం గొప్పదని జిల్లా కాంగ్రెస్ యువ నాయకుడు నూకల అభినవ్ రెడ్డి అన్నారు .మరిపెడ పట్టణంలోని శివాలయం మాన్యం ప్రాంగణంలో దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గా మాత మండపం వద్ద ఐదవ రోజు గురువారం పట్టణ యాదవ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా అభినవ్ రెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి,అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు.దుర్గామాత విగ్రహా ఏర్పాటుతో అంతటా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంద న్నారు.అమ్మవారి దయతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. సామూహిక అన్నదానం వంటి కార్యక్రమాలతో ప్రజల మధ్య ఐకమత్యం పెంపొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గంట్ల గౌతమ్ రెడ్డి, గంట్ల సుజాత మహిపాల్ రెడ్డి, జాటోతు సురేష్, సత్యవతి యుగంధర్, మెరుగు రాము, నీలా లచ్చిరాం, కాంతమ్మ కరణ్ సింగ్, కుడితి నరసింహ రెడ్డి, గుండగాని సుందర్, రేఖ రమేష్,ఉడుగుల





రాజు పవన్ రెడ్డి,కాసారపు రమేష్,వేణు,భిక్షం, రేఖ దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లలితా దేవి అలంకరణలో అమ్మవారు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు దుర్గామాత శ్రీ లలితా దేవీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.అర్చకులు పాకాల రఘురామ్ శర్మ, అజయ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక ప్రసాదాలు నైవేద్యంగా సమర్పించారు.భవానీ దీక్షపరులు భజనలు చేయగా,భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందారు.

జర్నలిస్టుల రక్షణ చట్టం తీసుకురావాలి..

రిపోర్టర్లపై థర్డ్ డిగ్రీని ఖండించిన జర్నలిస్ట్ నేత ఎన్నం కిషన్ రెడ్డి

ఎస్ఐ పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్





జగిత్యాల,(సింగిడి): వివిధ వర్గాలకు, సంస్థలను రక్షించడానికి ఉన్నటువంటి రక్షణ చట్టాలను జర్నలిస్టులకు సైతం వర్తింపజేయాలనీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జగిత్యాల జిల్లా జర్నలిస్ట్ నాయకులు కోరుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్ ఇద్దరు రిపోర్టర్లు శేఖర్, సంపత్ లపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడాన్ని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిజెజీఎఫ్) రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, బుగ్గారం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దూడ జీవన్, నూతన కార్యవర్గం గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. పోలీసుల అధికార దుర్వినియోగం, లంచాల వసూళ్లపై వార్తలు రాసినందుకే కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం దారుణమని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ, ప్రజాస్వామ్యంలో నాల్గవ స్తంభంగా ఉన్న విలేకరుల పట్ల సదరు ఎస్ఐ వ్యవహరించిన తీరు క్షమించరానిదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ఎస్ఐని ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేయడం పరిష్కారం కాదని, పోలీసు ఉన్నతాధికారులు ఈ ఘటనపై లోతైన విచారణ జరిపి, బాధ్యుడైన ఎస్ఐపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కిషన్ రెడ్డి,జీవన్ లు కోరారు.

శ్రీ నవదుర్గాదేవి బోనాల జాతర





బుగ్గారం, (సింగిడి):: బుగ్గారం మండలంలో శ్రీ నవదుర్గాదేవి బోనాల జాతరను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనాలు సమర్పించారు. గ్రామం సుభి, క్షంగా ఉండాలని, ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉం డాలని ప్రార్థించారు. జాతర సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వాడవాడలా భక్తులు బోనాలు సమర్పిస్తూ తమ భక్తిని చాటుకున్నారు. డప్పు వాయిద్యాల మోత, ఓగ్గు కళాకారుల ఆటపాటలు జాతరకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తుల కోలాహలం, ఆధ్యాత్మిక వాతావరణంతో జాతర సందడిగా సాగింది.

సద్దుల బతుకమ్మకు రూ.25 లక్షల నిధులు

మూడేళ్లలో 5,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం

దళిత బంధు నిధులను ఆపింది ఎమ్మెల్యే.. పాడి కౌశిక్‌రెడ్డి పై వొడితల ప్రణవ్ విమర్శలు

జమ్మికుంట, (సింగిడి): సద్దుల బతుకమ్మ, దసరా పండుగలను మహిళలు ఆనందోత్సాహాలతో జరుపుకునేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ తెలిపారు. జమ్మికుంట పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను గురువారం పరిశీలించిన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలకు సద్దుల బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు.
ఈ ఏడాది సద్దుల బతుకమ్మ వేడుకల కోసం ప్రభుత్వం రూ. 25 లక్షలు కేటాయించిందని, గతేడాదితో పోలిస్తే అదనపు నిధులు మంజూరు చేసిందని చెప్పారు. నియోజకవర్గవ్యాప్తంగా 17 ప్రాంతాల్లో వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని, లైటింగ్, వేదికలు, తాగునీటి సౌకర్యం కల్పించడంతోపాటు మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

అభివృద్ధిపై కౌశిక్‌రెడ్డికి సవాల్

హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై ప్రణవ్ తీవ్ర విమర్శలు చేశారు. పెద్దపెద్ద మాటలు మాట్లాడటం మానుకుని ప్రజలకు చేసిన అభివృద్ధి పనులపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. గత పదేళ్లలో ఒక్క ఇల్లు కూడా నిర్మించలేని వారు, కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లలో నియోజకవర్గానికి 5,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని పేర్కొన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల మంజూరు వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. సుమారు 18 వేల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంతోపాటు మరో 22 వేల కార్డుల్లో చేర్పులు, తొలగింపులు చేపట్టినట్లు చెప్పారు. జమ్మికుంట, హుజురాబాద్ పట్టణాల అభివృద్ధికి రూ. 15 కోట్లు మంజూరు చేసి పనులు



ప్రారంభించామని, డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. 67 వేల మంది రైతులకు రైతు భరోసా అందించడంతోపాటు రుణమాఫీ అమలు చేశామని, ఎస్టీపీలు, ట్రామా సెంటర్, ఏటీసీ సెంటర్ మంజూరుకు కృషి చేసినట్లు తెలిపారు.

దళిత బంధు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం

దళిత బంధు నిధుల అమలుపై స్పందిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకానికి సంబంధించిన నిధుల విడుదల ప్రక్రియను ప్రారంభించిందని ప్రణవ్ పేర్కొన్నారు. దళిత బంధు పథకాన్ని అడ్డుకునేందుకు కౌశిక్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేయకుండా విమర్శలకే పరిమితమవుతున్నారని మండిపడ్డారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్నామని, అర్హులైన వారికి కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. జమ్మికుంట మండల, పట్టణ పరిధిలో 28 మంది లబ్ధిదారులకు రూ. 11 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.



కొడంగల్ అభివృద్ధిని చూడాలి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పటి నుంచి ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టారని ప్రణవ్ అన్నారు. పాలిటెక్నిక్ కళాశాల, కొడంగల్ బస్ డిపో ఏర్పాటు, గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యాల విస్తరణ, రహదారుల అభివృద్ధి, సాగునీటి వసతుల పెంపునకు కృషి చేశారని వివరించారు. ప్రస్తుతం కొడంగల్ విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ విప్‌గా ఉంటూ హుజురాబాద్ నియోజకవర్గానికి కౌశిక్‌రెడ్డి చేసిందేమీ లేదని విమర్శించారు. హుజురాబాద్ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, ప్రజా సంక్షేమం కోసం తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ప్రణవ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ మున్సిపల్ చైర్మన్ గుట్టల మల్లికార్జున స్వామి కౌన్సిలర్లు చందా రాజు, శ్రీపతి స్వర్ణలత నరేష్ గౌడ్ పాతకాల అనిల్ పొనగంటి విష్ణు మాచర్ల రాజు ఒగ్గు రమేష్ దిడ్డి రాము కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొన్నగంటి మల్లయ్య దేశిని కోటి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి డైరెక్టర్లు మానుపాటి సూర్యగడ్డం దీక్షిత్ నాయినేని రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర వేళ 108 సేవలను సద్వినియోగం చేసుకోండి

ఎనిమిది నెలల్లో 756 మందికి ప్రాణదానం.. 108 సిబ్బందికి జిల్లా మేనేజర్ అభినందనలు

నవజాత శిశువుల కోసం ప్రత్యేక నియోనెటల్ అంబులెన్స్ సేవలు

భీమదేవరపల్లి, (సింగిడి): అత్యవసర పరిస్థితుల్లో క్షణం ఆలస్యమైనా ప్రాణాలకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. అలాంటి సమయాల్లో బాధితులకు సకాలంలో వైద్యసేవలు అందిస్తూ ప్రాణాలను కాపాడటంలో 108 అంబులెన్స్ సేవలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భీమదేవరపల్లి మండల ప్రజలు అత్యవసర వైద్య అవసరాల కోసం 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలని 108 జిల్లా మేనేజర్ శ్రీమండ శ్రీనివాస్ సూచించారు. గురువారం భీమదేవరపల్లి మండల కేంద్రంలోని 108 అంబులెన్స్‌ను ఆయన తనిఖీ చేశారు. అంబులెన్స్‌లోని వైద్య పరికరాలు, అత్యవసర మందులు, రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలు 108కు ఫోన్ చేసిన వెంటనే స్పందించి, 30 సెకన్లలో అంబులెన్స్‌ను ప్రారంభించి, సాధ్యమైనంత త్వరగా బాధితుల వద్దకు చేరుకోవాలని ఆదేశించారు. బాధితులకు మెరుగైన ప్రాథమిక అత్యవసర వైద్యసేవలు అందించి సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని సూచించారు.

756 మందికి ప్రాణదానం.. సిబ్బందికి అభినందనలు



ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు 108 సిబ్బంది అందించిన సేవల ద్వారా 756 మంది ప్రాణాలను కాపాడినట్లు పేర్కొంటూ సిబ్బందిని జిల్లా మేనేజర్ అభినందించారు. వర్షాకాలంలో విషపురుగుల కాట్లు, సీజనల్ వ్యాధులు, విద్యుత్ షాకులు, రోడ్డు ప్రమాదాలు, గర్భిణులకు అత్యవసర వైద్యసేవలు అవసరమైనప్పుడు ఏమాత్రం ఆలస్యం చేయకుండా 108కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

నవజాత శిశువుల కోసం ప్రత్యేక అంబులెన్స్

చిన్నారుల ప్రాణాలను కాపాడేందుకు అందుబాటులో ఉన్న ప్రత్యేక నియోనెటల్ అంబులెన్స్ సేవలను కూడా ప్రజలు వినియోగించుకోవాలని శ్రీనివాస్ సూచించారు. హనుమకొండ జిల్లా ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న ఈ ప్రత్యేక అంబులెన్స్ ద్వారా అప్పుడే పుట్టిన శిశువుల నుంచి ఏడాది వయస్సు వరకు ఉన్న చిన్నారులకు అత్యవసర పరిస్థితుల్లో వైద్య సహాయం అందించవచ్చని వివరించారు. తక్కువ బరువుతో జన్మించిన శిశువులు, శ్వాస సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్న చిన్నారులు, ఫిట్స్ వంటి సమస్యలతో బాధపడుతున్న శిశువులకు ఈ సేవలు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రమాదాలకు గురైన చిన్నారులకు సైతం అత్యవసర వైద్య సహాయం అందించేందుకు ఈ అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వెంటిలేటర్, ఇంక్యుబేటర్, సిరంజి పంపు, ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డీఫిబ్రిలేటర్ (ఏఈడీ), సక్షన్ పరికరాలు వంటి అధునాతన వైద్య సదుపాయాలు ఈ అంబులెన్స్‌లో ఉన్నాయని వివరించారు. అవసరాన్ని బట్టి చిన్నారులను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి లేదా హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి ఉచితంగా తరలించి వైద్యసేవలు అందించేందుకు ఈ సదుపాయం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మండల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో 108కు ఫోన్ చేసి, చిన్నారుల విషయంలో ప్రత్యేక నియోనెటల్ అంబులెన్స్ అవసరాన్ని స్పష్టంగా తెలియజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మున్నీరు, 108 ఈఎంటీలు రేణికుంట్ల విద్యాసాగర్, మేకల రవి, తేజస్విని, పైలెట్లు సులుగురి కృష్ణంరాజు, కవ్వంపల్లి సంపత్, కొట్టే సునీల్ పాల్గొన్నారు.

మృతురాలి కొడుకును పరామర్శించిన ఎమ్మెల్యే సత్యం



ములాల ,(సింగిడి): కొండగట్టు దిగువ ప్రాంతా నికి చెందిన నిమ్మల ఆనందమ్మ అనారోగ్యంతో మృతి చెందగా స్థానిక చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం మృతు రాలి కొడుకు ప్రకాష్ ను పరామర్శించి ఓదార్చారు. నాడు తం డ్రి దూరమై నేడు తల్లి కోల్పోవడంతో దిక్కులేని స్థితిలో ఉన్న ప్రకాష్ ప్రస్తుతానికి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతు న్నాడు. భవిష్యత్తులో అన్ని విధాలుగా తోడుంటానని ఎమ్మెల్యే భరోసానిస్తూ ఈ సందర్భంగా ఆర్థిక సహాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట పార్టీ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



బోధన్ ప్రతినిధి, (సింగిడి): సాలూరా మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన శ్రీ సార్వజనిక్ దుర్గాదేవి మండపం వద్ద దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నా యి. ఉత్సవాల్లో భాగంగా5వ రోజైనా గురువారం అమ్మవారు భక్తులకు సిరి సంపదలను ప్రసాదించే శ్రీ మహాలక్ష్మి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామ సర్పంచ్ లావణ్య-రవి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలందరిపై దుర్గామాత ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భూముల హద్దులకు పక్కా గుర్తింపు.. రీసర్వేలో పారదర్శకతకు పెద్దపీట!

రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలి

అధికారులకు అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు దిశానిర్దేశం

పెద్దపల్లి, (సింగిడి):: భూముల రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతుల భూముల విస్తీర్ణం, సరిహద్దులను కచ్చితంగా గుర్తించి నమోదు చేయాలని, సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని స్పష్టం చేశారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో రీసర్వే కార్యక్రమం అమలుపై సంబంధిత అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో చేపట్టిన రీసర్వేను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పూర్తి చేసేందుకు ప్రతి బృందం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రీసర్వే బృందాల్లోని ఇన్‌చార్జి అధికారులు, గ్రామ పరిపాలన అధికారులు, సర్వేయర్లు, లైసెన్స్‌డ్ సర్వేయర్లు నిర్దేశిత మార్గదర్శకాలను పాటించాలని ఆదేశించారు.

రైతులకు ముందస్తు సమాచారం తప్పనిసరి

రీసర్వే చేపట్టే ముందు సంబంధిత భూముల సర్వే షెడ్యూల్‌ను రైతులకు ముందుగానే తెలియజేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. సర్వే నిర్వహించే తేదీ, సమయాన్ని స్పష్టంగా తెలియజేసి, రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే చేపట్టాలని పేర్కొన్నారు. దీనివల్ల భూముల సరిహద్దుల గుర్తింపులో పారదర్శకత పెరుగుతుందని తెలిపారు.

సాంకేతికతతో హద్దుల నిర్ధారణ

భూముల వాస్తవ విస్తీర్ణం, సరిహద్దులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి హద్దులను కచ్చితంగా గుర్తించి రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. భూములకు సంబంధించిన పాత రికార్డులు, ప్రస్తుత వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. సర్వే సమయంలో హద్దుల విషయంలో ఏవైనా తేడాలు లేదా సందేహాలు తలెత్తితే నిబంధనల ప్రకారం విచారించి పరిష్కరించాలని తెలిపారు. రీసర్వే ప్రక్రియపై రైతులకు అవసరమైన అవగాహన కల్పిస్తూ, వారి సందేహాలను నివృత్తి చేయాలని అధికారులకు సూచించారు. నిర్దిష్ట కార్యాచరణ ప్రకారం సర్వేను పూర్తి చేసి, భూముల వివరాల్లో కచ్చితత్వం, పారదర్శకత పెంపొందించేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.



భూములకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య

రీసర్వే పూర్తయిన అనంతరం భూములకు స్పష్టమైన హద్దులతో కూడిన ఆధార్ తరహా ప్రత్యేక భూధారణ సంఖ్యను కేటాయించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. భూముల వివరాలను కచ్చితంగా నమోదు చేయడం ద్వారా భవిష్యత్తులో భూ రికార్డుల నిర్వహణ మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే డి. సోమేశ్వర్, రీసర్వేకు సంబంధించిన నాయబ్ తహసీల్దార్లు, లైసెన్స్‌డ్ సర్వేయర్లు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

అనంతుల రాజుకు ఘన సన్మానం

శాలువాలతో సత్కరించిన కోలేటి దామోదర్, ఏసీపీ మడత రమేష్

పెద్దపల్లి, (సింగిడి):: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ వాసవి సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన అనంతుల రాజును పలువురు ప్రముఖులు ఘనంగా సన్మానించారు. గురువారం తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ తన నివాసంలో అనంతుల రాజును శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అలాగే రామగుండం పోలీస్ కమిషనరేట్ ఏసీపీ మడత రమేష్ తన చాంబర్‌లో అనంతుల రాజును శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కోలేటి దామోదర్ మాట్లాడుతూ ఆర్యవైశ్య మహాసభ వాసవి సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అనంతుల రాజు నియమితులు కావడం అభినందనీయమన్నారు. సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ శు



భాకాంక్షలు తెలిపారు. ఏసీపీ మడత రమేష్ సైతం అనంతుల రాజుకు రాష్ట్రస్థాయి బాధ్యతలు లభించడం పట్ల హర్షం వ్యక్తం చేసి అభినందించారు. కొత్త బాధ్యతల్లో సేవా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సమాజానికి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ లయన్స్ క్లబ్ నాయకులు కోలేటి శ్రీనివాస్, గోదావరిఖని పట్టణ అధ్యక్షుడు వెనిశెట్టి నటరాజశేఖర్, తెలంగాణ ఆర్యవైశ్య విద్యావంతుల వేదిక వ్యవస్థాపకుడు బల్లు చంద్రప్రకాష్, వెనిశెట్టి వీరన్న, వెంకట ముత్యం, సంతోష్, ముస్త్యాల సంతోష్ తదితరులు పాల్గొని అనంతుల రాజుకు అభినందనలు తెలిపారు.

వికాస్ స్మృతికి.. రక్తదానమే నివాళి





మంచిర్యాల, (సింగిడి): మనిషి భౌతికంగా దూరమైనా.. అతడు మిగిల్చిన జ్ఞాపకాలు పదిమందికి మేలు చేసినప్పుడు చిరస్థాయిగా నిలిచిపోతాయి. తిరిగిరాని వ్యక్తి కోసం కన్నీరు పెట్టుకోవడం సహజం.. కానీ అతడి జ్ఞాపకాలను మరొకరి ప్రాణాలను కాపాడే సేవతో ముడిపెట్టడం ఎంతో గొప్ప విషయం. వేముల వికాస్ స్మారకార్థం మనోరంజన్ సేవా భవన్ మిత్రుల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం ఇలాంటి మానవీయ విలువలకు ప్రతిరూపంగా నిలిచింది. వికాస్ మిత్రులు, కుటుంబ సభ్యులు, పరిచయస్తులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేసి.. ఆయన జ్ఞాపకాలకు సేవా రూపంలో నివాళులర్పించారు. రక్తం అవసరమైన సమయంలో సకాలంలో అందకపోతే ఒక్కోసారి ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది. ప్రమాదాల్లో గాయపడినవారికి, శస్త్రచికిత్సలు చేయించుకునే రోగులకు, అత్యవసర వైద్యం పొందుతున్నవారికి రక్తం ఎంతో కీలకం. అలాంటి సమయంలో దానం చేసిన రక్తం మరొక కుటుంబంలో ఆశాదీపాన్ని వెలిగించగలదు. ఈ వాస్తవాన్ని గుర్తించిన వికాస్ స్నేహితులు, కుటుంబ సభ్యులు తమ అనుబంధాన్ని సామాజిక సేవగా మలిచారు. తాము అందించే రక్తం తెలియని వ్యక్తికి ప్రాణాధారంగా మారుతుందనే భావనతో ముందడుగు వేశారు. వికాస్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ మిత్రులు, కుటుంబ సభ్యులు, పరిచయస్తులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. వ్యక్తి మన మధ్యలేకపోయినా.. ఆయన జ్ఞాపకాలు మంచి పనులకు స్ఫూర్తినిస్తాయనే సందేశాన్ని చాటిచెప్పారు. జ్ఞాపకార్థం చేసే కార్యక్రమం కేవలం ఆచారంగా మిగిలిపోకుండా.. సమాజానికి ఉపయోగపడే సేవగా మారితే దాని ప్రయోజనం మరింత విస్తృతమవుతుంది. యువతలో సేవాభావం, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీసీసీ ఎస్సై కాజుద్దీన్, మేయర్ మధుకర్, 34వ డివిజన్ కార్పొరేటర్ అగ్గు సాగర్ పాల్గొన్నారు. రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన మిత్రులు, కుటుంబ సభ్యులను అభినందించారు. వికాస్ భౌతికంగా దూరమైనా.. ఆయన స్మృతిలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం సేవా స్ఫూర్తిని చాటిచెప్పింది. ఒకరి జ్ఞాపకం మరొకరికి ప్రాణం పోసే అవకాశంగా మారడం ఈ కార్యక్రమంలోని అసలైన మానవీయ కోణం. మనిషి జీవితం ఎంతకాలం సాగిందన్నదే కాదు.. అతడి జ్ఞాపకాలు ఎంతమందికి మేలు చేశాయన్నదీ ముఖ్యమే. ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ, మరొకరి జీవితంలో వెలుగులు నింపడమే వికాస్‌కు అందించిన అర్థవంతమైన నివాళి.

శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో

ఆధ్యాత్మిక శోభ

మంచిర్యాల, (సింగిడి): శ్రీరాంపూర్ ఏరియాలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఏరియాలోని గనులు, వివిధ విభాగాలతో పాటు జీఎం కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గాదేవి (మైసమ్మ) ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం శివపార్వతుల కల్యాణాన్ని వేదమంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భజనలు, అన్నప్రసాద వితరణతో ఆలయ ప్రాంగణం భక్తిమయంగా మారింది. శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్, ఉమారాణి దంపతుల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణ వేడుకలు జరిగాయి. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం జీఎం కార్యాలయ ఉద్యోగులు, ఎస్‌అండ్‌పీసీ విభాగం సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం నిర్వహించిన భజన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. పెద్ద సంఖ్యలో పాల్గొన్నవారికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. నవరాత్రుల్లో ఐదో రోజు అమ్మవారు లలితా త్రిపురసుందరీ దేవి అవతారంలో ఆకుపచ్చని వస్త్రాలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ప్రత్యేక అలంకరణలు, పూజలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వివిధ కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు



కార్యక్రమానికి హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందారు. సింగరేణి సంస్థ అభివృద్ధి, శ్రీరాంపూర్ ఏరియా ప్రగతి నిరంతరం కొనసాగాలని జీఎం మునిగంటి శ్రీనివాస్ ఆకాంక్షించారు. జీఎం కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో కొలువుదీరిన అమ్మవారి అనుగ్రహంతో సంస్థ మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని పేర్కొన్నారు. దసరా పండుగ రోజున ఆలయ ప్రాంగణంలో జమ్మిపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



నోళ్లు మూసుకొని ఇంట్లో కూర్చోండి..

ట్రోలర్స్‌కు వార్నింగ్ ఇచ్చిన స్వరా భాస్కర్

బాలీవుడ్ బ్యూటీ స్వరా భాస్కర్ సినిమాలకు దూరమైనప్పటికీ 'రైజ్ అండ్ ఫాల్' అనే క్రేజీ రియాలిటీ షోలో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. తన మూడేళ్ల కూతురితో ఎక్కువ సమయం గడపడానికి రియాలిటీ షోలే బెస్ట్ ఆప్షన్ అని స్వరా భాస్కర్ స్పష్టం చేశారు. సినిమాల్లో నటిస్తే ఎక్కువ రోజులు క్యారెక్టర్ మూడ్‌లోనే ఉండిపోవాల్సి వస్తుందని, కానీ రియాలిటీ షోలు అయితే తక్కువ సమయంలో పూర్తయి పాపతో ఉండేందుకు వీలవుతుందని ఆమె వెల్లడించారు. అలాగే తన నిజమైన వ్యక్తిత్వాన్ని చూపించడానికి ఇది మంచి ప్లాట్‌ఫామ్‌గా ఉపయోగపడతాయని అన్నారు.

ఇక ప్రసవం తర్వాత తనపై వస్తున్న ట్రోల్స్, బాడీ షేమింగ్‌పై స్వరా భాస్కర్ తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. తల్లులయ్యే మహిళల శరీర ఆకృతిపై దారుణమైన కామెంట్లు చేసేవారికి కనీస మానవత్వం, తెలివితేటలు ఉండవని మండిపడ్డారు. ఐశ్వర్య రాయ్, కత్రినా కైఫ్ వంటి స్టార్లను కూడా ఇలాగే టార్గెట్ చేశారని గుర్తుచేస్తూ.. సన్నగా ఉండటంలోనే సౌందర్యం లేదని, ఆరోగ్యంగా ఉండటమే ముఖ్యమని తేల్చి చెప్పారు. ముఖ్యంగా మహిళల శరీరాలపై ఉచిత సలహాలు, కామెంట్లు ఇచ్చే మగవాళ్లు తమ నోళ్లు మూసుకొని ఇంట్లో కూర్చోవాలని స్వరా ఘాటుగా హెచ్చరించారు.

జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న

గద్వాల సంస్థానం వారసులు, సినీ నటులు

తెలంగాణలోని ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న గద్వాల సంస్థానం వారసులు, సినీ నటులు
తెలంగాణలోని ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.
మూలా నక్షత్రం సందర్భంగా శుక్రవారం ఉదయం అమ్మవారికి కళ్యాణోత్సవం నిర్వహించగా, సాయంత్రం శ్రీ జోగులాంబ అమ్మవారికి సింహ వాహన సేవ నిర్వహించారు. అమ్మవారిని సింహ వాహనంపై దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపారు. కూచిపూడి నృత్య ప్రదర్శన నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కర్నూలుకు చెందిన శ్రీ నటరాజ కూచిపూడి నృత్య శిక్షణాలయం బృందం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. కళాకారులు తమ నృత్య ప్రదర్శనలతో ఆధ్యాత్మిక, సాంస్కృతిక వాతావరణాన్ని మరింత శోభాయమానంగా మార్చారు. కార్యక్రమం అనంతరం నృత్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులకు ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

ప్రముఖుల ప్రత్యేక దర్శనాలు

శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామివార్లను వేర్వేరు సమయాల్లో గద్వాల సంస్థానం వారసులు శ్రీ కృష్ణ రామ్ భూపాల్, సినీ నటుడు శ్రీకాంత్, సినీ నటుడు (ఛత్రపతి) శేఖర్ దర్శించుకున్నారు. స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సహాయం చేయడంలో

ముందుంటాం

సీఎం పిలుపుపై నాగార్జున రియాక్షన్



ఎల్ నినోపై అవగాహన కల్పించేందుకు ఇండస్ట్రీ ముందుకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. తాజాగా దీనిపై టాలీవుడ్ కింగ్, అక్కినేని నాగార్జున స్పందించారు. ఇట్లు అర్జున సినిమా ఈవెంట్ లో ఆయన దీనిపై మాట్లాడారు. ప్రపంచం మొత్తాన్ని ఎల్ నినో తీవ్రంగా ప్రభావితం చేస్తోందన్నారు. ఎల్ నినోపై ప్రజలకు అవగాహన కల్పించడం చాలా అవసరమన్నారు. సినిమా ఇండస్ట్రీలో అందరూ ముందుకు వచ్చి సహాయం చేస్తామన్నారు. సమస్య వచ్చినపుడు సహాయం చేయడంలో ఇండస్ట్రీ ఎప్పుడూ ముందుంటుందని నాగార్జున పేర్కొన్నారు. ఎల్ నినో ఎఫెక్ట్ ఎప్పటి వరకు ఉంటుందో ఎవరికీ తెలియదని, ప్రజలు పొదుపు చర్యలు పాటించాల్సిన అవసరం ఉందని సూచించారు. రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవలే హెచ్చరించారు. దీనిపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి, ఆ నివేదికను కేంద్రం వద్దకు తీసుకెళ్తామన్నారు. ముఖ్యంగా నీరు, విద్యుత్ కొరత రోజురోజుకూ తీవ్రతరమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు కూడా ఒక పం టను ఆపుకుని ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఒకే కుర్రాడి కోసం ఇద్దరు హీరోయిన్ల వార్..

రొమాంటిక్ థ్రిల్లర్‌కు రంగం సిద్ధం!

ప్రస్తుతం వరుస ఆఫర్లతో ఫుల్ ఫామ్‌లో ఉన్న అందాల భామ జాన్వీ కపూర్ తన ఖాతాలో మరో ఆసక్తికర ప్రాజెక్ట్‌ను వేసుకుంది. బాలీవుడ్‌లోనే కాకుండా సౌత్‌లోనూ హాట్ టాపిక్‌గా మారిన జాన్వీ, ఈసారి ఒక మైండ్ బ్లాకింగ్ రొమాంటిక్ థ్రిల్లర్ మూవీతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. 'పగ్లెట్' ఫేమ్ ఉమేష్ బిష్ట దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ సినిమాలో జాన్వీతో పాటు టాలీవుడ్ సెన్సేషన్ శ్రీలీల, యంగ్ హీరో సిద్ధార్థ్ గుప్తా కీలక పాత్రల్లో నటిస్తున్నట్లు సమాచారం.

హిట్ ప్రొడ్యూసర్లు ఏక్తా కపూర్, ఆస్కార్ విన్నర్ గునీత్ మోంగా కపూర్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం ఫస్ట్ షూటింగ్ షెడ్యూల్ నైనితాల్‌లోని సుందరమైన లొకేషన్లలో అధికారికంగా ప్రారంభమైనట్లు నెట్టింట పలు పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. ఒకే పురుషుడిపై పిచ్చి ప్రేమ, మోజు పెంచుకునే ఇద్దరు మహిళల చుట్టూ తిరిగే పవర్-ప్యాక్డ్ థ్రిల్లర్ కథాంశంతో ఈ సినిమా రూపుదిద్దుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇందులో జాన్వీ కపూర్ క్యారెక్టర్ ఎంతో వైవిధ్యంగా, నటనకు విశేష ప్రాధాన్యత ఉన్న పాత్రలో కనిపించబోతున్నట్లు టాక్.



Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737